www.peoplesnews.in

హైదరాబాద్
# పీపుల్స్ న్యూస్
దినపత్రిక

ప్రజల గొంతుక...

ఎడిటర్ : కె. శ్రావణ్ కుమార్

తెలంగాణ - ఆంధ్రప్రదేశ్ సంపుటి : 15 సంచిక : 86 ఆదివారం, డిసెంబర్ 21, 2025 , పేజీలు - 12 వెల: 2/-

Circulated to Hyderabad, Rangareddy, Karimnagar, Nalgonda, Adilabad, Mahaboobnagar, Khammam, Medak, Warangal, Nizamabad

రండి.. అక్షరాన్ని
అనుకున్న విధంగా రాద్దాం

అసలైన అక్షరాన్ని రుచి చూపేందుకు..
కన్నది విన్నది పంచుకున్నది ప్రజలకు అందించాలని..
వారి సాధకబాధకాల్లో మమేకమై
పరిష్కార మార్గాలకు దిక్సూచిగా
మారాలని అనుకుంటున్నారా? విశాలమైన జర్నలిజం
వృత్తిలో రాణించాలని కోరుకుంటున్నారా? అయితే..

హైదరాబాద్ పీపుల్స్ న్యూస్ దినపత్రిక
జిల్లా, మండల మరియు నియోజకవర్గాల
వారిగా రిపోర్టర్లు కావలెను

సంప్రదించండి
తెలంగాణ | ఆంధ్రప్రదేశ్
9866330400

## హైదరాబాద్ చేరుకున్న ఉపరాష్ట్రపతి



**హైదరాబాద్,డిసెంబర్ 20 :** భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ హైదరాబాద్‌లో పర్యటిస్తున్నారు. ద్రౌపది ముర్ము ఇప్పటికే నగరానికి రాగా.. శనివారం సీపీ రాధాకృష్ణన్ చేరుకున్నారు. మధ్యాహ్న సమయంలో శంషాబాద్ విమానాశ్రయానికి ఆయన చేరుకోగా.. మంత్రి శ్రీధర్ బాబు, అధికారులు ఘనస్వాగతం పలికారు. నేడు జరిగే పబ్లిక్ మిగతా2లో...



## పశ్చిమబెంగాల్లో మహా జంగిల్ రాజ్

### చొరబాటుదారులకు అండగా మమత

### విరుచుకు పడ్డ ప్రధాని మోడీ

**కోల్‌కతా, 20 :** తృణమూల్ కాంగ్రెస్ సారథ్యంలోని పశ్చిమబెంగాల్ ప్రభుత్వంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. చొరబాటుదారులను కాపాడుకునేందుకు స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ను మమతా బెనర్జీ ప్రభుత్వం వ్యతిరేకిస్తోందని, బెంగాల్‌లో చొరబాటు దారులకు టీఎంసీ ప్రాపకం లభిస్తోందని విమర్శించారు. తహెర్‌పూర్‌లో శనివారం మిగతా2లో...

# ప్రేమించే గుణాన్ని పంచిన ఏసు ప్రభువు

### ఎల్బీనగర్ క్రిస్మస్ వేడుకల్లో సిఎం రేవంత్

### ఆజ్మీర్ దర్గాకు సిఎం ఛాదర్ సమర్పణ

**హైదరాబాద్,డిసెంబర్ 20 :** ఎల్బీ స్టేడియంలో నిర్వహించిన క్రిస్మస్ వేడుకల్లో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రపంచవ్యాప్తంగా ఒకేసారి జరుపుకునే పండుగగా క్రిస్మస్.. ద్వేషించే వారికి కూడా ప్రేమించే గుణాన్ని ఏసు ప్రభువు మానవాళికి స్ఫూర్తిగా అందించారని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీకి కూడా డిసెంబర్ ఒక మిరాకిల్ మంత్‌గా మారిందని వ్యాఖ్యానించారు. రాజకీయంగా మిగతా2లో...



# ఎంపిటిసి, జడ్పిటిసి ఎన్నికలు డౌటే...



### కెసిఆర్ ఫీల్డ్‌లోకి రాకున్న అద్భుత ఫలితాలు

### తాండూరు నియోజకవర్గ సర్పంచ్‌లతో కెటిఆర్

**హైదరాబాద్,డిసెంబర్ 20 :** ప్రస్తుత పంచాయితీ ఫలితాలు చూశాక, ఎంపిటిసి, జడ్పిటిసి ఎన్నికలు పెడతారని అనుకోవడం లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. సర్పంచ్ ఎన్నికల ఫలితాలు చూసి ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు పెడతారని అనుకోవడం లేదు.. పంచాయతీ ఎన్నికల ఫలితాల విషయంలో రేవంత్ రెడ్డి మీడియా సమావేశంలో ఐదు నిమిషాలకే మాట మార్చారు అని పేర్కొన్నారు. పంచాయతీ ఎన్నికల్లో కేసీఆర్ కాలు బయట పెట్టకపోయినా గులాబీ సైనికులు అద్భుతంగా పోరాడారు, ప్రభుత్వం భయపడే పరిస్థితి వచ్చింది అని కేటీఆర్ అన్నారు. తమకు ఉన్న హక్కులు, నిధులు, విధుల గురించి కొత్తగా ఎన్నికైన సర్పంచ్‌లు తెలుసుకోవాలని కేటీఆర్ సూచించారు. రాజ్యాంగం ప్రకారం ఐదంచెల్లో ప్రభుత్వాలు ఉన్నాయని తెలిపారు. గ్రామ పంచాయతీలకు ఇచ్చే నిధులు సొంత ఆస్తులు, డబ్బులు కావని పేర్కొన్నారు. కమిషన్ ద్వారా జనాభా ప్రాతిపదికన నిధులు ఇస్తారని మిగతా2లో...

# ఉపాధిలో గాంధీ పేరు తొలగించడం దారుణం

### - కేంద్రం తీరుపై మండిపడ్డ సోనియా



**న్యూఢిల్లీ,డిసెంబర్ 20 :** మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం పేరును మార్చడంపై కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ ఛైర్‌పర్సన్ సోనియా గాంధీ తీవ్ర విమర్శలు చేశారు. ఈ పథకాన్ని నీరుగార్చేందుకు మోదీ ప్రభుత్వం దశాబ్దకాలంగా అనేక ప్రయత్నాలు చేసిందని ఆరోపించారు. ఇటీవల ఈ చట్టంలో ఏకపక్షంగా మార్పులు చేయడంతోపాటు దేశంలో కోట్లాదిమంది రైతులు, కార్మికులు, భూమిలేని వారి ప్రయోజనాలపై కేంద్ర ప్రభుత్వం దాడి చేసిందని మండిపడ్డారు. ఈ మేరకు సోనియా మిగతా2లో...

---




## విశాఖలో వాజ్‌పేయ్ విగ్రహావిష్కరణ

# ఉద్యోగ నియామకాల్లో జాప్యం తగదు

**జాబ్ క్యాలెండర్ ఉండాల్సిందే**

**లేకుంటే యువత భవిష్యత్ దెబ్బతింటుంది**

**తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క**



**హైదరాబాద్, 20 :** పబ్లిక్ సర్వీస్ కమిషన్లు దేశ పరిపాలనా వ్యవస్థకు వెన్నెముకలని తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. న్యాయమైన, పారదర్శక నియామకాల ద్వారానే ప్రజాసేవలో ప్రతిభకు స్థానం ఉంటుందని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు. రామోజీ ఫిల్మ్ సిటీలో ఏర్పాటు చేసిన 26వ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఛైర్మన్ల మిగతా2లో...

### కెసిఆర్ అధ్యక్షతన నేడు బీఆర్ఎస్

# శాసనసభాపక్షం భేటీ

**నదీ జలాలు, సాగునీటి ప్రాజెక్టులపై ప్రధానంగా చర్చ**

**ఇదే అంశంపై ఉద్యమ కార్యాచరణకు బిఆర్ఎస్ సిద్ధం**

**మీడియాతో మాట్లాడి వివరాలు వెల్లడించనున్న కెసిఆర్**



**హైదరాబాద్, 20 :** తెలంగాణ భవన్‌లో ఆదివారం బీఆర్ఎస్ శాసనసభాపక్షం, రాష్ట్ర కార్యవర్గం భేటీ కానుంది. పార్టీ అధినేత కేసీఆర్ నేతృత్వంలో నేతలు సమావేశం కానున్నారు. ఇందులో ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాల్గొననున్నారు. నదీ జలాలు, సాగునీటి ప్రాజెక్టుల మిగతా2లో...

# ఆఫర్ల పేరుతో సైబర్ నేరాలు

### అప్రమత్తంగా ఉండాల్సిందే

### ప్రజలను హెచ్చరించిన సిపి సజ్జన్నార్


**హైదరాబాద్,డిసెంబర్ 20 :** ఏపీకే ఫైల్స్, ఓటీపీ, బ్యాంక్ ట్రాన్సిషన్ పై అప్రమత్తంగా ఉండాలని హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ సజ్జనార్ అన్నారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. 'బయట రాష్ట్రాల్లో ఉండి నిందితులు సైబర్ నేరాలకు పాల్పడుతున్నారు. వేరొక స్టేట్స్ లో ఉన్న నిందితుల్ని గుర్తించడం, డబ్బును రికవరీ చేయడం కష్టంగా మారింది. మిగతా2లో...



# పంచాయితీ ఎన్నికలపై కాంగ్రెస్ పోస్ట్‌మార్టమ్

### 16 మంది ఎమ్మెల్యేల పనితీరుపై ఆగ్రహం

**హైదరాబాద్,డిసెంబర్ 20 :** పంచాయతీ ఎన్నికల ఫలితాలపై కాంగ్రెస్ అధిష్ఠానం టెలీకాన్ఫరెన్స్ నిర్వహించింది. సీఎం రేవంత్‌రెడ్డి , టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్, కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్ తదితరులు సమావేశానికి హాజరయ్యారు. పంచాయతీ ఎన్నికల ఫలితాలపై చర్చించారు. ఇటీవలి ఫలితాలపై పోస్ట్మార్టమ్ నిర్వహించారు. రెబల్స్‌ను సమన్వయం చేయలేని ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌ఛార్జులపై రేవంత్‌రెడ్డి, మహేశ్‌కుమార్ గౌడ్ అసహనం మిగతా2లో...



ఆదివారం,
డిసెంబర్ 21, 2025

హైదరాబాద్ పీపుల్స్ న్యూస్ దినపత్రిక



# పశ్చిమబెంగాల్లో మహా జంగిల్ రాజ్

(మొదటి పేజీ తరువాయి)

నాడు జరిగిన ర్యాలీని ఉద్దేశించి ఫోనులో ప్రధాని మాట్లాడుతూ, పశ్చిమబెంగాల్లో టీఎంసీ 'మహా జంగిల్ రాజ్'కు బీజేపీ చరమగీతం పాడుతుందని చెప్పారు. అవినీతి, ఆశ్రితపక్షపాతం, బుజ్జగింపు రాజకీయాలు రాష్ట్రాన్ని ఏలుతున్నాయని ఆరోపించారు. 'వాళ్లు బీజేపీని ఎంత గట్టిగానైనా వ్యతిరేకించనీయండి. కానీ పశ్చిమబెంగాల్ అభివృద్ధిని ఎందుకు అడ్డుకుంటున్నారో నాకయితే అర్థం కావడం లేదు. మీరు మోదీని వ్యతిరేకించండి, కానీ ప్రజల సంతోషాన్ని అడ్డుకోకండి. ప్రజల హక్కులను కాలరాయకండి. వారి కలలను చెల్లాచెదురు చేసే పాపానికి ఒడికట్టకండి. బీజేపీకి ఒక్క అవకాశం ఇవ్వమని పశ్చిమబెంగాల్ ప్రజలకు ముకుళిత హస్తాలతో వేడుకుంటున్నాను' అని మోదీ విజ్ఞప్తి చేశారు. కాగా, వాతావరణ ప్రతికూలత కారణంగా మోదీ హెలికాప్టర్ తహెర్పూర్లో దిగలేకపోయింది. దీంతో ఆయన కోల్కతా విమానాశ్రయానికి తిరిగి వెళ్లిపోయారు. పశ్చిమబెంగాల్లోని నదియా జిల్లా రణఘాట్లో పలు అభివృద్ధి ప్రాజెక్టులకు ప్రధానమంత్రి శంకుస్థాపన చేశారు. వీటిలో రూ.3,200 కోట్లతో నిర్మించనున్న రెండు జాతీయ రహదారి ప్రాజెక్టులు కూడా ఉన్నాయి. ఈ ప్రాజెక్టులు కోల్కతాను సిలిగురితో అనుసంధానిస్తూ సుమారు రెండు గంటల ప్రయాణ సమయం ఆదా చేస్తాయని పీఎంఓ తెలిపింది. ఈ ప్రాజెక్టులతో ఆర్థిక కార్యకలాపాలు విస్తృతం కావడంతో పాటు పర్యాటకం కూడా పెరుగుతుందని పేర్కొంది.

# ఎంపిటిసి, జడ్పిటిసి ఎన్నికలు డౌటే...

(మొదటి పేజీ తరువాయి)

వివరించారు. బీఆర్ఎస్ హయాంలో ఫైనాన్స్ కమిషన్ ద్వారా రూపాయి వస్తే.. మరో రూపాయి రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిందని కేటీఆర్ తెలిపారు. గ్రామ పంచాయతీలకు పథకాలను ఆపే శక్తి ఎవరికీ లేదని స్పష్టం చేశారు. తాండూర్ నియోజకవర్గంలో నూతనంగా ఎన్నికైన బీఆర్ఎస్ సర్పంచ్లతో హైదరాబాద్ తెలంగాణ భవన్లో కేటీఆర్ ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. ఈ ప్రభుత్వానికి ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు పెట్టే దమ్ము లేదని కేటీఆర్ విమర్శించారు. మాకే నిధులు ఇవ్వడం లేదని మహబూబ్నగర్ ఎమ్మెల్యే డైరెక్ట్గా చెప్పిండని గుర్తుచేశారు. నిధులు ఇవ్వాలని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే వరల్డ్ బ్యాంకుకు లేఖ రాసిన విషయాన్ని ఆయన ప్రస్తావించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్న చోట అభివృద్ధి అనేది ఉండదని అన్నారు. కేసీఆర్ హయాంలో డంపింగ్ యార్డ్లు, పల్లె ప్రకృతి వనాలు, క్రీడా మైదానాలు ఏర్పాటు చేశారని తెలిపారు. దీనివల్ల 21 జాతీయ పంచాయతీ అవార్డులను తెలంగాణ సాధించిందని చెప్పారు. పార్లమెంట్ ఎన్నికలు గెలవడం సులభం.. కానీ పంచాయతీ ఎన్నికల్లో గెలవడమే కష్టమని కేటీఆర్ తెలిపారు. ఈ రెండేళ్లు మనకు కష్టంగా ఉంటుందని కొత్తగా ఎన్నికైన బీఆర్ఎస్ సర్పంచ్లతో అన్నారు. రేవంత్ సర్కార్ అన్ని వర్గాలను మోసం చేసిందని కేటీఆర్ విమర్శించారు. షాపుల యూరియా ఇవ్వనోడు.. యాప్ల యూరియా ఇస్తాడంట అని ఎద్దేవా చేశారు. 2014 నాటికి తెలంగాణ అప్పు రూ.72 వేల కోట్లుగా ఉందని తెలిపారు. 2023 నాటికి తెలంగాణ అప్పు రూ.మూడున్నర లక్షల కోట్లు అయ్యిందని అన్నారు. అంటే.. బీఆర్ఎస్ హయాంలో రూ.2.80 లక్షల కోట్ల అప్పు చేశారని వివరించారు. అంటే కేసీఆర్ చేసిన మొత్తం అప్పు రూ.2.80 లక్షల కోట్లే అని తెలిపారు. అదే రేవంత్ రెడ్డి అప్పు తెచ్చి ఏంచేసిండో చెప్పాలని డిమాండ్ చేశారు. త్వరలోనే మున్సిపల్ ఎన్నికలు రాబోతున్నాయని కేటీఆర్ తెలిపారు. తాండూరులో ఉండే 36 వార్డుల్లో ఇప్పటి నుంచే ఎన్నికలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. మున్సిపల్ ఎన్నికల్లో గెలుపు కోసం ఇప్పటి నుంచే కార్యాచరణ చేపట్టాలని అన్నారు.తాండూరు నియోజకవర్గం నూతన సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులకు సన్మాన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరై కేటీఆర్, తలసాని శ్రీనివాస్ యాదవ్ వారిని సన్మానించారు. కాంగ్రెస్ ఎక్కడ ఉంటే అక్కడ ప్రోగ్రెస్ ఉండదు.. రెండేళ్లు మనకు కష్టాలు తప్పవు అని సెటైర్లు వేశారు. అయితే, కారు గుర్తు ఉండి, కేసీఆర్ గుర్తుకు వస్తే పరిస్థితి ఎలా ఉంటుందో ఊహించుకోండి అని కేటీఆర్ తెలిపారు. రెండేళ్లు బీఆర్ఎస్ కు పరీక్ష కాలం.. కాంగ్రెస్ వాళ్లు ఏమైనా అంటే తలదించుకుని వెళ్లండి, రెండు అడుగులు వెనక్కు వెళ్లండి అని సూచించారు. పంచాయతీలకు డబ్బులు కేంద్ర ప్రభుత్వం నుంచి నేరుగా వస్తాయి, ఎవరి ప్రమేయం ఉండదన్నారు. బీఆర్ఎస్ సర్పంచులకు ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వమని ఓ కాంగ్రెస్ ఎమ్మెల్యే అంటున్నారు.. ఇందిరమ్మ ఇండ్లు, పెన్షన్లు ఇలా అన్నింటి జాబితా పంచాయతీల్లో పెట్టాల్సిందే.. సర్పంచులు, పంచాయతీల చేతిలోనే ఉంటుంది.. నిధులు రావడం లేదని కాంగ్రెస్ ఎమ్మెల్యేలే చెప్తున్నారు.. కాంగ్రెస్ చేతిలో మోసపోని వారంటూ ఎవరూ లేరు, అందరూ బాధపడుతున్నారు.. జనవరి, ఫిబ్రవరిలో మున్సిపల్ ఎన్నికలు వస్తాయని అంటున్నారు.. ఇప్పటి నుంచే సిద్ధం కావాలి.. గ్రామీణ ప్రాంతాల వారికి మున్సిపల్ ఎన్నికల బాధ్యతలు అప్పగించండి అని మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు.

# కెసిఆర్ అధ్యక్షతన నేడు బీఆర్ఎస్ శాసనసభాపక్షం భేటీ

(మొదటి పేజీ తరువాయి)

అంశంపై పోరుకు బీఆర్ఎస్ సిద్ధమవుతోంది. ఈ సమావేశంలో వీటిపై కేసీఆర్ ఉద్యమ కార్యాచరణ ప్రకటించనున్నట్లు సమాచారం. ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓటమి తర్వాత గులాబీ బాస్, మాజీ సీఎం కేసీఆర్ ఫాంహౌస్కే పరిమితమయ్యారు. ఇటీవల జరిగిన జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక, స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించిన సమావేశాలు, పార్టీ నేతలతో సమావేశాలను కూడా కేసీఆర్ అక్కడి నుంచే నిర్వహిస్తూ వస్తున్నారు. ఈ రెండేళ్లలో కేసీఆర్ ప్రజలకు కనిపించింది చాలా అరుదనే చెప్పుకోవాలి. అయితే తెలంగాణ సాగునీటి హక్కుల రక్షణ కోసం కేసీఆర్ రంగంలోకి దిగనున్నారు. ఆదివారం తెలంగాణ భవన్కు బీఆర్ఎస్ అధినేత రానున్నారు.కేసీఆర్ అధ్యక్షతన రేపు మధ్యాహ్నం 2 గంటలకు బీఆర్ఎస్ఎల్పీ, రాష్ట్ర కార్యవర్గ సంయుక్త సమావేశం జరుగనుంది. నదీ జలాల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యంపై కేసీఆర్ సమరశంఖం పూరించనున్నారు. తెలంగాణ సాగునీటి హక్కుల రక్షణ కోసం మరో ప్రజా ఉద్యమంపై మాజీ సీఎం దిశానిర్దేశర చేయనున్నారు. బీఆర్ఎస్ఎల్పీ సమావేశం తర్వాత కేసీఆర్ మీడియాతో మాట్లాడే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. పాలమూరు - రంగారెడ్డి ప్రాజెక్ట్లో 45 టీఎంసీలకే కాంగ్రెస్ ప్రభుత్వం ఒప్పుకుందనేది బీఆర్ఎస్ వాదన. నదుల అనుసంధానం పేరుతో ఏపీ జలదోపిడీకి కేంద్రం సహకరిస్తోందని ఆ పార్టీ ఆరోపిస్తోంది. రాష్టం÷-ర నుంచి 8 మంది బీజేపీ ఎంపీలు ఉన్నా నోరు మెదపటం లేదని కేసీఆర్ ఆగ్రహం వ్యక్తం చేస్తున్న పరిస్థితి. కాంగ్రెస్, బీజేపీలను తెలంగాణ సమాజం ముందు దోషిగా నిలబెడతామని బీఆర్ఎస్ చెబుతోంది. మరోవైపు బీఆర్ఎస్ పార్టీ ప్రక్షాళనలపైనా కేసీఆర్ దృష్టి సారించారు. పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేసేందుకు కేసీఆర్ ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలుస్తోంది. కాగా.. చాలా రోజుల తర్వాత తమ అధినేత తెలంగాణ భవన్కు రానుండటంతో పార్టీ శ్రేణుల్లో జోష్ నెలకొంది.

# ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ దూకుడు

### ప్రభాకర్ రావుపై విచారణ వేగవంతం

### ఆధారాలు రాబల్లే యత్నాల్లో అధికారులు

**హైదరాబాద్,డిసెంబర్ 20 :** తెలంగాణలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ విచారణ వేగం పెంచింది. ఈ కేసులో తెలంగాణ ప్రభుత్వం తాజాగా కొత్త ప్రత్యేక దర్యాప్తు బృందం ను ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. హైదరాబాద్ సీపీ సజ్జనార్ నేతృత్వంలో సిట్ విచారణ కొనసాగనుంది. కొత్తగా ఏర్పాటు చేసిన సిట్లో 9 మంది అధికారులు ఉన్నారు. ఈ నేపథ్యంలో సిట్ అధికారులు శనివారం నుంచి కీలక విచారణను ప్రారంభించారు. ఈ కేసులో కీలక నిందితుడు, ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్ రావు కస్టోడియల్ విచారణ గడువును మరో వారం రోజుల పాటు సుప్రీం కోర్టు పొడిగించింది. ఇందులో భాగంగా ప్రభాకర్ రావును పోలీసులు మళ్లీ జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్కు తీసుకువచ్చి విచారణ చేపట్టనున్నారు.వారం రోజుల విచారణలో ఫోన్ ట్యాపింగ్ వ్యవహారానికి సంబంధించిన కీలక నిజాలు వెలుగులోకి వచ్చే అవకాశాలు ఉన్నాయని పోలీస్ వర్గాలు




భావిస్తున్నాయి. ఈ కేసుకు సంబంధించిన కీలక ఆధారాలు, మరికొందరి పాత్రపై స్పష్టత వచ్చే అవకాశం ఉండటంతో రాజకీయ, పరిపాలనా వర్గాల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. ఈ క్రమంలో జూబ్లీహిల్స్ పీఎస్లో ప్రస్తుతం ప్రభాకర్ రావును సిట్ అధికారులు విచారిస్తున్నారు. ఈ కేసును సమగ్రంగా పరిశీలించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కొత్త సిట్ను నియమించగా.. ఆ బృందంతో శుక్రవారం హైదరాబాద్ సీపీ సజ్జనార్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కేసు పురోగతి, విచారణ విధానం, సాంకేతిక అంశాలు, ఆధారాల సేకరణ వంటి పలు కీలక విషయాలపై సిట్ అధికారులకు సీపీ స్పష్టమైన దిశానిర్దేశర చేసినట్లు తెలుస్తోంది. ఈ మేరకు శనివారం ఉదయం నుంచే పలువురు సిట్ అధికారులు జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్కు చేరుకుని విచారణ ప్రారంభించారు. అధికారులు ఈ వారం రోజుల పాటు ప్రభాకర్ రావును నిరంతరంగా ప్రశ్నించనున్నారు. సిట్ విచారణను సమర్థవంతంగా నిర్వహించేందుకు బషీర్బాగ్లోని సీసీఎస్ కార్యాలయంలో ప్రత్యేకంగా ఒక రూమ్ను కేటాయించారు. అక్కడే కస్టోడియల్ విచారణ జరగనుంది. ప్రభాకర్ రావును ఈ నెల 25వ తేదీ వరకు కస్టడీలో ఉంచి విచారించేందుకు సుప్రీంకోర్టు అనుమతి లభించినట్లు సమాచారం. ఇప్పటికే ఈ కేసులో అరెస్టయిన ఇతర నిందితులను కూడా సిట్ అధికారులు పిలిపించి, ప్రభాకర్ రావు ఎదుటే ప్రశ్నిస్తున్నారు. గతంలో వారు ఇచ్చిన స్టేట్మెంట్లు, సాంకేతిక ఆధారాలు, డేటా విశ్లేషణ ఆధారంగా ప్రభాకర్ రావును సమగ్రంగా విచారిస్తున్నారు.ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పాత్ర పోషించిన వ్యక్తిగా భావిస్తున్న ప్రణీత్ రావుతో కలిపి కూడా ప్రభాకర్ రావును సిట్ అధికారులు ప్రశ్నించనున్నారు. వీరిద్దరి మధ్య జరిగిన సంభాషణలు, ఆదేశాలు, అమలైన విధానం, రాజకీయ నేతలు, ఇతరుల ఫోన్ల ట్యాపింగ్ అంశాలపై స్పష్టత కోసం అధికారులు దృష్టి సారించినట్లు తెలుస్తోంది.

# పంచాయితీ ఎన్నికలపై కాంగ్రెస్ పోస్ట్‌మార్టమ్

(మొదటి పేజీ తరువాయి)

వ్యక్తం చేశారు. పంచాయతీ ఎన్నికల్లో సరిగా పనిచేయని 16 మంది ఎమ్మెల్యేలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యంగా నల్లగొండలో ఎమ్మెల్యేల్లో సమన్వయ లోపం కనిపించిందని భావించారు. రెబల్స్‌తో సమన్వయ లోపం, బంధువులను అభ్యర్థులుగా నిలబెట్టడాన్ని తప్పుబట్టారు. పార్టీకి తీరని నష్టం చేశారని ఆందోళన వ్యక్తం చేశారు. వైఖరి మార్చుకుని పార్టీ నియమ నిబంధనలకు లోబడి పనిచేయాలని ఆదేశించారు. తెలంగాణలో జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ జయకేతనం ఎగురవేసింది.

మొదటి, రెండో విడతల్లో సుమారు 56 శాతం స్థానాలను గెలిచిన పార్టీ మూడో విడతలోనూ అదే ఆధిక్యాన్ని కొనసాగించింది. 31 జిల్లాల్లోని 12,733 పంచాయతీ సర్పంచి పదవులకు మూడు విడతల్లో ఎన్నికలు జరిగాయి.

ఇందులో 7,010 స్థానాల్లో కాంగ్రెస్ విజయం సాధించింది.
3,502 స్థానాల్లో భారాస గెలుపొందింది. భాజపా 688 స్థానాలు పొందగా...
ఇతరులు 1,505 స్థానాల్లో గెలిచారు.
అయితే తమకు పట్టున్న కొన్ని చోట్ల స్థానాలను కోల్పోవడంపై కాంగ్రెస్ అధిష్ఠానం సీరియస్‌గా ఉంది. ఈక్రమంలోనే దానికి బాధ్యులైన ఎమ్మెల్యేలు, నియోజకవర్గ బాధ్యులతో సమావేశం నిర్వహించింది.

# ఉపాధిలో గాంధీ పేరు తొలగించడం దారుణం

(మొదటి పేజీ తరువాయి)

గాంధీ ఓ వీడియో మెసేజ్ రిలీజ్ చేశారు.సరిగ్గా 20 ఏళ్ల క్రితం మన్మోహన్ సింగ్ ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు ఉపాధి హామీ పథకాన్ని పార్లమెంటు ఏకాభిప్రాయంతో ఆమోదించిన విషయాన్ని సోనియా గాంధీ గుర్తుచేశారు. అదో విప్లవాత్మకమైన అడుగు అని.. అత్యంత పేదలు, అణగారినవారి జీవితాలకు ఆ పథకం ఉపాధి మార్గంగా నిలిచిందన్నారు. వలసలు ఆగిపోవడమే కాకుండా, ఉపాధికి హామీ దక్కిందన్నారు. మహాత్మాగాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్య స్థాపనకు అనుగుణంగా తీసుకొచ్చిన ఆ పథకాన్ని మోదీ ప్రభుత్వం అణచివేసిందని ఆరోపించారు.గడిచిన 11 ఏళ్లుగా గ్రామీణ పేదల ప్రయోజనాలను విస్మరించిన కేంద్ర ప్రభుత్వం.. మహాత్ముడి పేరును తొలగించడమేగాక పథకం స్వరూపాన్నే మార్చిందని సోనియాగాంధీ ఆగ్రహం వ్యక్తంచేశారు. ఎలాంటి చర్చ లేకుండా, ఎవరినీ సంప్రదించకుండా, విపక్షాలను పరిగణనలోకి తీసుకోకుండా ఏకపక్షంగా చట్టాన్ని మార్చివేయడం దారుణమని అన్నారు. దీనికి వ్యతిరేకంగా పోరాడేందుకు లక్షలాది మంది కాంగ్రెస్ కార్యకర్తలు సిద్ధంగా ఉన్నారని చెప్పారు.

# విశాఖలో వాజ్‌పేయ్ విగ్రహావిష్కరణ

**విశాఖపట్నం,డిసెంబర్ 20 :**భారత మాజీ ప్రధాని, దివంగత అటల్ బిహారీ వాజ్‌పేయి కాంస్య విగ్రహాన్ని కేంద్ర మంత్రి బండి సంజయ్ విశాఖపట్నంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఏపీ భాజపా అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, మంత్రి సత్యకుమార్ యాదవ్, పలువురు ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. బైక్ ర్యాలీ నిర్వహించారు. వాజ్‌పేయ్ దార్శనికతను కొనియాడారు.

# ఆఫర్ల పేరుతో సైబర్ నేరాలు

(మొదటి పేజీ తరువాయి)

ఈ సైబర్ మోసాల కారణంగా హైదరాబాద్ ప్రజలు రోజుకు కోటి రూపాయలు నష్టపోతున్నారు. అలానే సైబర్ నేరగాళ్లు రెండు విధాలుగా నేరాలకు పాల్పడుతున్నారు. ఒకటి పెట్టుబడి పేరుతో మోసం చేస్తున్నారు.... రెండోవది డిజిటల్ అరెస్ట్ తో మోసం చేస్తున్నారని హెచ్చరించారు. డిజిటల్ అరెస్ట్ తో ఎక్కువగా వృద్ధులు, రిటైడ్ ఉద్యోగులు మోసపోతున్నారు. ప్రజలు సైబర్ కేటుగాళ్లు, వాళ్ల మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలి. ఏమైనా అనుమానాస్పద కాల్స్ వస్తే 1930 కి లేదా 100 కి కాల్ చేయాలన్నారు. రాబోయే పండుగలు సంక్రాంతి, క్రిస్మస్ సందర్భంగా సైబర్ నేరగాళ్లు ఆఫర్ల పేరుతో మోసాలకు పాల్పడే అవకాశం ఉంది. ఇక మధుర నగర్లో ట్రాఫిక్ సమస్యల నివారణకు త్వరలో చర్యలు కూడా తీసుకుంటాం. మధుర నగర్ పోలీస్ స్టేషన్ ను త్వరలోనే ప్రజలకి అనువుగా అందుబాటులో ఉండే ప్రాంతంలో ఏర్పాటు చేస్తాం' అని సజ్జనార్ వెల్లడించారు. ఫోన్ ట్యాపింగ్ కేసు పై కూడా సజ్జనార్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఫోన్ ట్యాపింగ్ కేసుల్లో సిట్ ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. ఈ కేసుల్లో ఇన్వెస్టిగేషన్ జరుగుతుందని, త్వరలో అన్ని వివరాలు తెలియజేస్తామని సజ్జనార్ వెల్లడించారు. ఫోన్ ట్యాపింగ్ విషయంలో అన్ని వివరాలు సేకరిస్తున్నామన్నారు. దీనికి సంబంధించి సిట్ కార్యాలయం విషయంలో ఆలోచన చేస్తున్నామని, ప్రస్తుతం జూబ్లీహిల్స్ పీఎస్ లోనే ఫోన్ ట్యాపింగ్ సంబంధించి విచారణ సాగుతుందని తెలిపారు. మరోవైపు ఐ బొమ్మ రవి కేసు గురించి అడిషనల్ సీపీ శ్రీనివాస్ పలు విషయాలను వెల్లడించారు. 'ఐ బొమ్మ రవి విచారణ జరుగుతుంది. సమాధానాలు చేప్పడంలేదని బయట ఊహాగానాలు వస్తున్నాయి. మా స్టైల్ లో మేము విచారణ చేస్తున్నాము. అతని నుండి సమాధానాలు రాబడుతున్నాం' అని ఆయన వెల్లడించారు.

# ప్రేమించే గుణాన్ని పంచిన ఏసు ప్రభువు

(మొదటి పేజీ తరువాయి)

భారీ మూల్యం చెల్లించి, ఆంధ్రప్రదేశ్‌లో పార్టీకి నష్టం జరిగినప్పటికీ సోనియా గాంధీ తెలంగాణ రాష్ట్రాన్ని ప్రసాదించారని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. అయితే, గతంలో సోనియా గాంధీ ఫుడ్ సెక్యూరిటీ యాక్ట్‌ను తీసుకొచ్చి పేదలకు భరోసా కల్పించారని సీఎం రేవంత్ రెడ్డి చెప్పుకొచ్చారు. ఈరోజు తెలంగాణలో తమ ప్రభుత్వం పేదలకు దొడ్డు బియ్యం స్థానంలో సన్న బియ్యం అందిస్తున్నామని తెలిపారు. అలాగే, విద్య, వైద్యం లాంటి కీలక సేవలను ప్రభుత్వంతో సమానంగా క్రిస్టియన్ మిషనరీలు కూడా పేదలకు అందిస్తూ, సమాజ సేవలో కీలక పాత్ర పోషిస్తున్నాయని ముఖ్యమంత్రి ప్రశంసించారు. క్రిస్మస్ పండుగ ప్రేమ, సేవ, త్యాగాలకు ప్రతీకగా నిలుస్తుంది.. ఆ విలువలను ప్రతి ఒక్కరూ అనుసరించాలని రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. ఇదిలావుంటే అజ్మీర్ షరీఫ్ దర్గాకు రాష్ట్ర ప్రభుత్వం తరపున ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చాదర్ సమర్పించారు. ఈ క్రాయక్రమంలో మంత్రులు అజారుద్దీన్, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ, వేం నరేందర్ రెడ్డి,ఎంపీ బలరాం నాయక్, ఎమ్మెల్యేలు, ఫహీం ఖురేషీ, తెలంగాణ హజ్ కమిటీ చైర్మన్ అఫ్జల్ బియాబని, వక్ఫ్ బోర్డు చైర్మన్ అజ్మతుల్లా హుస్సేనీ, మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, ముస్లిం మైనారిటీ నేతలు హాజరయ్యారు..

# ఉద్యోగ నియామకాల్లో జాప్యం తగదు

(మొదటి పేజీ తరువాయి)

జాతీయ సదస్సు ముగింపు కార్యక్రమంలో భట్టి విక్రమార్క పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉపముఖ్యమంత్రి మాట్లాడుతూ.. పరీక్షలకు వార్షిక జాబ్ క్యాలెండర్ తప్పనిసరని అన్నారు. ఉద్యోగ నియామకాల జాప్యం యువత భవిష్యత్తును దెబ్బతీస్తాయని.. ముందస్తు ప్రణాళికతోనే వారిలో విశ్వాసం పెరుగుతుందని చెప్పుకొచ్చారు. తెలంగాణ పీఎస్సీ విజయవంతంగా జాబ్ క్యాలెండర్ అమలు చేస్తోందని చెప్తూ కమిషన్ ఛైర్మన్, సభ్యులను రాష్ట్ర ప్రభుత్వం తరపున అభినందించారు. పారదర్శకతే పబ్లిక్ సర్వీస్ కమిషన్ల ప్రాణమని.. ప్రశ్నాపత్రాల తయారీ నుంచి తుది ఎంపిక వరకూ ప్రతి దశ స్పష్టంగా ఉండాలన్నారు. ప్రశ్నాపత్రాల లీకేజ్‌లు ప్రజాసేవ విలువలకు విరుద్ధమని.. వాటిని కట్టడి చేసేందుకు ఆధునిక భద్రతా వ్యవస్థలు, నైతిక శిక్షణ అవసరమని సూచించారు. రిజర్వేషన్లు సంఖ్యలకే కాదని, వాస్తవిక ఫలితాలు ఇవ్వాలంటూ డిప్యూటీ సీఎం భట్టి చెప్పుకొచ్చారు. ఈ కార్యక్రమానికి ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్ బాబు, పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఛైర్మన్ బుర్రా వెంకటేశం హాజరయ్యారు.


# హైదరాబాద్ చేరుకున్న ఉపరాష్ట్రపతి

(మొదటి పేజీ తరువాయి)

సర్వీస్ కమిషనర్ల ముగింపు సదస్సులో ఉప రాష్ట్రపతి పాల్గొనున్నారు. మరోవైపు శీతాకాల విడిది కోసం వచ్చిన రాష్ట్రపతి.. రామోజీ ఫిల్మ్‌సిటీలో జరిగిన పబ్లిక్ సర్వీస్ కమిషన్(పీఎస్సీ) ఛైర్‌పర్సన్ల జాతీయ సదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈరోజు గచ్చిబౌలిలో బ్రహ్మ కుమారిస్ శాంతి సర్వోవర్‌ను ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ, మంత్రి సీతక్క రాష్ట్రపతి ముర్ముకి ఘనస్వాగతం పలికారు. బ్రహ్మ కుమారిస్ 21వ వార్షికోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో ఆమె మొక్కలు నాటారు. కాగా, రెండ్రోజుల పర్యటన సందర్భంగా నేడు హైదరాబాద్‌కు చేరుకున్న ఉపరాష్ట్రపతి.. నేరుగా రామోజీ ఫిల్మ్ సిటీకి వెళ్లనున్నారు. అక్కడ నిర్వహిస్తున్న జాతీయ స్థాయి పబ్లిక్ సర్వీస్ కమిషన్ల ఛైర్‌పర్సన్ల సమావేశ ముగింపు సెషన్‌లో ముఖ్య అతిథిగా పాల్గొనున్నారు. ఈ కార్యక్రమం రాజ్‌భవన్‌కి వెళ్లి రాత్రికి అక్కడే బస చేయనున్నారు. ఆదివారం ఉదయం శ్రీ రామచంద్ర మిషన్, హార్ట్‌ఫుల్‌నెస్ ఇన్‌స్టిట్యూట్ ఆధ్వర్యంలో రంగారెడ్డి జిల్లా కన్హా శాంతి వనంలో నిర్వహించే వరల్డ్ మెడిటేషన్ డే కార్యక్రమానికి ఆయన హాజరవుతారు. అనంతరం ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ నేరుగా ఢిల్లీకి బయలుదేరుతారు. రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి పర్యటనల నేపథ్యంలో తెలంగాణ, హైదరాబాద్ పోలీసులు భారీ బందోబస్తు నిర్వహిస్తున్నారు.

# అధికారుల పర్యవేక్షణ కరువు.. కాంట్రాక్టర్ నిర్లక్ష్యం

### రేపాక ప్రజల అవస్థలకు నిరసనగా ధర్నా రాస్తారోకో..





**రేగొండ,డిసెంబర్20(పీపుల్స్ న్యూస్)** పాలకుల నిర్లక్ష్యం.. అధికారుల అశ్రద్ధ.. కాంట్రాక్టర్ జాప్యంతో రేపాక ప్రజలు గ్రామంలో పలు అవస్థలు పడుతున్నారు. కాంట్రాక్టర్ నిర్లక్ష్యం మూలంగా మధ్యలో కంకర,చూర పోచి ఆపేసిన రోడ్డు కంకర వలన వాహనాల రద్దీతో డస్ట్ లేచి రోడ్డు ఇరుపక్కల ఉన్న ఇళ్లల్లోనే కుటుంబ సభ్యులతో సహా పలువురు వ్యాధుల బారిన పడుతుండడంతో శనివారం కాంట్రాక్టర్ అశ్రద్ధకు నిరసనగా గ్రామస్తులు, పార్టీలకతంగా యువత కదిలి వచ్చి ధర్నా రాస్తారోకో నిర్వహించారు. ధర్నా సందరరేగా యువత ప్రజలు కాంట్రాక్టర్ అశ్రద్ధతో గ్రామం నుంచి వెళ్లే గ్రామ శివారులో ఉన్న రైతు వేదిక భవనం వరకు సీసీ రోడ్డుకు బదులు తారు రోడ్డు నిర్మించాలని చిట్యాల-రేగొండ రహదారిపై ధర్నా వేస్తారోకో నిర్వహించారు. శనివారం ఉదయం నుంచి రేపాకలో రహదారి కోసం ప్రజల ధర్నాఏడాదిగా పూర్తికాని పనులు చేయకపోవడం పట్ల.. గ్రామంలో సిసి రోడ్డుకు బదులు తారు రోడ్డు నిర్మించిన్యాయం చేయాలని గ్రామస్తుల డిమాండ్ చేశారు. గత రెండేళ్ల కింద రోడ్డు మంజూరైన అధికారుల నిర్లక్ష్యం పాలకుల ఉదాసీనత చూపడంతో రేపాక గ్రామ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ఏడాది కాలంగా అసంపూర్తిగా ఉన్న రోడ్డు పనులను నిరసిస్తూ శనివారం చిట్యాల - రేగొండ ప్రధాన రహదారిపై మహా ధర్నా చేపట్టారు.రేపాకలో నరకప్రాయంగా మారిన ప్రయాణం: రేపాక గ్రామం నుంచి రైతువేదిక వరకు రోడ్డు వేస్తామని చెప్పి, ఏడాది క్రితం కంకర పోసి వదిలేశారని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కంకర రోడ్డుపై ప్రయాణించడం ప్రాణసంకటంగా మారిందని, వాహనాలు స్కిడ్ అయి ఎంతోమంది గాయపడ్డారని మండిపడ్డారు. ముఖ్యంగా వాహనాలు వెళ్లేటప్పుడు లేస్తున్న దుమ్ము, ధూళితో ఇళ్లలో ఉండలేకపోతున్నామని, శ్వాసకోశ వ్యాధుల బారిన పడుతున్నామని వాపోయారు. దాదాపు అరగంటకు పైగా గ్రామ ప్రజలు రోడ్డుపై బైఠాయించడంతో వాహనాలు భారీ ఎత్తున నిలిచాయి. గ్రామ ప్రజలు మాట్లాడుతూ..తమకు సి.సి రోడ్డు వద్దని, నాణ్యమైన తారు రోడ్డు నిర్మించాలని డిమాండ్ చేశారు. అధికారులు వెంటనే స్పందించకుంటే రెండు రోజుల్లో రేగొండ మండల కేంద్రంలో భారీ ఎత్తున నిరసన వ్యక్తం చేస్తామని తెలిపారు.ఈ నిరసనలో రాజకీయాలకు అతీతంగా గ్రామస్తులు, యువకులు స్వఛరేదంగా పాల్గొని తమ నిరసన గళాన్ని వినిపించారు.చూడాలి మరి రేపాక ప్రజల అర్థనాదలా గోస..!

# ఇంచెంచేరుపల్లి గ్రామంలో కాంగ్రెస్ కార్యకర్తలు నిరుత్సాహం

### పార్టీ నుండి బయటికి వెళ్లి స్వాతంత్రంగా సేవ చేద్దామని ఆలోచన
### పార్టీని భుజం మీద వేసుకున్న కార్యకర్తలకే కాంగ్రెస్ పార్టీ వెన్నుపోటు
### చిన్నాల స్రవంతి - రాజు వార్డునెంబర్



**ములుగు జిల్లా ప్రతినిధి డిసెంబర్ 20 (పీపుల్స్ న్యూస్)**వెంకటాపూర్ మండలం ఇంచెంచరుపల్లి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ హామీలు గందరగోళం గత రెండు రోజుల జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికల విషయంలో కాంగ్రెస్ పార్టీకి సంబంధించిన గ్రామ కమిటీ అధ్యక్షులు కోమండ్ల తిరుపతి రెడ్డీ , గ్రామ సర్పంచ్ గా గెలిచిన అభ్యర్థి సభవత్ ఇశ్రానాయక్ లు గ్రామ ఉప సర్పంచ్ గా ఇస్తానిహామీ ఇచ్చి మోసం చేయడం జరిగిందని అన్నారు కాంగ్రెస్ పార్టీలో ఉండడం కంటే స్వాతంత్రంగా ప్రజలకు సేవ చేయడం మేలు అని అన్నారు. కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి ప్రజలు గ్రామ కూడా వేరే దారి చూసుకునే ఆలోచనలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ఉన్నారని అన్నారు.కాంగ్రెస్ పార్టీని ఇంచెంచేరువు పల్లి గ్రామంలో భుజాల మీద వేసుకొని కష్టం వచ్చినా నష్టం వచ్చిన చేదోడువాదిడిగా ఉంటూ పార్టీకి సేవ చేసుకునే వాళ్లకి ఈరోజు కాంగ్రెస్ పార్టీ మోసం చేసిందని అన్నారు. ములుగు జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్ కార్యకర్తలు కూడా ఇలాగే బాధపడుతూ కాంగ్రెస్ పార్టీలో ఉన్నారని అన్నారు పార్టీలో కొత్తగా జాయిన్ అయిన వారికి పదవులు ఇచ్చుకుంటూ గ్రామాన్ని ఆగం చేస్తున్నారని అన్నారు పార్టీని భుజం మీద వేసుకొని తిరిగేవారికి కార్యకర్తలు నిరుత్సాహంగా ఉన్నారని అన్నారు. ఇది ఇలాగనే కొనసాగితే రాబోయే రోజులలో ములుగు అసెంబ్లీ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరవేయడం చాలా కష్టమని అన్నారు

# ఫోటోగ్రాఫర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షులు హుస్సేన్ జిల్లా అధ్యక్షులు గాదె లింగమూర్తి చే సన్మానం





**ములుగు (వెంకటాపూర్ ) జిల్లా ప్రతినిధి డిసెంబర్ 20 (పీపుల్స్ న్యూస్ )**ఉమ్మడి వరంగల్ జిల్లా అసోసియేషన్ ఏర్పాటు అయ్యి 50 సంవత్సరాల పూర్తి చేసుకున్న సందర్భంగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న సీనియర్ ఫోటోగ్రాఫర్లకు హనుమకొండలోని బాలసముద్రంలో గల కాళోజి కళాక్షేత్రంలో శనివారం సన్మానం నిర్వహించారు. వెంకటాపూర్ మండల కేంద్రానికి చెందిన మోడం శ్రీనివాస్ మహావీర్ ఫోటో స్టూడియో, దేశిని మహేందర్ గౌడ్ శ్రీరామ ఫోటో స్టూడియో, లక్ష్మీదేవి పేటకు చెందిన బీరెల్లి రమేష్ రవిరాజా ఫోటో స్టూడియోల వారిని ఫోటోగ్రాఫర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షులు హుస్సేన్, జిల్లా అధ్యక్షులు గాదె లింగమూర్తి, అసోసియేషన్ కమిటీ సభ్యులచే శాలువాలతో సత్కరించి మేమంటూ అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఫోటోగ్రాఫర్ల సంఘం బలోపేతానికి తమ వంతు కృషి చేశామని రాబోయే రోజుల్లో కూడా సంఘం అభివృద్ధిలో పాలుపంచుకుంటామని వారు అన్నారు. ఫోటోగ్రఫీ సంఘంలో సుమారు 20 సంవత్సరాల క్రింద చేరి సంఘంలో ఎనలేని సేవలు చేసినందుకుగాను ఈ సత్కారం మాకు లభించిందని వారు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఉమ్మడి వరంగల్ ఫోటోగ్రాఫర్ల అసోసియేషన్ సభ్యులతోపాటు వెంకటాపూర్ మండల ఫోటోగ్రాఫర్లు రామప్ప ఫోటోగ్రాఫర్లు అభినందించారు.

# కల్లుగీత కార్మిక సంఘంజిల్లా కమిటీ ఆధ్వర్యంలో నూతన ప్రజాప్రతినిధులకు ఆత్మీయ సన్మానం

### కల్లుగీత కార్మికులు ఐక్యంగా ఉండాలి
### టీఎస్జీవో జిల్లా ప్రధాన కార్యదర్శి మేడి చైతన్య గౌడ్
### సంఘం సీనియర్ నాయకులు గొల్లపల్లి రాజేందర్ గౌడ్



**ములుగు జిల్లా ప్రతినిధి డిసెంబర్ 21 (పీపుల్స్ న్యూస్)** ములుగు కల్లుగీత కార్మికులు ఐక్యంగా ఉండి సమస్యల పరిష్కారం కొరకు కృషి చేయాలని కల్లు గీత కార్మిక సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు పులి నర్సయ్య గౌడ్.జిల్లా అధ్యక్షులు గుండె బోయిన రవి గౌడ్ జిల్లా కార్యదర్శి బుర్ర శ్రీనివాస్ గౌడ్ గీత కార్మికులకు పిలుపునిచ్చారు. కల్లు గీత కార్మిక సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని సంఘం ఆఫీసులో సోషల్ మీడియా కన్వీనర్ ఉయ్యాల మధుకర్ గౌడ్ అధ్యక్షతన నూతన సర్పంచ్ ఉప సర్పంచ్ వార్డ్ మెంబర్లను ఆత్మీయ సన్మానం చేయడం జరిగింది . ఈ సందరరేగా నరసయ్య గౌడ్ రవి గౌడ్ శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ నూతన ప్రజాప్రతినిధులు కల్లుగీత కార్మికుల సమస్యల పరిష్కారం కొరకు జరిగే ఉద్యమాలకు బాసటగా నిలవాలని అన్నారు. జిల్లాలో ఒక సర్పంచ్ ఐదు ఉపసర్పంచ్ లు 8 వార్డ్ మెంబర్లు గెలవడం జరిగిందని అన్నారు.. ఇంచర్ల సర్పంచ్ ముస్నేపల్లి కుమార్ గౌడ్ మాట్లాడుతూ ప్రజా ప్రతినిధులను సంఘం ఆధ్వర్యంలో సన్మానం చేయడం చాలా గర్వించదగ్గ విషయమని అన్నారు. పార్టీలకు అతీతంగా ప్రజా ప్రతినిధులను సంఘ ఆధ్వర్యంలో సన్మానం చేయడం ఒక కల్లుగీత కార్మిక సంఘానికి దక్కుతుందని అన్నారు. 68 సంవత్సరాలుగా రాజకీయాలకు అతీతంగా కల్లుగీతకార్మికుల సమస్యల మీద ఉద్యమాలు నిర్వహిస్తున్న సంఘం కల్లు గీత కార్మిక సంఘం అని అన్నారు. అనంతరం ప్రజాప్రతినిధులను ఆత్మీయ సన్మానం చేయడం జరిగింది . ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ లు తాడూరి సంపత్ కుమార్ గౌడ్.(పేరూరు) పాలకుర్తి మౌనిక గౌడ్ (లక్ష్మి పురం) పాలకుర్తి బాబు గౌడ్ (కాటాపూర్)బండి రాజశేఖర్ గౌడ్ (దుంపిల్లా గూడెం )వార్డు మెంబెర్స్ అంతటి రాము గౌడ్ బుర్ర సోమయ్య గౌడ్ గుండెబోయిన రజిత గౌడ్ మార్క రాజు గౌడ్.బుర్ర మహేష్ గౌడ్ పొన్నం రాము గౌడ్ జిల్లా ఉపాధ్యక్షుడు రంగు సత్య నారాయణ గౌడ్ పులి రమేష్ గౌడ్ కారుపోతుల సత్యం గౌడ్ లోడే శ్రీనివాస్ గౌడ్ రుద్ర బోయిన మల్లేష్ గౌడ్ కాసగానిస్వామి గౌడ్ గునిగంటి శోభన్ గౌడ్ చౌగాని స్వప్న గౌడ్ మాజీ ఎంపీటీసీ పులి నరసయ్య గౌడ్ పులి ప్రకాష్ గౌడ్ తో పాటు 40 మంది పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ని కలిసిన ములుగు జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మణ్ బాబు

### ఏటూరునాగారం మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ కాకులమర్రి శ్రీలత









**ములుగు జిల్లా ప్రతినిధి డిసెంబర్ 21( పీపుల్స్ న్యూస్)**ములుగు జిల్లా ఏటూరునాగారం మేజర్ గ్రామపంచాయతీ బీఆర్ఎస్ పార్టీ భారీ విజయం సాధించటంతో పాటుగా 3,230 మెజార్టీ కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థి పై భారీ విజయం సాధించడంతో ఏటూరు నాగారం గడ్డపై బీఆర్ఎస్ పార్టీ జెండా ఎగరవేయడం జరిగినది ఈ సందరరేగా బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆహ్వానం మేరకు హైదరాబాదులో కేటీఆర్ నంది నివాసంలో కలిసిన బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మణ్ బాబు ఏటూరునాగారం మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ కాకులమర్రి శ్రీలత ఈ సందరరేగా కేటీఆర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వానికి దిమ్మతిరిగే మెజార్టీని ఇచ్చి చరిత్ర సృష్టించారని అన్నారు ములుగు జిల్లాలో మేజర్ గ్రామ పంచాయతీలో అత్యధిక రాష్ట్రంలోనే అత్యధిక 3,230 మెజార్టీతో భారీ విజయం సాధించటంతో కేటీఆర్ కాకులమర్రి శ్రీలతను శాలువా కప్పి సన్మానించారు ఏటూర్ నాగారం సర్పంచ్ గా గెలుపొందిన కాకులమర్రి శ్రీలతకు మాజీ మంత్రివర్యులు తలసాని శ్రీనివాస్ యాదవ్ పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలియజేశారు ఏటూరు నాగారం గ్రామపంచాయతీని మంచి అభివృద్ధి పథంలో నడిపించాలని కేటీఆర్ అన్నారు ఏ అవసరం ఉన్నా మీకు నేనున్నానని ధైర్యాన్ని కల్పించారు ఈ కార్యక్రమంలో ములుగు జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మణ్ బాబు మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ రంజిత్ రెడ్డి తాటికొండ రాజయ్య పాల్గొన్నారు

# రోడ్డు భద్రత సామాజిక బాధ్యత

### రోడ్డు భద్రత నియమాలు అందరూ పాటించాలి.
### రవాణా, బీసీ సంక్షేమ శాఖా మంత్రి పొన్నం ప్రభాకర్.
### జాతీయ రహదారి భద్రత మాసోత్సవాలు-2026 పై వీడియో కానారేన్స్ ద్వారా సమీక్ష.
### జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్.









**ములుగు జిల్లా ప్రతినిధి డిసెంబర్ 20 (పీపుల్స్ న్యూస్)** రోడ్డు భద్రత సామాజిక బాధ్యత అని రవాణా, బీసీ సంక్షేమ శాఖా మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు.జాతీయ రహదారి భద్రత మాసోత్సవాలు-2026 పై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామ కృషా?రావు, రవాణా, ఆర్ అండ్ బీ శాఖ స్పెషల్ సీఎస్ వికాస్ రాజ్, లా అండ్ ఆర్డర్ ఏడీజీ మహేష్ ఎం భగవత్, జాతీయ రహదారుల, ఆర్టీసీ, పోలీస్, వైద్య ఆరోగ్య శాఖా అధికారులతో కలిసి అన్ని జిల్లా కలెక్టర్లతో హైదరాబాద్ నుంచి వీడియో కానారేన్స్ ద్వారా సమీక్ష సమావేశం శనివారం నిర్వహించగా, జిల్లా కలెక్టరేట్ వీడియో కానారేన్స్ హాలు నుంచి జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్., ఓ ఎస్ డి శివం ఉపాధ్యాయ, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు లతో కలసి పాల్గొన్నారు ఈ సందర్భంగా రవాణా, బీసీ సంక్షేమ శాఖా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, గతంలో రోడ్డు భద్రత వారోత్సవాలు నిర్వహించేవారని,గత ఏడాది నుంచి మాసోత్సవాలు చేపడుతున్నామని తెలిపారు.రాష్ట్రంలో గత ఏడాది 7,949 మంది రోడ్డు ప్రమాదాల్లో మృతి చెందారని తెలిపారు. జాతీయ రహదారి భద్రత మాసోత్సవాలపై ఈ నెల ఆఖరులోగా జిల్లా స్థాయిలో రోడ్డు భద్రత కమిటీ సమావేశం నిర్వహించాలని, కార్యక్రమం నిర్వహణ పై యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని ఆదేశించారు. నేషనల్ హై వే, ఆర్ అండ్ బీ, పీఆర్, పోలీస్, రవాణా శాఖా అధికారులు సంయుక్తంగా జిల్లాలోని బ్లాక్ స్పాట్లను గుర్తించాలని సూచించారు. అన్ని శాఖల అధికారుల సమన్వయంతో విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. భద్రత మాసోత్సవాలపై విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్ సీసీ, ఎన్ఎస్ఎస్, స్వచ్ఛంద సంస్థల సహకారం తీసుకోవాలని, నెల రోజులపాటు ట్రాఫిక్ వాలంటీర్లను నియమించాలని సూచించారు. అనంతరం వారిని అభినందిస్తూ సర్టిఫికెట్ అందించాలని పేర్కొన్నారు.రోడ్డు ప్రమాద బాధితులకు దగ్గరలోని ఆసుపత్రిలో వైద్యం అందించాలని సుప్రీంకోర్ట్ ఆదేశాలు జారీ చేసిందని, రోడ్డు ప్రమాద బాధితుల వైద్యానికి కేంద్ర ప్రభుత్వం ఆర్థిక సహాయం అందిస్తుందని, క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించిన వారికి పారితోషికం ఇస్తుందని చెప్పారు. రోడ్డు ప్రమాదాల నివారణ అందరి బాధ్యత అని స్పష్టం చేశారు.అనంతరం జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్.అధికారులతో మాట్లాడుతూ, జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల సందరరేగా జిల్లాలో రహదారి భద్రతపై అవగాహన సదస్సులు నిర్వహించుటకు,ఆయా విద్య సంస్థల్లో విద్యార్థులకు వ్యాస రచన, డ్రాయింగ్ ఇతర పోటీలు నిర్వహించుటకు, నేషనల్ హై వే, ఆర్అండ్ బీ, పీఆర్, పోలీస్, రవాణా శాఖా అధికారులు సంయుక్తంగా సర్వే నిర్వహించి, ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.ఈ వీడియో కానారేన్స్ లో జిల్లా రవాణా శాఖా అధికారి శ్రీనివాస్, డిఈఓ సిద్ధార్థ రెడ్డి, నేషనల్ హై వే డిఈ కుమార స్వామి, పీఆర్ ఈఈ అజయ్ కుమార్, ఆర్అండ్ బీ ఈఈ శ్యామ్ సింగ్, మున్సిపల్ కమిషనర్ సంపత్, తదితరులు పాల్గొన్నారు.

# మొగుళ్ళపల్లి ఉపసర్పంచ్ గా ఎర్రబెల్లి హిమబిందు-కోటేశ్వర్ రావు



**మొగుళ్ళ పల్లి ప్రతినిధి డిసెంబర్ 20( పీపుల్స్ న్యూస్) :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి గ్రామ ఉపసర్పంచ్ ఎన్నిక ఉత్కంఠ భరితంగా కొనసాగింది. కాంగ్రెస్ పార్టీ నుండి సర్పంచ్ అభ్యర్థిగా గెలుపొందిన చాట్ల విజయ-రవీందర్ తో పాటు ఉపసర్పంచ్ కాంగ్రెస్ పార్టీకే దక్కే అవకాశాలున్న, ఉపసర్పంచ్ రేసులో కాంగ్రెస్ పార్టీ నుండి గెలిచిన ముగ్గురు అభ్యర్థులు తీవ్రంగా పోటీ పడ్డారు. మొగుళ్లపల్లి మండల కేంద్రంలో 12 వార్డు సభ్యులకు గాను, 6 వార్డులను కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులు కైవసం చేసుకున్నారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల మధ్య తీవ్రమైన పోటీ నెలకొనడంతో ఉప సర్పంచ్ ఎన్నిక రెండుసార్లు వాయిదా పడింది. దీంతో ఎలక్షన్ కమిషన్ ఆదేశాలతో శనివారం ఉప సర్పంచ్ ఎన్నిక ప్రక్రియను నిర్వహించారు. ఉప సర్పంచ్ గా ఎర్రబెల్లి హిమబిందు-కోటేశ్వర్ రావు ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి, ఎంపీవో సుభాష్ చంద్రబోస్ ప్రకటించారు.

-మొగుళ్ళపల్లిలో ఏకపక్షంగా ఉప సర్పంచ్ ఎన్నిక
-ఎన్నికల అధికారి, ఎంపీఓపై ఫిర్యాదు చేసిన వార్డు సభ్యులు
-విచారణ నిమిత్తం డీపీఓకు నివేదికను పంపిన ఎంపీడీవో గొడిశాల సురేందర్ గౌడ్

మొగుళ్లపల్లి మండల కేంద్రంలో ఉప సర్పంచ్ ఎన్నిక ఏకపక్షంగా నిర్వహించారని, 12 వార్డు సభ్యులకు గాను, నలుగురు వార్డు సభ్యులతో సంతకం పెట్టించుకుని, ఎవరిని సంప్రదించకుండా..ఎన్నికల అధికారి, ఎంపీ ఓ సుభాష్ చంద్రబోస్ అనుకూలమైన వ్యక్తికి సపోర్ట్ చేసి ఉప సర్పంచ్ గా ఎర్రబెల్లి హిమబిందు-కోటేశ్వర్ రావును ప్రకటించడంతో వార్డు సభ్యులంతా ఎంపీడీవో గొడిశాల సురేందర్ గౌడ్ కు ఫిర్యాదు చేశారు. దీంతో ఎంపీడీవో సురేందర్ గౌడ్ ను వివరణ కోరగా వార్డు సభ్యులతో వచ్చిన ఫిర్యాదును డీపీఓ కు నివేదించినట్లు వెల్లడించారు.

## జర్నలిస్టుల హక్కుల పరిరక్షణ, జీవన భద్రతే, టిడబ్ల్యూజేఎఫ్ ( హెచ్ 2843) లక్ష్యం.

### ప్రెస్ క్లబ్ నుంచే సభ్యత్వ కార్యక్రమానికి శ్రీకారం.




**ఖమ్మం/ డిసెంబర్ 20/( పీపుల్స్ న్యూస్ )**జర్నలిస్టుల హక్కుల పరిరక్షణ, జీవన భద్రత, గౌరవాన్ని లక్ష్యంగా పెట్టుకుని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టిడబ్ల్యూజేఎఫ్ %– ు%–2843) ఆధ్వర్యంలో ఖమ్మం ప్రెస్ క్లబ్‌లో సభ్యత్వ నమోదు కార్యక్రమం ఘనంగా ప్రారంభమైంది. జిల్లా అధ్యక్షులు టి. సంతోష్ చక్రవర్తి నాయకత్వంలో జరిగిన ఈ కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి జర్నలిస్టులు స్వచ్ఛందంగా తరలివచ్చి సంఘంలో చేరారు.ఈ సందర్భంగా టి. సంతోష్ చక్రవర్తి మాట్లాడుతూ టిడబ్ల్యూజేఎఫ్ కేవలం యూనియన్ మాత్రమే కాదని, ఇది జర్నలిస్టుల కుటుంబమని అన్నారు. వృత్తిలో ఎదురయ్యే ఒత్తిళ్లు, అవమానాలు, అనిశ్చితి పరిస్థితుల్లో జర్నలిస్టులకు అండగా నిలవడమే సంఘ ధ్యేయమని స్పష్టం చేశారు. ఇక్కడ వ్యక్తిగత ద్వేషాలు, రాజకీయ రంగులు లేవని, జర్నలిస్టుల సమస్యలే కేంద్రబిందువని పేర్కొన్నారు.ఇతర యూనియన్లలో ఉన్న జర్నలిస్టులకు భరోసా ఇస్తూ, ఎవ్వరూ భయపడాల్సిన అవసరం లేదని తెలిపారు. రాబోయే రోజుల్లో అక్రిడిటేషన్, సంక్షేమ పథకాలు, జీవన భద్రత వంటి అంశాలపై నిర్మాణాత్మక ఉద్యమాలు, శాంతియుత పోరాటాలు చేపట్టేందుకు అందరూ ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.ఈ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో అర్వపల్లి నగేష్, అంతోటి శ్రీనివాస్, వందనపు సామ్రాట్, కందరబోయిన నాగకృష్ణ, అమరబోయిన ఉపేందర్, కాసోజు శ్రీధర్, కప్పల మధు, కుంభం రవికుమార్, ఈ. వెంకట రావు, ఎన్. స్వాతి, రాంబాబు, శిల్ప, శ్రీనివాస రావు, నక్క లక్ష్మయ్య, రామకృష్ణ, డి. రాంచందర్, బొల్లి రమేష్, పి. సంతోష్ కుమార్, గంటెల కుమార్, ఏ. వెంకట నరసింహారెడ్డి, గౌరవరపు జగదీష్, కొప్పు రావూరి రఘువీర్, కుక్కల నాగభూషణం, పర్సా వెంకట్ గౌడ్, దోర్నాల బాబు, షేక్ సిరాజుద్దీన్, ఇమాన్యువల్, ఎస్.కె. సొందు మియా, ఏ. మధు తదితరు

## శీతాకాల విడిది కోసం హైదరాబాద్ చేరుకున్న భారత ఉప రాష్ట్రపతి



**రాచకొండ,క్రైమ్ బ్యూరో, డిసెంబర్ 20, (పీపుల్స్ న్యూస్ ) :** శీతాకాల విడిది కోసం హైదరాబాద్ చేరుకున్న భారత ఉప రాష్ట్రపతి ని సిపి రాధాకృష్ణన్ ను రాచకొండ సిపి సుధీర్ బాబు రామోజీ ఫిల్మ్ సిటీలో పుష్ప గుచ్ఛం అందించి స్వాగతం పలికారు. రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి రాకను పురస్కరించుకుని పోలీస్ శాఖ భారీ భద్రత ఏర్పాట్లు చేసిందని ఆయన అన్నారు.

## అరటిపండు ఏ టైమ్‌లో తినాలి.. ఎప్పుడు పడితే అప్పుడు తింటే అంతే సంగతులు..



అరటిపండులో పోషకాలు మెండు. తక్షణ శక్తినిచ్చే ఈ పండును సరైన సమయంలో తింటే అధిక ప్రయోజనాలు పొందవచ్చు. వ్యాయామానికి ముందు, భోజనం తర్వాత, సాయంత్రం స్నాక్‌గా తినడం మంచిది. ఇది జీర్ణక్రియను మెరుగుపరిచి, మలబద్ధకాన్ని తగ్గిస్తుంది. అయితే జలుబు, దగ్గు వంటి సమస్యలున్నవారు ఉదయం ఖాళీ కడుపుతో దీనిని తినకుండా ఉండాలి.దాదాపు అన్ని సీజన్లలో, అతి తక్కువ ధరకే లభించే పండు ఏదైనా ఉందంటే అది అరటిపండు. తక్షణ శక్తిని ఇవ్వడంలో దీనికి సాటిలేదు. అయితే అరటిపండులో ఎన్ని పోషకాలు ఉన్నాయో.. దానిని తినడానికి కూడా కొన్ని నియమాలు ఉన్నాయని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. ప్రముఖ వైద్యులు డాక్టర్ శరణ్ జెసి అరటిపండును ఎప్పుడు, ఎలా తినాలో వివరించారు. ఆ వివరాలు ఇప్పుడు తెలుసుకుందాం..పోషకాల గని: అరటిపండు అరటి పండులో పొటాషియం,కాల్షియం,మెగ్నీషియం, ఫైబర్,విటమిన్ బి6 వంటి పోషకాలు పుష్కలం గా ఉంటాయి. ముఖ్యంగా పొటాషియం గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో మరియు రక్తపోటును నియంత్రించడంలో కీలక పాత్ర పోషిస్తుంది.ఏ సమయంలో తింటే ఏ ప్రయోజనం?వర్కవుట్‌కు ముందు: మీరు జిమ్‌కు వెళ్లినా లేదా ఏదైనా శారీరక వ్యాయామం చేసినా.. దానికి 15–30 నిమిషాల ముందు అరటిపండు తినండి. ఇందులోని కార్బోహైడ్రేట్లు మీకు తక్షణ శక్తిని అందిస్తాయి. దీనివల్ల మీ పనితీరు మెరుగుపడుతుంది.భోజనం తర్వాత: మధ్యాహ్నం భోజనం చేసిన తర్వాత అరటిపండు తినడం వల్ల జీర్ణక్రియ మెరుగుపడుతుంది. ఇందులో ఉండే ఫైబర్ ఆహారం త్వరగా అరగడానికి సహాయపడటమే కాకుండా కడుపులో మంట, అసిడిటీ సమస్యలను తగ్గిస్తుంది.సాయంత్రం వేళల్లో: సాయంత్రం ఆకలిగా అనిపించినప్పుడు సమోసాలు, చిప్స్ వంటి జంక్ ఫుడ్ జోలికి వెళ్లకుండా అరటిపండు తినడం మంచిది. ఇది శరీరానికి శక్తిని ఇవ్వడంతో పాటు, స్వీట్లు తినాలనే కోరికను కూడా తగ్గిస్తుంది.జాగ్రత్త: వీరు ఉదయం పూట తినకూడదు!అరటిపండు ఆరోగ్యానికి మంచిదే అయినా.. తరచుగా జలుబు, దగ్గు వంటి శ్వాసకోశ సమస్యలతో బాధపడేవారు ఉదయం పూట ఖాళీ కడుపుతో దీనిని తీసుకోకపోవడమే మంచిది. మిగిలిన వారు ఉదయం పూట తినడం వల్ల రక్త ప్రసరణ మెరుగుపడి, రోజంతా ఉత్సాహంగా ఉంటారు.మలబద్ధకానికి చెక్ అరటిపండు శరీరంలోని విషతుల్యాలను బయటకు పంపి పేగులను ఆరోగ్యంగా ఉంచుతుంది. రోజూ సరైన పద్ధతిలో అరటిపండును తీసుకోవడం వల్ల దీర్ఘకాలిక మలబద్ధకం సమస్య నుండి కూడా ఉపశమనం పొందవచ్చు.

## ఊరి ప్రజలకు ఇచ్చిన మాటకు కార్యరూపం కు శ్రీకారం.

### కోతుల పట్టివేతకు నిపుణులను రంగంలోకి.. ప్రమాణ స్వీకారానికి ముందే రేగొండ సర్పంచ్ వారణాసి మౌనిక- అంజి..

**రేగొండ,డిసెంబర్20(పీపుల్స్ న్యూస్)**మూడు విడుతల ఎన్నికల్లో జరిగిన స్థానిక సర్పంచి ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులకు గ్రామ ప్రజల నుంచి ముందుగా ఎదురైన కోతుల సమస్య అభ్యర్థుల దృష్టికి రావడంతో గ్రామ గ్రామాన కోతుల నిర్మూలనకు ప్రధాన అజెండగా రేగొండ మండలంలో కనబడుంది. బరిలో దిగిన సర్పంచ్ అభ్యర్థులకు ముందు నుంచి అభివృద్ధితో పాటు కోతుల నిర్మూలనకు పాటుపడతామని ప్రజలకు హామీ ఇవ్వడంతో ఇచ్చిన మాటకు నూతనంగా గెలిచిన సర్పంచులు శ్రీకారం చుడుతున్నారు.మేజర్ రేగొండ గ్రామపంచాయతీ ఊరికి ఇచ్చిన మాటను కార్యరూపంలో చూపిస్తున్న కొత్త సర్పంచ్ మౌనిక అంజి దంపతులు కోతుల పట్టే నిపుణులను రంగంలోకి దించారు. శనివారం నూతన సర్పంచి మౌనిక అంజి దంపతులు రేగొండలో, రేపు గడిపల్లి %–% రావులపల్లి గ్రామాల్లో ప్రజల సమస్యల పరిష్కారానికి ముందడుగు వేస్తున్నారు.నూతనంగా ఎన్నికైన రేగొండ సర్పంచ్ వారణాసి మౌనిక అంజి ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవడం పట్ల ప్రజలు చాలా సంతోషపడుతున్నారు. మాటలు చెప్పడమే కాదు.. వాటిని అమలు చేసి చూపించడమే నిజమైన నాయకత్వం అని



మరోసారి నిరూపిస్తున్నారని గ్రామాల్లోని కోతుల బారిన పడుతున్న ప్రజానీకం కొనియాడుతున్నారు. గ్రామంలో నెలకొన్న కోతుల సమస్యను నిర్లక్ష్యం చేయకుండా, దానికి శాశ్వత పరిష్కారం దిశగా నిపుణులను (ఎక్స్‌పర్ట్స్) పిలిపించి చర్యలు తీసుకుంటున్నారు. ఇది ప్రజల పట్ల ఉన్న బాధ్యతను, అభివృద్ధి పట్ల ఉన్న నిబద్ధతను స్పష్టంగా ప్రమాణ స్వీకారానికి ముందే సర్పంచి మౌనిక అంజి చేస్తున్న మొదటి పనికి కార్యరూపం రేగొండ గ్రామంలో కనబడుతుంది.ఇలాంటి కార్యాచరణతో గ్రామాభివృద్ధికి దారి చూపుతూ, ప్రజల నమ్మకాన్ని మరింత బలపరుస్తున్నందుకు సర్పంచ్ కి గ్రామస్తుల తరఫున అభినందనలు వినిపిస్తున్నాయి.మాటల నాయకత్వం కాదు %–% పనుల నాయకత్వమే ప్రజలకు కావాలన్నదానికి ఇది సాక్ష్యం రూపంగా నూతన సర్పంచి మౌనిక అంజి కదలడం పట్ల ఉప సర్పంచ్ ఎల్దొండి నరేష్ వార్డు సభ్యులు గండి తిరుపతి గౌడ్, మైస సురేందర్, గ్రామస్తులు సైతం కోతుల తరిమి ఒక చోటకు తీసుకువచ్చేలా సహకారం అందించడంతో కోతులను పట్టే నిపుణులైన వారు బోన్లను సైతం ఏర్పాట్లు చేయడంలో నిమగ్నమయ్యారు. కోతుల సమస్య తీరేలా ఎన్నికల ముందే నిపుణులను తీసుకొచ్చిన ఎన్నికల కోడ్ ఉండడం వల్ల గెలిచిన సర్పంచ్ మౌనిక అంజి ఇచ్చిన మాట ప్రకారం కోతులను పట్టే పనిలో దృష్టి సాధించడం పట్ల గ్రామస్తులు కొనియడుతున్నారు. స్థానిక సర్పంచి ఎన్నికలలో ప్రతి గ్రామములో కోతుల బెడద ఉండడంతో కోతుల నిర్మూలన ప్రధాన ఏజెండగా మారటం గ్రామాల్లో చర్చనీయామశమైంది. చూడాలా మరి రేగొండ మండలంలో కోతుల నిర్మూలన హామీ ఇచ్చిన సర్పంచ్లు ఎంత మేరా కృషి చేస్తారో వేచి చూడాలి..

## మనం పిల్లలకు ఇచ్చే గొప్ప ఆస్తి విద్య మాత్రమే.

### జిల్లా స్థాయి ఇన్ స్పైర్ కార్యక్రమాన్ని ప్రారంభించిన మంత్రి తుమ్మల, జిల్లా కలెక్టర్

**ఖమ్మం, /డిసెంబర్ 20/(పీపుల్స్ న్యూస్)**మంత్రి తుమ్మల నాగేశ్వర రావు శనివారం ఖమ్మం నగరం బల్లేపల్లి లోని ఎస్.ఎఫ్.ఎస్. స్కూల్లో జిల్లా స్థాయి ఇన్ స్పైర్ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తో కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వర రావు మాట్లాడుతూ 900 ఎగ్జిబిట్స్ జిల్లా స్థాయి వైజ్ఞానిక ఎగ్జిబిషన్ కు రావడం మన పిల్లల సృజనాత్మకతకు నిదర్శనమని, ఇది చాలా సంతోషకరమని అన్నారు. విజ్ఞాన ప్రదర్శనల వల్ల పిల్లలకు మెరుగైన భవిష్యత్తు లభిస్తుందని అన్నారు. గ్రామీణ ప్రాంతంలో తల్లిదండ్రులు పడిన కష్టాలను చూసి కొంత మంది ఆడపిల్లలు ఆలోచించి వ్యవసాయ పనులను ఒకే యంత్రం చేసేలా తయారు చేశారని తెలిపారు. సమాజంలో ఉన్న సమస్యల పరిష్కారం కోసం విజ్ఞానాన్ని వినియోగిస్తూ చిన్న, చిన్న యంత్రాలను విద్యార్థులు తయారు చేయడం మంచి పరిణామం అని అన్నారు.దేశ మాజీ రాష్ట్రపతి మహనీయులు అబ్దుల్ కలాం చిన్నతనంలో సరిగ్గా ఆహారం లేకపోయినా బాగా చదువుకొని దేశ అత్యున్నత స్థాయికి చేరుకున్నారని, అబ్దుల్ కలాం సూచించిన విధంగా పిల్లలు గొప్ప గొప్ప ఆలోచనలు చేయాలని, కలలు కనండి, వాటిని సాకారం చేసుకోవాలని మంత్రి సూచించారు.ఖమ్మం జిల్లా విద్యారంగంలో భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకోవాలని అన్నారు. విద్య



లేకపోతే ఎటువంటి అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు చేసిన ఉపయోగం ఉండదని, మన పిల్లలకు ఇచ్చే గొప్ప ఆస్తి విద్య మాత్రమేనని అన్నారు.విద్యా ప్రమాణాలు పెరగడానికి ఉపాధ్యాయులకు కూడా అవసరమైన శిక్షణ ఎప్పటికప్పుడు అందించాలని, ప్రపంచంలో జరుగుతున్న మార్పులకు అనుగుణంగా ఎప్పటికప్పుడు విద్యా బోధనలో మార్పులు చేసుకుంటూ విద్యార్థులను ప్రపంచ స్థాయి పోటీలకు సన్నద్ధం చేయాలని మంత్రి తెలిపారు. విద్యా వ్యవస్థలో ఎటువంటి అవసరం ఉన్న వెంటనే విద్యాశాఖ అధికారులు కలెక్టర్ ను సంప్రదించాలని అన్నారు జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూఎస్.ఎఫ్.ఎస్. పాఠశాలలో నిర్వహిస్తున్న జిల్లాస్థాయి ఇన్ స్పైర్ వైజ్ఞానిక ఎగ్జిబిషన్ కార్యక్రమానికి 900



పైగా ఎగ్జిబిట్స్ రావడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. పిల్లలో సైంటిఫిక్ టెంపర్ పెంపు కోసం ఇటువంటి వైజ్ఞానిక ఎగ్జిబిషన్స్ ఉపయోగపడ్తాయని అన్నారు.సమాజంలో ఉన్న సమస్యల పరిష్కారానికి మన చదువు ఏ విధంగా ఉపయోగపడుతుందో ఆలోచించాలని, పాఠశాలలో చదివిన పరిజ్ఞానం ప్రాక్టికల గా ఎక్కడ ఎలా వాడాలి అనే అంశాన్ని విద్యార్థులు లోతుగా ఆలోచించాలని,అప్పుడే చదువు మనకు బాగా ఉపయోగపడుతుందని కలెక్టర్ తెలిపారు.ఈ పర్యటనలో మంత్రి వెంట రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, డిఈవో చైతన్య జైని, ఖమ్మం మార్కెట్ కమిటీ చైర్మన్ హనుమంతరావు, కార్పోరేటర్లు మల్లీదు వెంకటేశ్వర్లు, కమర్తపు మురళీ, అధికారులు, ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## సైబర్ నేరగాళ్ల మాయాజాలాన్ని ఛేదించాలంటే పోలీసుల నిఘా మాత్రమే సరిపోదు


### హైదరాబాద్ నగర పోలీసు కమిషనర్ వీసీ సజ్జనర్.

**హైదరాబాద్,క్రైమ్ బ్యూరో, డిసెంబర్ 20, (పీపుల్స్ న్యూస్ ) :** సైబర్ నేరగాళ్ల మాయాజాలాన్ని ఛేదించాలంటే పోలీసుల నిఘా మాత్రమే సరిపోదని, ప్రతి ఇల్లూ ఒక రక్షణ కోటగా మారాలని హైదరాబాద్ నగర పోలీసు కమిషనర్ వీసీ సజ్జనర్ పిలుపునిచ్చారు. ప్రజల్లోని భయం, అత్యాశలను పెట్టుబడిగా మార్చుకుని నేరగాళ్లు చెలరేగిపోతున్నారని, వీటిని అడ్డుకునేందుకు ప్రతి కుటుంబంలో ఒకరు 'సైబర్ సింబా'గా మా బాధ్యత తీసుకోవాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. సాంకేతికత ఎంత పెరుగుతోందో, మోసాలు అంత కొత్త పుంతలు తొక్కుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. లాటరీ తగిలిందనో, గిఫ్ట్ వచ్చిందనో ఆశ చూపి బుట్టలో వేసుకోవడం ఒక ఎత్తైతే.. ఫెడెక్స్ కొరియర్ లో డ్రగ్స్ ఉన్నాయంటూ, మనీ లాండరింగ్ కేసులో ఇరుక్కున్నారంటూ 'డిజిటల్ అరెస్ట్' పేరుతో భయపెట్టి డబ్బులు గుంజేయడం మరో ఎత్తు అని వివరించారు.సైబర్ మోసం జరిగిన వెంటనే స్పందించడాన్ని 'గోల్డెన్ అవర్' అంటారని, బాధితులు ఏమాత్రం ఆలస్యం చేయకుండా వెంటనే 1930 నంబర్‌కు కాల్ చేయడం లేదా www.cybercrime.gov.in పోర్టల్‌లో ఫిర్యాదు చేయడం ద్వారా పోగొట్టుకున్న సొమ్మును ఫ్రీజ్ చేసి, తిరిగి పొందే అవకాశం ఉంటుందని స్పష్టం చేశారు.క్రిస్మస్, న్యూ



ఇయర్, సంక్రాంతి పండుగల వేళ ఆఫర్లు, గిఫ్ట్ కూపన్ల పేరుతో వచ్చే మెసేజ్‌లు, వాట్సాప్ లింకుల పట్ల అత్యంత అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు.నగరాన్ని సైబర్ క్రైమ్ రహితంగా మార్చేందుకు మంగళ, శనివారాల్లో పోలీసులు ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేస్తున్నారని తెలిపారు. ఈ యజ్ఞంలో ప్రజలను భాగస్వాములను చేసేందుకే 'సైబర్ సింబా' వలంటీర్ల వ్యవస్థను తెచ్చామన్నారు. సీనియర్ సిటిజన్లను టార్గెట్ చేస్తున్న నేరగాళ్ల పట్ల కుటుంబ సభ్యులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.మరోవైపు ఫోన్ ట్యాపింగ్ కేసుపై సిట్ విచారణ వేగంగా జరుగుతోందని, త్వరలోనే పూర్తి వివరాలు వెల్లడిస్తామని తెలిపారు. ఐబొమ్మ రవి విచారణలో కీలక సమాచారం రాబడుతున్నామని అదనపు సీపీ (క్రైమ్) శ్రీనివాసులు, ఐపీఎస్




పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సైబర్ క్రైమ్ డిసిపి ఎ. అరవింద్ బాబు, వెస్ట్ జోన్ డిసిపి సిహెచ్. శ్రీనివాస్, కాలనీ అధ్యక్షుడు మనోహర్ రావు, అఖిలేష్ తదితరులు పాల్గొన్నారు.

## మొక్కలు నాటడం ప్రతీ ఒక్కరి బాధ్యతగా చేపట్టాలి



### మాజీ కార్పొరేటర్ నవత రెడ్డి

**శేరిలింగంపల్లి, డిసెంబర్ 20, (పీపుల్స్ న్యూస్ ) :** మొక్కలు నాటడం ప్రతీ ఒక్కరి బాధ్యతగా చేపట్టాలని మాజీ కార్పొరేటర్ నవత రెడ్డి అన్నారు. గ్రీన్ ఇండియా ఛాలెంజ్ లో భాగంగా చందనగర్ లోని అయ్యప్ప స్వామి దేవాలయం లో అయ్యప్ప భక్తులతో కలిసి ఆమె మొక్కలు నాటారు. ఈ సందర్భంగా నవతా రెడ్డి, ప్రసాద్ స్వామి లు మాట్లాడుతూ మొక్కలు నాటే పవిత్ర కార్యక్రమం లో



అయ్యప్ప స్వాములతో కలిసి పాల్గొనడం చాలా ఆనందంగా ఉంది అన్నారు. మొక్కలు పెట్టడమే కాదు వాటిని రక్షించే బాధ్యత కూడా మన యువతరం మీద ఉంది అన్నారు. రేపటి తరాలకు మనం ఇచ్చే ఆస్థి మంచి వాతావరణం అని అన్నారు. ఇంతటి గొప్ప అవకాశం కల్పించిన మాజీ రాజ్యసభ సభ్యులు జోగినపల్లి సంతోష్ కుమార్ కి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమం లో గ్రీన్ ఇండియా ఛాలెంజ్ రాష్ట్ర కోర్డినేటర్ గర్రెపల్లి సతీష్, శ్రీకాంత్, మల్లారెడ్డి, సంగారెడ్డి, నగేష్ రెడ్డి,రాజు, సునీత, అనంత్ రెడ్డి అయ్యప్ప స్వాములు, భక్తులు





తదితరులు పాల్గొన్నారు.

# ప్రతిష్టాత్మకంగా 'ముస్తాబు' నిర్వహిస్తాం: మంత్రి డీబీవీ స్వామి



**ప్రకాశం, డిసెంబరు20 :** ప్లాస్టిక్ రహిత స్వర్ణాంధ్రప్రదేశ్‌లో ప్రజలంతా భాగస్వాములు కావాలని ఆంధ్రప్రదేశ్ మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి ) సూచించారు. శనివారం) పొన్నలూరులో స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర కార్యక్రమంలో మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి, కలెక్టర్ పి. రాజబాబు పాల్గొన్నారు. గ్రామంలో రూ.65 లక్షల విలువైన రోడ్లు, సైడ్ కాలువల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా మంత్రి డీబీవీ స్వామి మాట్లాడారు. ప్రజల భాగస్వామ్యంతో పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన, ఆర్థికంగా అభివృద్ధి చెందిన రాష్ట్రాన్ని నిర్మించడమే సీఎం చంద్రబాబు లక్ష్యమని వ్యాఖ్యానించారు. విద్యార్థుల్లో వ్యక్తిగత పరిశుభ్రత, ఆరోగ్యకరమైన అలవాట్లు పెంపొందించేందుకు ఏపీ వ్యాప్తంగా ప్రతిష్టాత్మకంగా ముస్తాబు కార్యక్రమం నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ముస్తాబు కార్యక్రమాన్ని అనకాపల్లి జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ పాఠశాలలో సీఎం చంద్రబాబు లాంఛనంగా ముస్తాబు కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని చెప్పుకొచ్చారు. గ్రామాల్లో పచ్చదనం, పరిశుభ్రతకు కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని తెలిపారు. పరిసరాల పరిశుభ్రత సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అని మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి పేర్కొన్నారు.

# తిరుమల అతిథి గృహంలో కోడిగుడ్లు చికెన్ చూశా



**తిరుమల:** తిరుమలలోని ఓ విశ్రాంతిగృహంలో తాను కోడిగుడ్లు, చికెన్ ఉన్నట్లు గుర్తించానని, దీనిపై అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదంటూ ఓ వైసీపీ నేత విడుదల చేసిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. 'శ్రీనివాస్ నాయక్ అనే నేను వైసీపీ రాష్ట్ర ఎస్టీ సెల్ ప్రధాన కార్యదర్శిని. 17వ తేదీన తిరుమలలోని కౌస్తుభం విశ్రాంతి భవనంలో 538 నెంబరు గదిని అద్దెకు తీసుకున్నా. అక్కడికి వెళ్లే సమయంలో పారిశుధ్య కార్మికులు గదిని శుభ్రపరిచి చికెన్, కోడిగుడ్లు ఉన్న ఓ కవర్‌ను బయట పడేయడాన్ని గుర్తించా. లడ్డూలో కల్తీ జరిగిందని నానా రోత చేసిన సీఎం, డిప్యూటీ సీఎం, టీటీడీ చైర్మన్ నైతిక బాధ్యత వహించి రాజీనామా చేయాలి. ఈ విషయాన్ని మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తా' అని ఆ వీడియోలో పేర్కొన్నారు. అయితే, ఆ వీడియోలో కోడిగుడ్లు కానీ, చికెన్ కానీ కనిపించకపోవడం గమనార్హం. 538 గదిలోకి కొందరు యాత్రికులు నిషేధిత వస్తువులైన కోడి గుడ్లను తెచ్చినట్టు తమ దృష్టికి వచ్చిందని, విధుల్లో నిర్లక్ష్యం వహించిన సిబ్బందిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని టీటీడీ శుక్రవారం రాత్రి ఓ ప్రకటన ద్వారా స్పందించింది. కోడిగుడ్లను తెచ్చిన వ్యక్తిపై పోలీసులకు ఫిర్యాదు చేస్తామని స్పష్టం చేసింది.

# జీరాంజీ బిల్లుతో పేదలకు లాభం లేదు



**విజయవాడ, డిసెంబర్ 20:** కేంద్ర ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన జీరాంజీ బిల్లు వల్ల పేదలకు ఎటువంటి ఉపయోగమూ లేదని సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు అన్నారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఈ విషయంపై దేశ వ్యాప్తంగా ఆందోళనలు నిర్వహిస్తామన్నారు. గతంలో ఉన్న ఉపాధిహామీ చట్టాన్ని రద్దుచేసి కొత్తగా జీరాంజీ పథకాన్ని తీసుకొచ్చారని కేంద్ర ప్రభుత్వం తీరుపై విమర్శలు గుప్పించారు. దీనిలో కార్మికులకు గానీ, రాష్ట్రాలకు గానీ ఎటువంటి హక్కులూ లేవన్నారు. గతంలో కనీసం 100 రోజులు పని పేరుతో 50 రోజులన్నా కార్మికులకు ఉపాధి లభించేదని.. ఇప్పుడు కేంద్రం దయాదాక్షిణ్యాలపై ఉండేలా చేశారని విమర్శించారాయన.ఉపాధి హామీ పథకం వ్యవసాయ పనులకు ఆటంకమని చెబుతున్నారని.. అలాంటిదేమీ లేదని అనేక నివేదికలు, పరిశోధనలు బయటపెట్టాయని రాఘవులు తెలిపారు. గ్రామీణ పేదలు, వ్యవసాయ కార్మికుల శ్రమను కార్పొరేట్లు దోచుకునేందుకు ఈ పథకం ఉపయోగపడుతుందన్నారాయన. పథకంలో నిధుల వాటా గతంలో కేంద్రానికి 90 శాతం రాష్ట్రానికి 10 శాతం వాటా ఉండేదని.. కానీ, ఇప్పుడు 60:40 శాతంగా మార్చి, రాష్ట్రాలపై భారం మోపుతున్నారని కేంద్ర ప్రభుత్వం తీరును ఎండగట్టారాయన. ఆకలిచావులు, వలసలు నివారించేందుకు ఉపయోగపడిన ఈ చట్టాన్ని రద్దు చేయడం వల్ల మళ్లీ ఆకలిచావులు పెరిగే ప్రమాదం ఉందని రాఘవులు ఆందోళన వ్యక్తం చేశారుఈ పథకానికి నిధుల కేటాయింపు డిమాండ్‌ను బట్టి కాకుండా.. రాజకీయ అవసరాలకు తగిన విధంగా కేటాయించేలా నిబంధనలు రూపొందించారని రాఘవులు విమర్శించారు. గతంలో కేంద్రం ముందుగానే నిధులు ఇచ్చేదని.. ఇప్పుడు పనిచేసిన తరువాత బిల్లు ఇచ్చేలా పథకాన్ని ప్రవేశపెట్టారన్నారు. ఉపాధి కల్పనలో ఆలస్యమయితే గతంలో కేంద్రమే పెనాల్టీ చెల్లించేదని.. ఇప్పుడు ఆ బాధ్యతను రాష్ట్రం మీదకు నెట్టేశారని వివరించారు. ఈ అంశంపై రాష్ట్రంలో అధికారంలో ఉన్న టిడిపి మాట్లాడటం లేదని, ప్రతిపక్షంలో ఉన్న వైసీపీ కూడా గట్టిగా ప్రశ్నించడం లేదని రాఘవులు విమర్శించారు. సెలక్టు కమిటీకి పంపించాలని చెప్పి వైసీపీ చేతులు ముడుచుకు కూర్చుందని.. ఈ రెండు పార్టీలు మోడీని చూసి భయపడుతున్నాయన్నారు. రాష్ట్రంలో ఉన్న మూడు పార్టీలు మోడీతో అనుసరిస్తున్న తీరువల్ల రాష్ట్రానికి తీవ్రనష్టం వాటిల్లుతుందని రాఘవులు ఆందోళన వ్యక్తం చేశారు. రాయలసీమకు అనువుగా ఉండేలా పారిశ్రామిక పాలసీని మార్చాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని రాఘవులు డిమాండ్ చేశారు.

# అలిపిరి చెక్ పోస్ట్ వద్ద సెక్యూరిటీ లగేజీ స్కానర్ కోసం టీటీడీకి రూ.38 లక్షలు విరాళం




**తిరుమల :** అలిపిరి చెక్ పోస్ట్ వద్ద ఏర్పాటు చేయనున్న సెక్యూరిటీ లగేజీ స్కానర్ కోసం ఇండియన్ బ్యాంక్ రూ.37,97,508 టీటీడీకి విరాళంగా అందించింది. ఈ మేరకు తిరుమల లోని టీటీడీ అదనపు ఈవో క్యాంపు కార్యాలయంలో అదనపు ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరికి ఇండియన్ బ్యాంక్ ఫీల్డ్ మేనేజర్ ప్రణేశ్ కుమార్ విరాళం డీడీని అందజేశారు.ఈ కార్యక్రమంలో బ్యాంక్ జోనల్ మేనేజర్ ఎం.సెల్వరాజ్, డిప్యూటీ జోనల్ మేనేజర్ ఇందిరా, తిరుమల బ్రాంచ్ మేనేజర్ రాఘవేంద్ర పాల్గొన్నారు.శ్రీవారి హుండీ ఆదాయం రూ. 4.31 కోట్లుతిరుమలలో భక్తుల రద్దీ కొనసాగుతుంది. భక్తులు సమర్పించుకున్న కానుకల వల్ల హుండీకి రూ. 4.31 కోట్లు ఆదాయం వచ్చిందని టీటీడీ అధికారులు తెలిపారు. నిన్న స్వామివారిని 64,729 మంది భక్తులు దర్శించుకోగా 22,162 మంది తలనీలాలు సమర్పించుకున్నారు.

# బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులు నరమేధమే విజయసాయిరెడ్డి సంచలన వ్యాఖ్యలు



**విశాఖపట్నం, డిసెంబరు20 :** బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులపై భారతదేశం అంతటా తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ ఘటనలు మానవ హక్కుల ఉల్లంఘనగా భావిస్తూ వివిధ వర్గాలు గట్టిగా నిరసన వ్యక్తం చేస్తున్నాయి. ముఖ్యంగా సోషల్ మీడియా వేదికగా సామాన్య ప్రజల నుంచి రాజకీయ నాయకుల వరకు పలువురు ఈ దాడులను తీవ్రంగా ఖండిస్తున్నారు. హిందువులపై జరుగుతున్న హింసను అరికట్టాలని, బాధితులకు రక్షణ కల్పించాలనే డిమాండ్‌లు వినిపిస్తున్నాయి.ఈ నేపథ్యంలో మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి ట్విట్టర్ (ఎక్స్) వేదికగా స్పందించారు. బంగ్లాదేశ్‌లో జరుగుతున్న ఘటనలను తప్పుబట్టారు. అక్కడ హిందువులపై జరుగుతున్న దాడులను 'నరమేధం'గా అభివర్ణిస్తూ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. బంగ్లాదేశ్‌లో జరుగుతున్న నరమేధంపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. బంగ్లాదేశ్‌లో ప్రస్తుతం హిందువుల మీద జరుగుతున్న దాడులు నరమేధాన్ని ఖండించని వారు భారతీయులేనా? అని ప్రశ్నించారు. ఈ దాడులపై ఖండించని వారికి రాజకీయ పార్టీలకు భారతదేశంలో ఉండే నైతిక హక్కు ఉందా? అని నిలదీశారు. వీటిని ఖండించలేని వారిని మనమే దేశం నుంచి బహిష్కరిస్తామని విజయసాయిరెడ్డి హెచ్చరించారు. మొత్తంగా బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడుల అంశం భారత దేశవ్యాప్తంగా పెద్ద చర్చకు దారితీసింది. విజయసాయిరెడ్డి చేసిన వ్యాఖ్యలు రాజకీయ, సామాజిక వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. ఈ ఘటనలపై మౌనం వహించడం దేశానికి, మానవత్వానికి ద్రోహమని విజయసాయిరెడ్డి చేసిన వ్యాఖ్యలు ప్రజల్లో భావోద్వేగాలను రేకెత్తిస్తున్నాయి.

# ప్రైవేట్ కొరియర్ సర్వీసులకు ధీటుగా పోస్టాఫీసులు



**అమరావతి, డిసెంబర్ 20:** రైల్వే తర్వాత అత్యధికంగా పోస్టల్ శాఖలో 4.50 లక్షల మంది ఉద్యోగులు పని చేస్తున్నారని కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. శనివారం నాడు విట్ యూనివర్సిటీలో జెన్ జెడ్ పోస్టాఫీసును కేంద్రమంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా పెమ్మసాని మాట్లాడుతూ.. పోస్టల్ శాఖ ఉద్యోగులందరినీ సమర్థవంతంగా ఉపయోగించుకుంటే దేశంలోనే పటిష్టమైన శాఖగా పోస్టల్ డిపార్ట్‌మెంట్ నిలుస్తుందన్నారు. లేటెస్ట్ టెక్నాలజీ రావడం వల్ల ఎక్కడెక్కడ ఏం జరుగుతుందో సులభంగా తెలుస్తోందని తెలిపారు.కేవలం లెటర్స్ బట్వాడాకే పరిమితం కాకుండా కాకుండా ఈ కామర్స్ ప్లాట్ ఫాంగా మార్చామని చెప్పారు. ప్రతి ఉద్యోగి తమ విధులు సజావుగా నిర్వహించేలా చూస్తున్నామన్నారు. సాంకేతికత సాయంతో ప్రైవేట్ కొరియర్ సర్వీసులకు ధీటుగా పోస్టాఫీసులను తయారు చేస్తున్నామని తెలిపారు. మార్కెటింగ్ కోసం ఓ నిపుణుడిని ప్రత్యేక అధికారిని నియమించామని.. మానవ వనరులను సక్రమంగా వాడుకోవడంపై దృష్టి సారించామని అన్నారు. జెన్ జెడ్ పోస్టాఫీసు ఏర్పాటు లక్ష్యం యువతను ప్రభుత్వ వ్యవస్థలో భాగస్వామ్యులను చేయడమే అని స్పష్టం చేశారు.రాష్ట్రంలో మూడు జెన్ జెడ్ పోస్టాఫీసులు ఏర్పాటు చేశామని.. దేశ వ్యాప్తంగా దాదాపు 50 జెన్ జెడ్ పోస్టాఫీసులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పోస్టల్ శాఖలో పెట్టే ఖర్చులతో 89 శాతం జీతాలకు సరిపోతున్నాయన్నారు. సామాజిక బాధ్యతగా చేసే కార్యక్రమాల వల్ల తాము ఎక్కువ చార్జీలు వసూలు చేయటం లేదని.. అందుకే ప్రత్యామ్నాయ ఆదాయ మార్గాలు ఆలోచిస్తున్నామని కేంద్రమంత్రి పెమ్మసాని చంద్ర శేఖర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ తమీమ్ అన్సారి యా, పోస్టల్ శాఖ ఉన్నతాధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# జగన్ అక్రమాస్తుల కేసులో ఊహించని పరిణామం




**హైదరాబాద్, డిసెంబరు 20:** వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అక్రమాస్తుల కేసులో ఊహించని పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసును విచారిస్తున్న నాంపల్లి సీబీఐ ప్రత్యేక కోర్టులో కీలక మార్పులు జరగడంతో విచారణ మరింత ఆలస్యమయ్యే పరిస్థితి ఏర్పడింది. ఇప్పటివరకు ఈ కేసు అనేక సంవత్సరాలుగా కొనసాగుతున్నప్పటికీ, తుది దశకు చేరుకోకపోవడం రాజకీయ, న్యాయవర్గాల్లో తీవ్ర చర్చకు దారి తీస్తోంది. తాజాగా నాంపల్లి సీబీఐ కోర్టు న్యాయాధికారి రఘురాం బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో కొత్త న్యాయాధికారిగా పట్టాభిరామారావును నియమించారు. ఈ మేరకు అధికారిక ఉత్తర్వులు జారీ అయ్యాయి. ప్రస్తుత న్యాయాధికారి ఈ నెల 22 తర్వాత రిలీవ్ కావాలని, 29వ తేదీ లోగా నూతన వ్యక్తి పోస్టింగ్‌లో చేరాలని ఆదేశాలు వెలువడ్డాయి. ఈ మార్పుతో జగన్ అక్రమాస్తుల కేసు విచారణను మరోసారి కొత్త న్యాయాధికారి ప్రారంభించనున్నారు.జగన్ అక్రమాస్తుల కేసులో గతంలో కూడా పలుమార్లు న్యాయాధికారులు మారడంతో విచారణ ప్రతిసారి మొదటి నుంచి ప్రారంభమవుతోందన్న విమర్శలు ఉన్నాయి. ముఖ్యంగా డిశ్చార్జ్ పిటిషన్ల విచారణ ఇప్పటికీ పూర్తికాకపోవడం గమనార్హం. ఏళ్ల తరబడి కేసు కొనసాగుతున్నా, ప్రధాన కేసులు ట్రయల్ దశకు వెళ్లకుండా నిలిచిపోయాయి. దీనికి కారణం పదేపదే డిశ్చార్జ్ పిటిషన్లు దాఖలు చేయడమేనన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రధాన కేసుల విచారణకు వెళ్లకుండా అడ్డుకునేందుకు జగన్ తరఫున వ్యూహాత్మకంగా డిశ్చార్జ్ పిటిషన్లు వేస్తున్నారని న్యాయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఈ కారణంగా కేసు ముందుకు సాగడం లేదనే విమర్శలు వస్తున్నాయి.మరోవైపు, ఈ కేసు త్వరితగతిన విచారించి తీర్పులు వెల్లడించాలని గతంలో సుప్రీంకోర్టు, హైకోర్టులు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసిన విష యం తెలిసిందే. అయినప్పటికీ ఆ ఆదేశాలు అమల్లోకి రాకపోవడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. న్యాయాధికారుల మార్పు, డిశ్చార్జ్ పిటిషన్లపై దీర్ఘకాల విచారణ వంటి అంశాల వల్ల జగన్ అక్రమాస్తుల కేసు ఎప్పటికప్పుడు ఆలస్యం అవుతూనే ఉంది. ఈ పరిస్థితి న్యాయవ్యవస్థపై ప్రజల్లో అనేక సందేహాలకు తావిస్తోంది. రాజకీయంగా కూడా ఈ కేసు ఎప్పుడు ముగుస్తుందన్న అంశం కీలకంగా మారింది. కొత్త న్యాయాధికారి పట్టాభిరామారావు బాధ్యతలు చేపట్టిన తర్వాత అయినా విచారణ వేగవంతమవుతుందా? ప్రధాన కేసులు ట్రయల్‌కు వెళ్లే అవకాశముందా? అన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. మొత్తంగా జగన్ అక్రమాస్తుల కేసులో జాప్యం అవుతోండటంతో న్యాయ ప్రక్రియపై, కేసు భవితవ్యంపై రాజకీయ, సామాజిక వర్గాల్లో ఉత్కంఠ నెలకొంది.

# అమరావతికి ఐకానిక్ కళ కృష్ణానదిపై 6 లేన్ల అద్భుతం



**అమరావతి:** ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిని దేశంలోని ప్రధాన నగరా లతో అనుసంధానంపై ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు ఫోకస్ పెట్టారు. ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలతో కూడిన గ్రీన్ ఫీల్డ్ నగరంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇక ఢిల్లీ పర్యటనలో భాగంగా కేంద్ర రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీతో సీఎం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర ంలోని జాతీయ రహదారుల నెట్‌వర్క్ బలోపేతంపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ భేటీలో ప్రధానంగా కృష్ణానదిపై ప్రతిపాదించిన 6 లేన్ల ఐకానిక్ కేబుల్ స్టెడ్ వంతెన నిర్మాణంపై ముఖ్యమంత్రి ప్రత్యేకంగా చర్చించారు. రాజధాని అమరావతికి తలమానికంగా నిలిచే ఈ ఐకానిక్ వంతెన నిర్మాణ బాధ్యతను జాతీయ రహదారుల సంస్థ చేపట్టాలని సీఎం చంద్రబాబు కోరారు. మూలపాడు వద్ద నిర్మించే ఈ వంతెన ద్వారా అమరావతిని మూడు కీలక జాతీయ రహదారులతో అనుసంధానించవచ్చని వివరించారు. విజయవాడ-హైదరాబాద్, చెన్నై-కోల్‌కతా జాతీయ రహదారులతో పాటు తీరప్రాంత రోడ్ కారిడార్‌ను ఈ వంతెన నేరుగా కలుపుతుందని సీఎం తెలిపారు.హైదరాబాద్ %-% అమరావతి గ్రీన్ ఫీల్డ్ హైవేహైదరాబాద్ నుండి అమరావతి వరకు ప్రతిపాదించిన గ్రీన్ ఫీల్డ్ హైవే గురించి గడ్కరీతో సీఎం చర్చించారు. ఈ హై-స్పీడ్ యాక్సెస్ కంట్రోల్ రోడ్డు అందుబాటులోకి వస్తే రెండు ప్రధాన నగరాల మధ్య ప్రయాణ సమయం గణనీయంగా తగ్గుతుందని స్పష్టం చేశారు. అమరావతిని నేషనల్ హైవే గ్రిడ్‌లో ఒక మొబిలిటీ కేంద్రంగా, లాజిస్టిక్స్ నోడ్‌గా మార్చడమే తమ లక్ష్యమని సీఎం వెల్లడించారు.ఆర్థిక ప్రగతికి రహదారులే సూచిక దేశంలో జాతీయ రహదారుల నెట్‌వర్క్ విస్తరణలో నితిన్ గడ్కరీ చేస్తున్న కృషిని చంద్రబాబు ఈ సందర్భంగా కొనియాడారు. ప్రపంచం మొత్తం విశాఖ వైపు చూస్తోందన్నారు సీఎం. త్వరలో అనకాపల్లి జిల్లాలో ఆర్సీలార్ మిట్టల్‌తో స్టీల్ సిటీ ఏర్పడుతుందని వెల్లడించారు. అల్యూమినియం సిటీ కూడా సిద్ధం చేస్తున్నామన్నారు. మెడికల్ కాలేజ్‌లకు పీపీపీ కింద ఇచ్చామన్న సీఎం.. గతంలోనూ 104, 108లు ప్రైవేట్‌కే ఇచ్చారు కదా? ప్రశ్నించారు. రుషికొండను గుండు కొట్టారని విమర్శించారు. రుషికొండకు రూ.500 కోట్లు ఖర్చు చేశారని.. ఆ సొమ్ములతో మెడికల్ కాలేజ్ కట్టొచ్చన్నారు. వైసీపీ హయాంలో ఏజెన్సీని గంజాయి వనంగా మారిస్తే.. కూటమి ప్రభుత్వం వచ్చి కాఫీవనంగా మార్చిందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు .రహదారుల అభివృద్ధి కేవలం కనెక్టివిటీ మాత్రమే కాకుండా, ప్రాంతాల ఆర్థిక ప్రగతికి బలమైన పునాదులు వేస్తాయని ఆయన అభిప్రాయ పడ్డారు. అమరావతిని జాతీయ రహదారులతో ప్రత్యక్షంగా మరియు పరోక్షంగా అనుసంధానించడం ద్వారా రాజధాని అభివృద్ధి వేగవంతం అవుతుందని సీఎం విజ్ఞప్తి చేశారు. రాష్ట్రానికి ఎంతో కీలకమైన ఈ ప్రాజెక్టుల విషయంలో కేంద్ర ప్రభుత్వం పూర్తి సహకారం అందించాలని కోరగా, దీనిపై నితిన్ గడ్కరీ సానుకూలంగా స్పందించారు.

# పొరపాట్లు జరిగితే సరిదిద్దుకుంటాం: మంత్రి నాదెండ్ల



**కృష్ణా, డిసెంబర్ 20:** జిల్లాలోని తోట్లవల్లూరు మండలంలో మంత్రి నాదెండ్ల మనోహర్ (శనివారం) పర్యటించారు. పామర్రు ఎమ్మెల్యే కుమార్ రాజాతో కలిసి తోట్లవల్లూరు గ్రామంలోని రైతులతో ముఖాముఖి కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కోత కోసి కుప్ప నూర్పుడి చేస్తున్న రైతులు.... కల్లాల్లో ధాన్యం ఆరబోసిన రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. రైతు సమస్యలను తెలుసుకునేందుకు క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్నామని తెలిపారు. రైతుకు మేలు జరగాలని కూటమి ప్రభుత్వం అనేక సంస్కరణలు తీసుకువచ్చిందన్నారు. పొరపాట్లు జరిగితే సరిదిద్దుకుంటామని.. అవి పునరావృత్తం కాకుండా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. రాష్ట్ర వ్యాప్తంగా నేటి వరకు 28లక్షల34 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించామని తెలిపారు.సంక్రాంతి కల్లా 51 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాలని లక్ష్యంగా పెట్టుకొని ముందుకు సాగుతున్నామని స్పష్టం చేశారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నాయకత్వంలో ఎప్పటికప్పుడు రైతాంగ సమస్యలు తెలుసుకొని వాటిని పరిష్కరిస్తున్నామన్నారు. రికార్డు స్థాయిలో కృష్ణా జిల్లాలో మొట్టమొదటిసారి 11 ట్రైన్లు పెట్టి ధాన్యం ఇతర జిల్లాలకు తరలించారని తెలిపారు. జిల్లాలో మిల్లుల సామర్థ్యం తక్కువగా ఉండడంతో రాష్ట్రంలో 106 మిల్లుల నిర్వాహకులు కృష్ణాజిల్లాలో ధాన్యం కొనుగోలు చేసేలా వేసులుబాటు కల్పించామని చెప్పారు. భారీ ఎత్తున జరిగిన ధాన్యం సేకరణ కార్యక్రమాన్ని రైతాంగాన్ని వివరించాలని ముఖాముఖి కార్యక్రమాలు నిర్వహిస్తున్నా మన్నారు. ధాన్యం రైతులు ప్రభుత్వానికి అమ్మితే కనీస మద్దతు ధర తప్పక అందుతుందని స్పష్టం చేశారు. ధాన్యం కొనుగోలులో రైతుకు సహాయంగా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుందని అన్నారు. 24 గంటల్లోపే విక్రయించిన ధాన్యం నగదును రైతు ఖాతాలో జమ చేశామని మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు.

# రాష్ట్రంలో.. 97,37,832 ఓటర్ల తొలగింపు

చెన్నై: రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) తర్వాత విడుదల చేసిన ముసాయిదా ఓటరు జాబితా నుండి 97,37,832 మందిని తొలగించినట్లు రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి అర్చనా పట్నాయక్ పేర్కొన్నారు. వచ్చే ఏడాది జరుగనున్న అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని కేంద్ర ఎన్నికల కమిషన్ (ఈసీ) ఉత్తర్వుల మేరకు శుక్రవారం మధ్యాహ్నం 2గంటలకు ముసాయిదా ఓటరు జాబితాను విడుదల చేసిన సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ.సర్ పనులు ప్రారంభించక ముందు 6,41,14,587 మంది ఓటర్లుండేవారని, ముసాయిదా ఓటరు జాబిదాలో 5,43,76,755 మంది ఉన్నారని వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా 97,37,832 మంది ఓటర్లను తొలగించామని, సర్ ఫారాలు తిరిగి సమర్పించని వారు, కొత్తగా ఓటరు జాబితాలో చేరవచ్చన్నారు. ఇందు కోసం బూత్ కమిటీల ద్వారా రెండు వారాల పాటు ప్రత్యేక శిబిరాలు నిర్వహించనున్నట్లు ఆమె తెలిపారు. ఓటరు జాబితాలో కొత్తగా చేరదలుచుకున్నవారు శుక్రవారం నుండి జనవరి 18వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.రాష్ట్రంలో.రాష్ట్రంలో మొత్తం 6కోట్ల41లక్షల 14వేల 587 మంది ఓటర్లలో, 6కోట్ల41లక్షల, 13వేల 773 మందికి దరఖాస్తు ఫారాలు పంపిణీ చేశారు. వాటిలో 6కోట్ల41లక్షల 13వేల 221 ఫారాలు పూర్తిచేసి ఈసీకి సమర్పించారు. ఈ వివరాలతో రూపొందించి విడుదల చేసిన ముసాయిదా ఓటరు జాబితాను ఎన్నికల కమిషన్, రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి, కార్పొరేషన్లు, జిల్లా కలెక్టర్ కార్యాలయ వెబ్సైట్ల నుండి డౌన్లోడ్ చేసి వీక్షించవచ్చు. మసాయిదా ఓటరు జాబితాలో చిరునామా మారిన వారు ఫారం 8, కొత్తగా చేరదలిచిన వారు ఫారం 6ను పూర్తిచేసి ఈసీ కోరిన ఆధారాలతో సమర్పించి జనవరి 18వ తేదీలోపు తమ పేర్లు నమోదు చేయించుకోవాలి, ఇక తుది ఓటరు జాబితా ఫిబ్రవరి 17న విడుదలవుతుంది.కాగా.. తెన్కాశి జిల్లాలో 1.51లక్షల మంది, వేలూరు జిల్లాలో 2.15లక్షల మంది, కళ్లకురుచ్చి జిల్లా 2.15లక్షల మంది, తంజావూరు జిల్లా 2.06లక్షల మంది, తిరునల్వేలి జిల్లాలో 2.14లక్షల మంది, మైలాడుదురై జిల్లాలో 75.378 మందిని ఓటరు జాబితా నుండి తొలగించారు. అదే విధంగా రాణిపేట 1.40లక్షల మంది, దిండుగల్లో 3.20లక్షల మంది, కరూర్ జిల్లాలోని 4 నియోజకవర్గాల్లో 79,690 మంది, అరియలూరు జిల్లాలో 24,368 మంది ఓటర్లను తొలగించడం గమనార్హం.గ్రేటర్ చెన్నైలో.గ్రేటర్ చెన్నైలో 14.25 లక్షల మంది ఓటర్లను తొలగించారు. ఎన్నికల కమిషన్ విడుదల చేసిన ముసాయిదా ఓటరు జాబితాలో పేర్లులేని వారు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, వారు కొత్తగా ఓటరు జాబితాలో చేరవచ్చని ఈసీ హామీ ఇచ్చింది. నగరంలో ఎస్ఐఆర్ ప్రారంభించక ముందు 40,03694 మంది ఓటర్లుండగా, ముసాయిదా ఓటరు జాబితాలో 25,79,676 మంది మాత్రమే ఉండటం గమనార్హం. పాత ఓటరు జాబితాల నుండి 14,20,018 మందిని తొలగించారు. వీరిలో 1.56లక్షల మంది మరణించినవారు కాగా, ఓటరు జాబితాలో ఉన్న చిరునామాలో లేనివారు 27,328 మంది,అలాగే వలస వెళ్లిన వారు 12,22,164 మంది, రెండు ప్రాంతాల్లో ఓటు హక్కు కలిగివున్న వారు 18,772 మంది అని ఈసీ తెలిపింది. నగరానికి చెందిన ముసాయిదా ఓటరను జాబితాలో 13,31,243 మంది మహిళలున్నారు. ముఖ్యమంత్రి స్టాలిన్ ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహిస్తున్న కొళత్తూరు నియోజకవర్గంలో 1.03లక్షల మంది ఓటర్లను తొలగించారు. ప్రస్తుతం 1.86లక్షల మంది ఓటు హక్కు కలిగివున్నారు. అలాగే డిప్యూటీ సీఎం ఉదయనిధి నియోజకవర్గం చేపాక్కం-ట్రిప్లికేన్లో 89వేల మందిని ఓటరు జాబితా నుండి తొలగించగా, 1.50లక్షల మంది ఓటర్లున్నారు.



# పెను విషాదం రైలు ప్రమాదంలో 8 ఏనుగులు మృతి




అస్సాం : అస్సాంలో పెను విషాదం చోటుచేసుకుంది. ఏనుగుల గుంపును రైలు ఢీకొట్టిన ఘటనలో 8 ఏనుగులు ప్రాణాలు కోల్పోగా.. ఓ ఏనుగు పిల్ల తీవ్రంగా గాయపడింది. (శనివారం) ఉదయం ఈ సంఘటన చోటుచేసుకుంది. సంఘటనకు సంబంధించిన వివరాల్లోకి వెళితే.. శనివారం తెల్లవారుజామున 2.17 గంటల సమయంలో అస్సాంలోని హెజాయ్ ప్రాంతంలో ఏనుగుల గుంపు రైలు పట్టాలు దాటుతూ ఉన్నాయి. ఈ నేపథ్యంలో సాయిరంగ్ – న్యూఢిల్లీ రాజధాని ఎక్స్ప్రెస్ రైలు ఆ పట్టాలపై వేగంగా దూసుకువచ్చింది. పట్టాలు దాటుతున్న ఏనుగుల్ని ఢీకొంది. దీంతో 8 ఏనుగులు అక్కడికక్కడే చనిపోయాయి.ఓ ఏనుగు పిల్ల తీవ్రంగా గాయపడింది. గువహటికి 126 కిలోమీటర్ల దూరంలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఏనుగులు ఢీకొట్టిన వేగానికి లోకో మోటివ్తో పాటు ఐదు కోచులు పట్టాలు తప్పాయి. ఈ ఘటనలో ఎవ్వరికీ ఏమీ కాలేదు. ఇక, సమాచారం అందుకున్న రైల్వే అధికారులు హుటాహుటిన ప్రమాదం జరిగిన చోటుకు వెళ్లారు. సహాయక చర్యలు మొదలుపెట్టారు. రైలు పట్టాలు తప్పటంతో పాటు ఏనుగుల కళేబరాలు చెల్లా చెదురుగా పడిపోవటంతో ఎగువ అస్సాంతో పాటు పలు ఈశాన్య ప్రాంతాలకు సంబంధించిన రైలు సేవలు నిలిచిపోయాయి. ప్రమాదం జరిగిన ప్రాంతం ఎలిఫెంట్ కారిడార్ కాకపోవటంతో ఈ ఘోరం జరిగినట్లు తెలుస్తోంది. పట్టాలపై ఏనుగుల్ని చూసిన లోకో పైలట్ ఎమర్జెన్సీ బ్రేక్స్ వేశాడు. అయినా కూడా దారుణం జరిగిపోయింది. రైలు ఏనుగుల్ని ఢీకొట్టింది.

# సంప్రదాయ వైద్యంతో అనేక ఆరోగ్య సమస్యల పరిష్కారం

దిల్లీ: సంప్రదాయ వైద్యం ఆధునిక జగతి ఎదుర్కొంటున్న అనేక ఆరోగ్య సమస్యల పరిష్కారానికి సాయపడగలదని ప్రపంచ ఆరోగ్య సంస్థ ( డబ్ల్యూహెచ్ఓ) డైరెక్టర్ జనరల్ డాక్టర్ టెడ్రోస్ అదనోమ్ తెలిపారు. సైన్స్, సంప్రదాయ వైద్యం ఒకదాన్ని మరొకటి పరిపూర్ణం చేస్తాయని భారత్ ప్రపంచానికి చాటిందని వెల్లడించారు. దిల్లీలో సంప్రదాయ వైద్యంపై ప్రపంచ ఆరోగ్య సంస్థ శుక్రవారం నిర్వహించిన గ్లోబల్ సమ్మిట్ లో టెడ్రోస్ అథనామ్ ఈ మేరకు వ్యాఖ్యానించారు. ఈ క్రమంలో భారత్ పై ప్రశంసలు కురిపించారు. ఈ సమ్మిట్?లో భారత ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి జేపీ నడ్డా సహా 100 దేశాలకు చెందిన మంత్రులు, శాస్త్రవేత్తలు, పరిశోధకులు పాల్గొన్నారు. ప్రపంచ స్థాయిలో సాంప్రదాయ వైద్యాన్ని సమర్థించినందుకు ప్రధాని నరేంద్ర మోదీని టెడ్రోస్ అధనోమ్ ప్రశంసించారు. సమకాలీన ఆరోగ్య సవాళ్లను పరిష్కరించడంలో సాంప్రదాయ వైద్యం తాలుక ఔచిత్యాన్ని హైలైట్ చేశారు. భారత్ అధ్యక్షతన జరిగిన జీ20 సమావేశంలో ప్రధాని మోదీ సంప్రదాయ వైద్యం గురించి అంతర్జాతీయ స్థాయిలో తెలియజేశారని అన్నారు. ఆ పిలుపే ఇప్పుడు సంప్రదాయ వైద్యానికి అపూర్వమైన అంతర్జాతీయ ప్రతిస్పందనను సృష్టించిందని పేర్కొన్నారు. 'ఒకే భూమి, ఒకే ఆరోగ్యం' అనే ప్రధాని మోదీ దార్శనికత సాంప్రదాయ వైద్యం ప్రధాన సూత్రాలతో ఏకీభవిస్తుందని తెలిపారు. 'సంప్రదాయ వైద్యంతో ఆరోగ్య సమస్యలు పరిష్కారం' "సంప్రదాయ వైద్యం నేటి ఆధునిక జగతి ఎదుర్కొంటున్న అనేక ఆరోగ్య సమస్యల పరిష్కారానికి సాయపడుతుంది. అలాగే ఆరోగ్య సంరక్షణకు ఉపయోగపడుతుంది. సంప్రదాయ వైద్యం, ఆవిష్కరణలు కలిసి ముందుకు సాగగలవని భారత్ చూపించింది. ఆధునిక విజ్ఞాన శాస్త్రం, సంప్రదాయ విజ్ఞానం ఒకదాన్ని మరొకటి పరిపూర్ణం చేస్తాయని భారత్ ప్రపంచానికి చాటి చెప్పింది. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వం ఈ దార్శని కతను ప్రపంచం ముందుకు తీసుకురావడంలో సహాయపడింది. దిల్లీ డిక్లరేషన్ ను ఆమోదించడాన్ని స్వాగతిస్తున్నాను. సాంప్ర దాయ వైద్యం గతానికి సంబంధించినది కాదు. ఆధునిక ఆరోగ్య సంరక్షణ వ్యవస్థలకు కేంద్రంగా మారుతున్న ఒక సజీవ, అభివృద్ధి చెందుతున్న శాస్త్రం అని భారత్ స్పష్టంగా నిరూపిం చింది. సాంస్కృతిక వారసత్వం, మేధో సంపత్తిన్ని గౌరవిస్తూ జీవవైవిధ్యం, సాంప్రదాయ వైద్యాన్ని కాపాడటానికి మేము కృషి చేస్తాం" అని టెడ్రోస్ అధనోమ్ వ్యాఖ్యానించారు. భారత్, డబ్ల్యూహెచ్ఓ మధ్య పెరుగుతున్న బంధానికి ప్రతీకగా దిల్లీలో కొత్తగా నిర్మించిన ప్రపంచ ఆరోగ్య సంస్థ ఆగ్నేయాసియా ప్రాంతీయ కార్యాలయ కాంప్లెక్స్ ను ప్రధాని మోదీ శుక్రవారం ప్రారంభించారు. గుజరాత్ లోని జామ్ నగర్ లో డబ్ల్యూహెచ్ఓ గ్లోబల్ సెంటర్ ఫర్ ట్రెడిషనల్ మెడిసిన్ స్థాపించారు. ఈ విషయంపైనా టెడ్రోస్ అధనోమ్ స్పందించారు. ఈ ప్రయత్నాలు సాంప్రదాయ వైద్యాన్ని ఆరోగ్య వ్యవస్థలు, పరిశోధనలతో అనుసంధానించడానికి సహాయపడ్డాయని పేర్కొన్నారు.అలాగే 'డబ్ల్యూహెచ్ఓ గ్లోబల్ సమ్మిట్ ఆన్?ట్రెడిషనల్ మెడిసిన్' శిఖరాగ్ర సమావేశానికి హాజరైన టెడ్రోస్ అధనోమ్?తో మోదీ ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఈ క్రమంలో సాంప్రదాయ వైద్యం తాలుక అపారమైన సామర్థ్యం గురించి టెడ్రోస్ అధనోమ్?కు మోదీ తెలియజేశారు. ఈ విషయాన్ని తెలియజేస్తూ మోదీ ఎక్స్ లో పోస్ట్ చేశారు. "డబ్ల్యూహెచ్ఓ డైరెక్టర్ జనరల్ డాక్టర్ టెడ్రోస్ అధనోమ్ ఘెబ్రేయేసస్ తో ఫలప్రదమైన చర్చ జరిగింది. సంపూర్ణ ఆరోగ్యం, ఆరోగ్య సంరక్షణను ప్రోత్సహించడంలో సంప్రదాయ వైద్యం తాలుక అపారమైన సామర్థ్యం గురించి మేము చర్చించాం" అని మోదీ ఎక్స్ పోస్ట్?లో పేర్కొన్నారు.ఇదే కార్యక్రమంలో పాల్గొన్న మోదీ సంప్రదాయ వైద్యం గురించి కీలక వ్యాఖ్యలు చేశారు. సంప్రదాయ వైద్యానికి దక్కాల్సిన గుర్తింపు లభించడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. విజ్ఞానశాస్త్రం ద్వారా విశ్వాసాన్ని పెంపొందించి, సంప్రదాయ వైద్యం పరిధిని విస్తరించాలని వెల్లడించారు. పరిశోధనల బలోపేతంతో పాటు డిజిటల్ టెక్నాలజీ వినియోగం వల్ల సంప్రదాయ వైద్యానికి మరింత ప్రాచుర్యం లభిస్తుందని స్పష్టం చేశారు. ఆయుర్వేదంలో సమ స్థితిని ఆరోగ్యానికి పర్యాయపదంగా పరిగణిస్తారని అన్నారు.



# గవర్నర్ రవి సంచలన కామెంట్స్



చెన్నై: రాష్ట్రం ఆత్మహత్యలకు రాజధానిగా మారుతోందని, జాతీయ నేరగణాంకాలను బట్టి ప్రతియేటా ఈ రాష్ట్రంలో 20 వేల మంది ఆత్మహత్యలు చేసుకుంటున్నారని గవర్నర్ ఆర్ఎన్ రవి( ఆవేదన వ్యక్తం చేశారు. ప్రపంచ స్థాయిలో జాతి,, మత విద్వేషాల కారణంగా పలు యుద్ధాలు జరుగుతున్నాయని, మానవులు మానసిక ఒత్తిడుల కారణంగా, వేర్పాటువాదంవల్ల ఆత్మహత్యలు చేసుకుంటున్నారన్నా రు. కోయంబత్తూరులోని ఓ ప్రైవేటు కళాశాలలో శుక్రవారం ఉదయం 'సింధూ సరస్వతి నాగరికత మహానాడు' ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో రోజుకు 65 మంది చొప్పున ఆత్మహత్య చేసుకుంటున్నారన్నారు.ఆత్మహత్యలను నిరోధించడానికి మానవుల జీవితాలను మెరుగుపరచడంతోపాటు దేశ సంస్కృతీ సంప్రదయాలు, ఆచరిస్తున్న సిద్ధాంతాలు గురించి ఎలుగెత్తి చాటాల్సిన అవసరం ఉందన్నారు. ఆర్యులు, ద్రావిడులని ప్రజల్లో విబేధాలను సృష్టించేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారని, వారిప్రయత్నాలు ఎన్నటికీ సఫలం కావని, కారణం వారి వద్ద అసత్యాలతో ఆచరణకు సాధ్యం కాని సిద్ధాంతాలే ఉన్నాయని గవర్నర్ చెప్పారు.

# పాక్ మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ దంపతులకు 17 ఏళ్ల జైలు శిక్ష



పాకిస్థాన్ : పాకిస్థాన్ మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ అతని భార్య బుష్రా బీబీ(కు ఊహించని షాక్ తగిలింది. తొషఖానా – 2 అవినీతి కేసులో ఫెడరల్ ఇన్వేస్టిగేషన్ ఏజెన్సీ ప్రత్యేక కోర్టు ఇమ్రాన్ ఖాన్ దంపతులకు 17 ఏళ్లు జైలు శిక్ష విధిస్తూ శనివారం తీర్పునిచ్చింది. ప్రస్తుతం ఇమ్రాన్ ఖాన్ ఉన్న రావల్పిండిలోని అడియాలా జైలోనే విచారణ జరిపిన న్యాయస్థానం ఈ తీర్పులు వెలువరించడం గమనార్హం. 2021 మే నెలలో సౌదీలో ఇమ్రాన్ పర్యటించారు. 2021 మే నెలలో సౌదీ అరేబియా పర్యటించిన సందర్భంగా యువరాజు ఇమ్రాన్ ఖాన్ దంపతులకు ఖరీదైన 'బల్గరి' నగల సెట్ ను బహుమతి()గా అందజేశారు.ప్రభుత్వ ఖాజానాకు (తోషఖానా)కు అప్పగించకుండా ఇమ్రాన్ అతని భార్య బుష్రా సొంత ప్రయోజనం కోసం తక్కువ ధరకు విక్రయించినట్లు వచ్చిన ఆరోపణపై కేసు నమోదైంది. ఈ కేసును విచారించిన ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి షారుఖ్ అర్జు మంద్ ఈ సంచలన తీర్పు ప్రకటించారు. ప్రధాని హూదాలో ఉంటూ నమ్మకద్రోహానికి పాల్పడి నందుకు పాకిస్థాన్ పీనల్ కోడ్ సెక్షన్ 409 కింద 10 ఏళ్లు కఠిన శిక్ష, అవినీతి నిరోధక చట్టంలోని పలు సెక్షన్ల కింద 7 ఏళ్లు సాధారణ శిక్ష విధించారు. అంతేకాదు దంపతులకు చెరో రూ.16.4 మిలియన్ జరిమానా కూడా విధించారు. ఈ తీర్పుతో ఇమ్రాన్ ఖాన్ మరో పదేళ్ల వరకు ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం పోయింది.ఈ తీర్పును హై కోర్టులో సవాలు చేస్తామని ఇమ్రాన్ ఖాన్ తరుపు న్యాయవాది తెలిపారు.

# హిందూ వ్యక్తి హత్యపై బంగ్లాదేశ్ సీరియస్

బంగ్లాదేశ్ : బంగ్లాదేశ్లో అరాచక శక్తులు రెచ్చిపోతున్నాయి. మతపరమైన ఆరోపణల సాకుతో సామాన్యులపై జరుగుతున్న దాడులు ఆ దేశ ప్రతిష్ఠను అంతర్జాతీయంగా దిగజార్చుతున్నాయి. ఇటీవల 25 ఏళ్ల దీపూ చంద్రదాస్ అనే హిందూ యువకుడిని "ఇస్లాంకు వ్యతిరేకంగా వ్యాఖ్యలు చేశాడన్న" నెపంతో నిరసనకారులు క్రూరంగా కొట్టి చంపిన ఘటన తీవ్ర సంచలనం సృష్టించింది. ఈ అమానుష కాండపై ప్రపంచవ్యాప్తంగా నిరసనలు వ్యక్తమ వ్వడంతో.. ఎట్టకేలకు యూనస్ ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది.ఏడుగురి అరెస్ట్.. ప్రభుత్వం సీరియస్ దీపూ చంద్రదాస్ హత్య కేసులో ఇప్పటి వరకు ఏడుగురు నిందితులను అరెస్ట్ చేసినట్లు బంగ్లాదేశ్ ప్రభుత్వ ప్రధాన సలహాదారు అధికారికంగా ప్రకటించారు. "మా పాలనలో మూక దాడులకు తావులేదు. చట్టాన్ని చేతుల్లోకి తీసుకున్న వారికి కఠిన శిక్షలు తప్పవు" అని ఆయన హెచ్చరించారు. అల్లర్లపై దర్యాప్తు చేసేందుకు ప్రత్యేక కమిషన్ను ఏర్పాటు చేశామని, ప్రజలందరూ సంయమనం పాటించాలని కోరారు. అయితే క్షేత్రస్థాయిలో హిందువులపై జరుగుతున్న దాడులు ఇంకా ఆందోళన కలిగిస్తూనే ఉన్నాయి.భారతీయులకు హైకమిషన్ అప్రమత్తతబంగ్లాదేశ్లో పరిస్థితులు ఇంకా అదుపులోకి రాకపోవడంతో అక్కడి భారత హైకమిషన్ కీలక సూచనలు చేసింది. బంగ్లాదేశ్లో నివసిస్తున్న భారతీయ పౌరులు అత్యవసరమైతే తప్ప ఇళ్ల నుంచి బయటకు రావొద్దని హెచ్చరించింది. స్థానిక పరిస్థితులను ఎప్పటికప్పుడు గమనిస్తూ అప్రమత్తంగా ఉండాలని సూచించింది. మరోవైపు విద్యార్థుల ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన యువనేత షరీఫ్ ఉస్మాన్ హాదీ మృతితో రాజధాని ఢాకాలో ఉద్రిక్తతలు మరింత పెరిగాయి. శనివారం ఆయన అంత్యక్రియల సందర్భంగా భారీ ఎత్తున నిరసనకారులు గుమిగూడారు.ఇదీ చూడండి: బంగ్లాదేశ్లో హిందూ నేత కిడ్నాప్, దారుణ హత్య.. తీవ్రంగా స్పందించిన భారత్





# మేమిద్దరం వెళ్తాం ఢిల్లీ పర్యటనపై డీకే

బెంగళూరు: అధికార మార్పిడి అంశంపై కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ మధ్య అంతరం పెరుగుతోందంటూ ఊహాగానాలు వెలువడుతున్న నేపథ్యంలో డీకే శివకుమార్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. చర్చల కోసం ఎప్పుడు పిలిచేది కాంగ్రెస్ అధిష్ఠానం తమ ఇద్దరికీ చెప్పిందని అన్నారు. అధిష్ఠానం ఎప్పుడు పిలిస్తే అప్పుడు ఇద్దరూ వెళ్తామని తెలిపారు.పార్టీ అధిష్ఠానాన్ని కలిసేందుకు ఇద్దరు నేతలు వెళ్లే అవకాశం ఉందా అని అడిగినప్పుడు డీకే నవ్వుతూ సమాధానమిచ్చారు. మీడియాకు తప్పనిసరిగా చెబుతానని, ఏదీ దాచిపెట్టనని అన్నారు. సరైన సమయంలో ఢిల్లీకి పిలుస్తామని అధిష్ఠానం పెద్దలు తమ ఇద్దరికి ఫోన్ చేసి చెప్పారని, పిలుపు ఎప్పుడు వస్తే అప్పుడు ఇద్దరూ వెళ్తామని తెలిపారు. ముఖ్యమంత్రి పదవిలో తాను కొనసాగుతానని అసెంబ్లీలో సిద్ధరామయ్య తాజాగా ప్రకటించిన నేపథ్యంలో డీకే ఈ వ్యాఖ్యలు చేశారు.ఉత్తర కర్ణాటక అభివృద్ధి పనుల అంశంపై సిద్ధరామయ్య శుక్రవారంనాడు అసెంబ్లీలో మాట్లాడుతూ, తన పదవీకాలం రెండున్నరేళ్లకే పరిమితమని తాను ఎప్పుడూ చెప్పలేదని అన్నారు. అధిష్ఠానం తనను ఐదేళ్లూ పదవిలో కొనసాగిస్తుందని అనుకుంటున్నట్టు చెప్పారు. 'మీ హయాంలో నార్త్ కర్ణాటకకు ఇచ్చిన హామీలు నెరవేరుతాయా?' అని బీజేపీ ఎమ్మెల్యే ఒకరు అడిగిన ప్రశ్నకు స్పందనగా సీఎం ఈ సమాధానం ఇచ్చారు.సీఎం పదవిపై సిద్దరామయ్య క్లారిటీ ఇచ్చారు. ఇదే సమయంలో డీకే శివకుమార్ పుణ్యక్షేత్రాలను సందర్శించడం అందరి దృష్టిని ఆకర్షించింది. అమావాస్య వేళ అమ్మవారి ఆలయాలను డీకే శివకుమార్ సందర్శించారు. ఈ సందర్భంగా సీఎం పదవిపై సిద్దరామయ్య వ్యాఖ్యలపై స్పందించారు డీకే శివకుమార్. తనకు , సిద్దరామయ్యకు మధ్య ఎలాంటి అభిప్రాయభేదాలు లేవన్నారు.కర్ణాటకలో కాంగ్రెస్ వ్యవహారాలపై బీజేపీ తీవ్రంగా మండిపడింది. సిద్దరామయ్య , డీకే శివకుమార్ ఆధిపత్య పోరుతో కర్ణాటకలో అభివృద్ధి కుంటుపడిందన్నారు కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషి. కర్నాటక వ్యవహారాలపై కాంగ్రెస్ హైకమాండ్ పట్టు కోల్పోయింది అన్నారు. అందుకే సిద్దరామయ్య రోజుకో తీరుగా మాట్లాడుతున్నారని అన్నారు. "కాంగ్రెస్ దగ్గర ఇప్పుడు కమాండ్ లేదు. కమాండ్ లేనప్పుడు నిర్ణయం రాదు. తానే సీఎం అవుతానని డీకే శివకుమార్ చెబుతారు.. నవంబర్ , డిసెంబర్ లోనే పగ్గాలు చేపట్టాలి.. కాని కాస్త ఆలస్యమయ్యిందని చెబుతారు. ఇద్దరు కలిసి బ్రేక్ఫాస్ట్ మీటింగ్ చేస్తారు.. ఎలాంటి అభిప్రాయభేదాలు లేవని అంటారు. హైకమాండ్ దగ్గర చెప్పడానికి ఏమి లేదు" అని ప్రహ్లాద్ జోషి పేర్కొన్నారు. అధిష్ఠానం తన వైపే ఉందని అనుకుంటున్నానని, అయితే పార్టీ పెద్దలు ఏ నిర్ణయం తీసుకున్నా తాను కట్టుబడి ఉంటానని చెప్పారు.కాగా, పలువురు నాగసాధువులు శనివారంనాడు డీకే నివాసానికి వచ్చి ఆశీస్సులు ఇచ్చారు. రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రిగా కూడా ఉన్న డీకే మంగళవారంనాడు పలువురు కేంద్ర మంత్రులను కలుసుకునేందుకు ఢిల్లీ వెళ్తున్నారు. నదుల అనుసంధానం విషయంలో కేంద్ర ప్రభుత్వ జలవనరుల శాఖ తమను పిలిచినట్టు డీకే తెలిపారు. మహదయి, కృష్ణ వాటర్ అవార్డ్, మేకేదాటు, ఎగువ భద్ర ప్రాజెక్టులకు సంబంధించి చర్చించనున్నట్టు చెప్పారు.



# డాక్టర్లు స్వేచ్ఛగా విదేశాలకు వెళ్లవచ్చు



లక్నో: దేశంలో వైద్య సౌకర్యాలు సరిగా లేవని యువ డాక్టర్లు ఇక ఫిర్యాదు చేయరాదు అని కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జగత్ ప్రకాశ్ నడ్డా అన్నారు. దేశంలో ఉన్న వనరులను, సంస్థలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. విదేశాలకు వెళ్లాలనుకుంటున్న యువ డాక్టర్లు స్వేచ్ఛగా వెళ్లవచ్చు అని, కానీ విదేశాలకు వెళ్లే నెపంతో దేశంలో వైద్య సౌకర్యాలు సరిగా లేవని నిందలు మోపరాదు అని మంత్రి నడ్డా పేర్కొన్నారు. లక్నోలో కింగ్ జార్జి మెడికల్ యూనివర్సిటీ 21వ స్నాతకోత్సవంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ విదేశాలకు వెళ్లే యువ డాక్టర్లు స్వేచ్ఛగా వెళ్లవచ్చు అని, కానీ భారత్లో సదుపాయాలు లేవని నిందలు చేయవద్దు అన్నారు. ఇక్కడ ఉన్న సంస్థలను, సదుపాయాల్ని వాడుకోవాలన్నారు. ప్రధాని మోదీ నేతృత్వంలో దేశ వైద్య వ్యవస్థ పూర్తిగా మారిందన్నారు. దేశంలో ఆల్ ఇండియా ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ సంస్థల సంఖ్య ఇప్పుడు 23కు పెరిగిందన్నారు.

# సోషల్ మీడియా వెట్టింగ్ పాలసీతో సంకటం

## గందరగోళంలో అమెరికాలో పనిచేస్తున్న ఉద్యోగులు -అమెరికాను వీడి వెళ్లొద్దని గూగుల్ అడ్వయిజరీ



**న్యూయార్క్,డిసెంబర్20:** అమెరికా తీసుకొచ్చిన కొత్త సోషల్ మీడియా వెట్టింగ్ పాలసీ ఇప్పుడ కలకలం సృష్టిస్తోంది. ఈ కారణంగా చాలామంది దరఖాస్తుదారుల వీసా అపాయింట్‌మెంట్లు 2026 అక్టోబరు నెలాఖరుకు వాయిదా పడినట్లు వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ప్రముఖ టెక్ కంపెనీ గూగుల్ కొందరు ఉద్యోగులను హెచ్చరించింది. అమెరికాను వీడి బయటకువెళ్లొద్దని అడ్వైజరీ జారీ చేసినట్లు ఈ మేరకు ఆంగ్ల మీడియా కథనం పేర్కొంది. అమెరికాకు తిరిగి రావడానికి వీసా స్టాంపింగ్ అవసరమయ్యే ఉద్యోగులు నెలలపాటు ఎదురుచూడాల్సి వస్తుందని గూగుల్ న్యాయనిపుణులు హెచ్చరించారు. ఈ నేపథ్యంలో యూఎస్ వీసాలపై ఉన్న సిబ్బంది అంతర్జాతీయ ప్రయాణాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఈమేరకు యాజమాన్యం సిబ్బందికి మెయిల్ పంపింది. డిసెంబరు 15వ తేదీ నుంచి హెచ్1బీ, హెచ్4 వీసా దరఖాస్తుదారులకు సోషల్ వెట్టింగ్‌ను అమెరికా ప్రారంభించిన సంగతి తెలిసిందే. దాంతో వీసా అపాయింట్‌మెంట్లలో జాప్యం ఎదురవుతోంది. ఎఫ్,జే,ఎం వంటి వీసాల పైనా ఈ ప్రభావం ఉంటుందని గూగుల్ నిపుణులు పేర్కొన్నారు. ఇప్పటికే అమెరికా వెలుపల ఉన్నవారి విషయంలో మాత్రం ఎలాంటి సూచనలు చేయలేదు. కాగా.. కొత్త వెట్టింగ్ విధానం వల్ల వీసా ఇంటర్వ్యూలను వచ్చే ఏడాది ఫిబ్రవరి–మార్చికి రీషెడ్యూల్ చేసినట్లు ఇటీవల అమెరికా ఎంబసీ అధికారులు వెల్లడించిన సంగతి తెలిసిందే. అయితే ఈ పక్రియ మరింత ఆలస్యమవుతున్నట్లు తెలుస్తోంది. వీరి ఇంటర్వ్యూ తేదీలను ఇప్పుడు అక్టోబరు నెలకు వాయిదా వేసినట్లు మీడియా కథనాలు పేర్కొన్నాయి. వీసా దరఖాస్తుదారుల సోషల్ మీడియా ఖాతాలను క్షుణ్ణంగా స్క్రీనింగ్ చేసేందుకు అదనపు సమయం పడుతోందని, అందువల్లే ఇంటర్వ్యూలను వాయిదా వేస్తున్నట్లు అమెరికా అధికారులు చెబుతున్నారు. దీంతో దరఖాస్తుదారుల పరిస్థితి గందరగోళంలో పడింది. ఇప్పటికే అమెరికాలో ఉద్యోగాలు సాధించి.. ప్రయాణాల కోసం టికెట్లు బుక్ చేసుకున్నవారు ఇబ్బందులు పడుతున్నారు. ఈ క్రమంలో గూగుల్ అడ్వయిజరీ దీనిని సమర్థించేలా ఉంది. దీంతో వచ్చే ఏడాది వరకు ఉద్యోగులకు కష్టాలు తప్పేలా లేవు.

# అమెరికా సిబ్బందిపై దాడికి ప్రతీకారం

## ఇస్లామిక్ టెర్రరిస్టులపై అమెరికాదాడి



**న్యూయార్క్,డిసెంబర్20:** సిరియా లోని ఇస్లామిక్ స్టేట్ స్థావరాలను అమెరికా టార్గెట్ చేసింది. ఆ స్థావరాలపై అమెరికా సైన్యం వైమానిక దాడులు చేసింది. ఇటీవల అమెరికా సిబ్బందిపై సిరియా దాడి చేసిన నేపథ్యంలో ప్రతీకార దాడులకు పాల్పడినట్లు ఓ అధికారి తెలిపారు. అనుమానిత ఇస్లామిక్ స్టేట్ ఉగ్రవాదులు సిరియాలో ఉన్న అమెరికా సైనిక సిబ్బందిపై దాడి చేశారని, దానికి ప్రతీకారం తీర్చుకుంటామని అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఇటీవల వెల్లడించారు. ఐఎస్ఐఎస్ ఫైటర్లు, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, ఆయుధ కేంద్రాలను టార్గెట్ చేసినట్లు అమెరికా డిఫెన్స్ మంత్రి పీట్ హెగ్‌సేత్ తెలిపారు. ఆపరేషన్ హాక్‌ఐలో భాగంగా ఆ దాడి జరిగినట్లు ఆయన చెప్పారు. ఇదేమీ యుద్ధం కాదు అని, ఇది కేవలం ప్రతీకారం మాత్రమే అని ఆయన అన్నారు. మా శత్రువులను వేటాడామని, వాళ్లను చంపేశామని అన్నారు. ఈ దాడుల పక్రియ కొనసాగుతుందన్నారు. సెంట్రల్ సిరియాలో ఉన్న ఇస్లామిక్ స్టేట్‌కు చెందిన అనేక టార్గెట్లను ధ్వంసం చేసినట్లు ఇద్దరు అమెరికా అధికారులు పేర్కొన్నారు. సెంట్రల్ సిరియాలోని పల్మైరాలోఉన్న దళాలపై జరిపిన దాడుల్లో ఇద్దరు అమెరికా సైనికులు, ఓ ఇంటర్‌ప్రిటర్ మరణించారు. అమెరికా దళాలకు చెందిన సుమారు వెయ్యి మంది సైనికులు ఇంకా సిరియాలోనే ఉన్నారు.

# జీరాంజీ బిల్లు వల్ల పేదలకు ఉపయోగం లేదు

## పాత పద్దతిలోనే ఉపాధి హామీ కొనసాగాలి -సిపిఎం నేత బివి రాఘవులు డిమాండ్




**విజయవాడ,డిసెంబర్20:** కేంద్ర ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన జీరాంజీ బిల్లు వల్ల పేదలకు ఎటువంటి ఉపయోగమూ లేదని సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు అన్నారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఈ విషయంపై దేశ వ్యాప్తంగా ఆందోళనలు నిర్వహిస్తామన్నారు. గతంలో ఉన్న ఉపాధిహామీ చట్టాన్ని రద్దుచేసి కొత్తగా జీరాంజీ పథకాన్ని తీసుకొచ్చారని కేంద్ర ప్రభుత్వం తీరుపై విమర్శలు గుప్పించారు. దీనిలో కార్మికులకు గానీ, రాష్ట్రాలకు గానీ ఎటువంటి హక్కులూ లేవన్నారు. గతంలో కనీసం 100 రోజులు పని పేరుతో 50 రోజులన్నా కార్మికులకు ఉపాధి లభించేదని.. ఇప్పుడు కేంద్రం దయాదాక్షిణ్యాలపై ఉండేలా చేశారని విమర్శించారు. ఉపాధి హామీ పథకం వ్యవసాయ పనులకు ఆటంకమని చెబుతున్నారని.. అలాంటిదేమీ లేదని అనేక నివేదికలు, పరిశోధనలు బయటపెట్టాయని రాఘవులు తెలిపారు. గ్రామీణ పేదలు, వ్యవసాయ కార్మికుల శ్రమను కార్పొరేట్లు దోచుకునేందుకు ఈ పథకం ఉపయోగపడుతుం దన్నారు. పథకంలో నిధుల వాటా గతంలో కేంద్రానికి 90 శాతం రాష్ట్రానికి 10 శాతం వాటా ఉండేదని.. కానీ, ఇప్పుడు 60:40 శాతంగా మార్చి, రాష్ట్రాలపై భారం మోపుతున్నారని కేంద్ర ప్రభుత్వం తీరును ఎండగట్టారాయన. ఆకలిచావులు, వలసలు నివారించేందుకు ఉపయోగపడిన ఈ చట్టాన్ని రద్దు చేయడం వల్ల మళ్లీ ఆకలిచావులు పెరిగే ప్రమాదం ఉందని రాఘవులు ఆందోళన వ్యక్తం చేశారు. పథకానికి నిధుల కేటాయింపు డిమాండ్‌ను బట్టి కాకుండా.. రాజకీయ అవసరాలకు తగిన విధంగా కేటాయించేలా నిబంధనలు రూపొందించారని రాఘవులు విమర్శించారు. గతంలో కేంద్రం ముందుగానే నిధులు ఇచ్చేదని.. ఇప్పుడు పనిచేసిన తరువాత బిల్లు ఇచ్చేలా పథకాన్ని ప్రవేశపెట్టారన్నారు. ఉపాధి కల్పనలో ఆలస్యమయితే గతంలో కేంద్రమే పెనాల్టీ చెల్లించేదని.. ఇప్పుడు ఆ బాధ్యతను రాష్ట్రం మీదకు నెట్టేశారని వివరించారు. ఈ అంశంపై రాష్ట్రంలో అధికారంలో ఉన్న టిడిపి మాట్లాడటం లేదని, ప్రతిపక్షంలో ఉన్న వైసీపీ కూడా గట్టిగా ప్రశ్నించడం లేదని రాఘవులు విమర్శించారు. సెలక్టు కమిటీకి పంపించాలని చెప్పి వైసీపీ చేతులు ముడుచుకు కూర్చుందని.. ఈ రెండు పార్టీలు మోడీని చూసి భయపడుతున్నాయన్నారు. రాష్ట్రంలో ఉన్న మూడు పార్టీలు మోడీతో అనుసరిస్తున్న తీరువల్ల రాష్ట్రానికి తీవ్రనష్టం వాటిల్లుతుందని రాఘవులు ఆందోళన వ్యక్తం చేశారు. రాయలసీమకు అనువుగా ఉండేలా పారిశ్రామిక పాలసీని మార్చాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని రాఘవులు డిమాండ్ చేశారు. రాయలసీమ ప్రాంతంలో గ్రీన్‌ఫీల్డ్ ఇండస్ట్రియల్, ఎలక్ట్రానిక్స్ సిటీ నిర్మించాలన్నారు. అక్కడ పరిశ్రమలకు అనువైన వాతావరణం కూడా ఉందని చెప్పారు.

# ప్లాస్టిక్ రహిత స్వర్ణాంధ్రప్రదేశ్‌లో ప్రజలు భాగం కావాలి

## స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర కార్యక్రమంలో మంత్రి డోలా



**ఒంగోలు,డిసెంబర్20:** ప్లాస్టిక్ రహిత స్వర్ణాంధప్రదేశ్‌లో ప్రజలంతా భాగస్వాములు కావాలని మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి సూచించారు. శనివారం పొన్నలూరులో స్వచ్ఛాంధ్ర – స్వర్ణాంధ్ర కార్యక్రమంలో మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి, కలెక్టర్ పి. రాజబాబు పాల్గొన్నారు. గ్రామంలో రూ.65 లక్షల విలువైన రోడ్లు, సైడ్ కాలువల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి డీబీవీ స్వామి మాట్లాడారు. ప్రజల భాగస్వామ్యంతో పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన, ఆర్థికంగా అభివృద్ధి చెందిన రాష్ట్రాన్ని నిర్మించడమే సీఎం చంద్రబాబు లక్ష్యమని వ్యాఖ్యానించారు. విద్యార్థుల్లో వ్యక్తిగత పరిశుభ్రత, ఆరోగ్యకరమైన అలవాట్లు పెంపొందించేందుకు ఏపీ వ్యాప్తంగా ప్రతిష్టాత్మకంగా ముస్తాబు కార్యక్రమం నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ముస్తాబు కార్యక్రమాన్ని అనకాపల్లి జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ పాఠశాలలో సీఎం చంద్రబాబు లాంఛనంగా ముస్తాబు కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని చెప్పుకొచ్చారు. గ్రామాల్లో పచ్చదనం, పరిశుభ్రతకు కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని తెలిపారు. పరిసరాల పరిశుభ్రత సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అని మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి పేర్కొన్నారు.


# కౌన్సిల్ ఆఫ్ ఈహెచ్ఎస్ ప్రొఫెషనల్స్ ఆధ్వర్యంలో 29వ ఉచిత శిక్షణా కార్యక్రమం...




**(కుత్బుల్లాపూర్)** కుత్బుల్లాపూర్ జీడిమెట్ల కౌన్సిల్ ఆఫ్ ఈహెచ్ఎస్ ప్రొఫెషనల్స్ ఆధ్వర్యంలో 29వ ఉచిత శిక్షణా కార్యక్రమాన్ని జీడిమెట్ల ఇండస్ట్రీస్ అసోసియేషన్ కానారేన్స్ హాల్ లో విజయవంతంగా నిర్వహించారు. పరిశ్రమల్లో భద్రతా విధానాల బలోపేతం, పర్యావరణ పరిరక్షణపై అవగాహన, ల్యాబొరేటరీ భద్రతా ప్రమాణాలు, ఇండస్ట్రియల్ గ్యాస్ టెస్టింగ్, ఫైర్ సేఫ్టీ, అలాగే ఆక్యుపేషనల్ హెల్త్ అండ్ సేఫ్టీ మేనేజ్‌మెంట్ సిస్టమ్‌లపై ఈ కార్యక్రమంలో నిపుణులు విస్త ృతంగా అవగాహన కల్పించారు. పరిశ్రమలు ఎదుర్కొంటున్న ప్రస్తుత సవాళ్లను ద ృష్టిలో ఉంచుకుని భద్రతా చర్యలను వ్యవస్థబద్ధంగా, ముందస్తుగా అమలు చేయాల్సిన అవసరాన్ని ఈ సందర్రేగా వివరించారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ బోర్డు మెంబర్ అశోక్ పొడిశెట్టి పాల్గొని, భద్రతను కేవలం నిబంధనల పరిమితికి కాకుండా సంస్థ సంస్కృతిలో భాగంగా తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఉద్యోగుల భద్రత, సంస్థ ఆస్తుల పరిరక్షణ, పర్యావరణ సంరక్షణకు మేనేజ్‌మెంట్ నాయకత్వం మరియు ఉద్యోగుల చురుకైన భాగస్వామ్యం అత్యంత కీలకమని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమానికి కౌన్సిల్ ఆఫ్ ఈహెచ్ఎస్ ప్రొఫెషనల్స్ జనరల్ సెక్రటరీ ఎ. సూర్య ప్రకాశ్తో పాటు ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ హరి బుక్య, జి. జగదీశ్వరరావు, ఈ. తిరుపతి హాజరై పరిశ్రమలు ఎదుర్కొంటున్న ముఖ్యమైన ఈహెచ్ఎస్ సమస్యలపై చర్చల్లో పాల్గొన్నారు. వారి పాల్గొనడం సాంకేతిక చర్చలకు మరియు పరస్పర అభిప్రాయాల మార్పిడికి మరింత విలువను చేకూర్చింది. అదేవిధంగా రీసస్టైనబిలిటీ లిమిటెడ్ సంస్థకు చెందిన వైస్ ప్రెసిడెంట్ (బిజినెస్ ఆపరేషన్స్) శ్రీ ఆర్.కె.వి. నటరాజ్, బేసిక్ ఎలిమెంట్స్ సంస్థ డైరెక్టర్ ప్రసాద్ నిస్టాలాతో పాటు వారి సంస్థల అంశ నిపుణులు ఈ కార్యక్రమంలో పాల్గొని, పరిశ్రమల అనుభవాల ఆధారంగా ప్రాయోగిక అంశాలను వివరించారు. ఈ శిక్షణా కార్యక్రమంలో 80కి పైగా కంపెనీలకు చెందిన ఈహెచ్ఎస్ మరియు పర్యావరణ నిపుణులు, ల్యాబొరేటరీ సిబ్బంది, సీనియర్ మేనేజ్‌మెంట్ ప్రతినిధులు, అలాగే ఎస్ సి ఎం, మరియు హెచ్‌ఆర్ విభాగాల అధికారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ప్రజలు, పర్యావరణం మరియు సంస్థల ఆస్తుల రక్షణలో సమూహ బాధ్యత అత్యంత కీలకమని బలమైన సందేశంతో కార్యక్రమం ముగిసింది. పరిశ్రమల్లో ఈహెచ్ఎస్ ఉత్తమతను ప్రోత్సహించే విశ్వసనీయమైన, నమ్మదగిన మరియు ప్రభావవంతమైన వేదికగా కౌన్సిల్ ఆఫ్ ఈహెచ్ఎస్ ప్రొఫెషనల్స్ తన పాత్రను మరింత బలపరిచిందని నిర్వాహకులు తెలిపారు.. ఈ సందర్రేగా కౌన్సిల్ ఆఫ్ ఈహెచ్ఎస్ ప్రొఫెషనల్స్ అధ్యక్షులు తపస్ సహా మాట్లాడుతూ, గత 10 సంవత్సరాలుగా సి ఈ పి ప్రయాణం విజయవంతంగా కొనసాగడానికి సహకరించిన పరిశ్రమలు, ఫ్యాకల్టీలు మరియు అంశ నిపుణులకు క ృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో కూడా ఇదే విధమైన సహకారం కొనసాగుతుందని ఆశాభావం వ్యక్తం చేస్తూ, సిఈపి లక్ష్యాలను మరింత విస్త ృతంగా ముందుకు తీసుకెళ్లేందుకు అందరి సహకారం అవసరమని అన్నారు.

# ఏనుగుల గుంపును ఢీకొన్న రాజధాని


## పట్టాలు తప్పిన 5 బోగీలు.. ప్రయాణికులు సురక్షితం



**గౌహతి,డిసెంబర్20:** అస్సాంలో శనివారం తెల్లవారు జామున రైలు ప్రమాదం చోటు చేసుకుంది. సైరాంగ్ నుంచి ఢిల్లీ నుంచి బయల్దేరిన రాజధాని ఎక్స్‌ప్రెస్ ఏనుగుల గుంపును ఢీ కొట్టింది. ఈ ఘటనలో 8 ఏనుగులు మృతిచెందగా.. మరోకటి తీవ్రంగా గాయపడింది. ప్రమాదం ధాటికి రైలులోని 5 బోగీలు పట్టాలు తప్పాయి. ఈ ఘటనలో ప్రయాణికులెవరికీ ఎలాంటి ప్రమాదం జరగలేదని నార్త్‌ఈస్ట్ ఫ్రంటియర్ రైల్వే తెలిపింది.

# గ్రామాల బలోపేతం లక్ష్యం కావాలి !

తెలంగాణ పంచాయితీ ఎన్నికలు ముగిసాయి. ఈ ఎన్నికలతోనే ఇంకా అయిపోలేదు. ముమ్ముందు మరోమారు ఎంపిటిసి, జడ్పీటిసి ఎన్నికలు జరగాల్సి ఉంది. నిజానికి అన్నీ కలిపి ఒకే దఫాలో నిర్వహించి ఉంటే ఖర్చులు కలిసి వచ్చేవి. జమిలిగా నిర్వహించడం ద్వారా ఖర్చులు తగ్గించుకోవచ్చు. కానీ అలా జరగడం ఏ పార్టీకి ఇష్టం లేదు. అలా జరిగివుంటే ఖాజానాపై భారం తగ్గేది. కానీ రాజకీయ పార్టీలకు ముఖ్యంగా అధికార పార్టీకి వరుస ఎన్నికలు జరపడం ఇష్టం. ఎన్నికలు జరిపి పాలకవర్గాలను ఎన్నిక చేయడం ముఖ్యం కాదు. ఎన్నికల్లో తమవారిని ఎన్నుకోవడం వీరికి ముఖ్యం. ఎవరు అధికారంలో ఉన్నా ఇదే చేస్తారు. ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ అదే చేసింది. అప్పుల్లో కూరుకు పోయిన రాష్ట్రం అప్పుల నుంచి బయటపే అవకాశాలను వదులు కుంటుందనడానికి ఇదో నిరద్శనం. ఒకే విడతలో ఎన్నికల నిర్వహణ వల్ల అటు ప్రజలకు, ఇటు అధికారులకు కలసి వచ్చేది. కానీ ఇప్పుడు మళ్లీ మండల, జడ్పీ ఎన్నికలతో పాటు మున్సిపల్ ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. మొత్తంగా ఇటీవలి పంచాయితీ ఎన్నికల్లో ప్రజల తీర్పు ఎలా ఉన్నా ఓటేయడానికి భారీగా తరలి వచ్చారు. దీంతో దాదాపు కొన్నిచోట్ల 90శాతం కూడా ఓటింగ్ దాటింది. ప్రజలు కూడా తెలివి మీరారు. అందరి వద్దా డబ్బులు తీసుకుని వేయాల్సిన వారికి ఓటేశారు. నిలదీస్తే ఒట్లు పెట్టుకుని పక్కకు జరిగారు. మీకూ ఓటేశామని బాసలు చేశారు. కొందరు ఓటమిని తట్టుకోలేక తమ డబ్బులు వాపస్ ఇవ్వాలని ఊరంతా తిరిగారు. ప్రజలు మాత్రం ఎవరి వద్ద డబ్బులు తీసుకున్నా...తాము కోరుకున్న వారికే ఓటు వేసి తీర్పునిచ్చారు. అయితే అధికారంలో కాంగ్రెస్ పార్టీ ఉండడంతో సహజంగానే కాంగ్రెస్ పార్టీ బలపర్చిన వారికే ఎక్కువ ఓట్లు పడ్డాయి. ఎక్కువమంది వారే గెలిచారు. రాష్ట్రంలో తాజాగా ముగిసిన మూడు దశల స్థానిక సంస్థల ఎన్నికలు ఈ ఫలితాలనే




వెల్లడించాయి. ఇవి కేవలం రాజకీయ గెలుపోటముల లెక్కలుగానే చూడాలి. ఓ రకంగా చెప్పాలంటే పార్టీ, అభ్యర్థి, డబ్బులు ఈ మూడూ ఎన్నికల్లో ప్రభావితం చేశాయి. తెలంగాణ సామాన్య ప్రజాజీవన ప్రమాణంపై ప్రజలు ఇచ్చిన స్పష్టమైన తీర్పు అని చెప్పడానికి లేదు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ మద్దతు పొందిన సర్పంచ్ అభ్యర్థులు సుమారు 7 వేల పంచాయతీల్లో విజయం సాధించడం ఇందుకు నిదర్శనం. గతంలో ఎప్పుడూ లేనంతగా పంచాయితీల్లో డబ్బులు వెదజల్లారు. ఒక్కో గ్రామంలో 50లక్షల వరకు ఖర్చు పెట్టిన వారు ఉన్నారు. ఈ ప్రజా తీర్పు ఫలితాల్లోనే కాదు, ఎన్నికల ప్రక్రియలోనూ ప్రతిబింబించింది. స్థానిక సంస్థల ఎన్నికలు పార్టీ గుర్తులతో జరగవు. అయినా జనం డబ్బులకే ఓటేశారు. ఎందుకంటే ఎప్పుడూ లేని విధంగా గ్రామాల్లో కూడా సర్పంచ్ అభ్యర్థులు సొంత మేనిఫెస్టోనే ప్రచారం చేశారు. అయితే ఓటును సద్వినియోగం చేసుకోవాలన్న ప్రజాస్వామ్య ఆకాంక్ష ప్రజల్లో కనిపించింది. పార్టీ గుర్తులు లేకుండా జరిగిన ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ ఏడు వేల పంచాయతీల్లో గెలవడం కారణంగా ఇక పంచాయితీలను బలోపేతం చేయడం ద్వారా ప్రజా తీర్పును గౌరవించాలి. పంచాయితీలు ఆర్థికంగా బలపడేలా చేయాలి. ప్రజలు పార్టీ గుర్తుకు కాదు, పాలనకు ఓటు వేశారు. స్థానిక సంస్థలు అధికార విస్తరణకు కాదు, ప్రజల స్వయం పాలనకు వేదికలని గుర్తించాలి. ఇకపోతే ఎన్నికల్లో అనేక అంశాలు ప్రభావం చూపుతాయి. అది అధికార పార్టీకి ఎప్పుడూ అనుకూలంగా ఉంటుంది. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అమలుచేస్తోన్న ఆరు గ్యారెంటీల్లో మహాలక్ష్మి, గృహజ్యోతి, రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు వంటి పథకాలు కూడా ఓటర్లపై ప్రభావం చూపి ఉంటాయి. . ఉచిత బస్సు ప్రయాణం, రూ.500లకే గ్యాస్ సిలిండర్లు, ఉచిత విద్యుత్... వంటివి మహిళలను ప్రభావితం చేసే పథకాలు. అందువల్ల ఈ ఎన్నికల్లో మహిళలు అత్యదికంగా ఓటేశారు. గృహజ్యోతి, ఉద్యోగ భర్తీలు వంటి ప్రచారాలు కూడా కలసి వచ్చాయి. రైతు భరోసా, సన్నవడ్లకు బోనస్ వంటివి అన్నదాతలో కొంత ధైర్యాన్ని నింపి ఉంటాయి. పేదవారికి ఇందిరమ్మ ఇళ్లు, సన్నబియ్యం పంపిణీ వంటివి కూడా ప్రభావం చూపాయి. రేషన్ బియ్యం అంటే ముక్కిన బియ్యం కాకుండా కిలో రూపాయికే సన్నబియ్యం ఇవ్వడం కూడా కలసి వచ్చింది. అయితే ఇందులో కేంద్ర ప్రభుత్వ వాటానే హెచ్చుగా ఉన్నా, సామాన్య ప్రజలకు ఇది బోధపడదు. నిజానికి నీళ్లు, నియామకాలు అన్న ట్యాగ్ లైన్‌తో ఏర్పడ్డ తెలంగాణ మరోమారు వంచనకు గురయ్యింది. గత ప్రభుత్వ పదేళ్ల పాలనలో పెరిగిన అప్పులు, పెండింగ్ ప్రాజెక్టులు... ఈ భారాన్ని నేటి ప్రభుత్వం మోస్తూనే ఉంది. అలాగని ఈ ప్రభుత్వం కూడా అప్పులు చేయకుండా మడికట్టుకుని కూర్చో లేదు. ఉచిత పథకాలను రద్దు చేస్తే ఎక్కడ ఉద్యోగం ఊడుతుందో అన్న భయంతో ఉచితాలకే పెద్దపీట వేస్తున్నారు. దీంతో అప్పుల భారం మరింత పెరుగుతూ పోతోంది. నేడు ప్రతి గ్రామం ప్రగతి పథంలో నడవాలంటే పంచాయితీలు బలపడాలి. పంచాయితీల్లో పన్నుల వసూళ్లపైనే కాకుండా స్వయం సమృద్ధి సాధించేలా పాలన సాగించాలి. గ్రామపాలనకు అర్థం మారాలి. సర్పంచ్‌లు కేంద్రంగా కార్యకలాపాలు సాగాలి. ధాన్యం సేకరణ మొదలు, నీటి సరఫరా, విద్యుత్ వినియోగం, ఉచిత విద్యుత్‌పై అజమాయిషీ వంటి అనేక విషయాలు గ్రామ సర్పంచ్‌లకు తెలిసేలా జరగాలి. అభివృద్ధి సంక్షేమంలో వారిని బాధ్యులను చేయడం ద్వారా గ్రామ స్వరాజ్యానికి పునాది వేయాలి.

---

# నల్లగొండలో ఎమ్మెల్యేలు సరిగా పనిచేయలేదా

## స్థానిక ఎన్నికల్లో ఎమ్మెల్యేలో సమన్వయ లోపం

## రాజగోపాల్ రెడ్డి తీరుపై మరోమారు చర్చ

**నల్లగొండ,డిసెంబర్20:** పంచాయితీ ఎన్నికల్లో కాంగ్రెస్ బాగా దెబ్బతిన్న జిల్లాల్లో నల్లగొండ కూడా ఉంది. ఇక్కడి ఎమ్మెల్యలే÷-లో అనైక్యత ఫలితాలపై తీవ్ర ప్రభావం చూపింది. ఎవరికి వారే అన్న చందంగా సాగడంతో ఈ జిల్లాల్లో అనేక గ్రామాలను కాంగ్రెస్ కోల్పోయింది. ఇద్దరు మంత్రులు ఉన్నా పట్టుదలగా పనిచేసినట్లుగా కనిపించలేదు. ఇదే విషయమై పిసిసి భేటీలో చర్చించారు. రెబల్‌గా ఉంటున్న రాజగోపాల్ రెడ్డి కూడా సరిగా పనిచేయలేకపోయారు. ఆయన మంత్రిపదవిపై ఆశపెట్టుకుని రాకపోయేసరికి సైలెంట్ అయ్యారు. సీఎం రేవంత్‌రెడ్డికి మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి కొరకరాని కొయ్యగా మారారని పార్టీలో ప్రచారం ఉంది. మంత్రివర్గంలోకి తీసుకోవాలని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ఆదేశించినా తీసుకోలేదని ఆయన సన్నిహితులు వాపోతున్నారు. ఆయనకు మనం మంత్రి పదవి హామీ ఇచ్చారు. అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికలప్పుడు పార్టీ గెలుపునకు సహకరించారు' అని రాహుల్ గుర్తుచేసినట్టు సమాచారం. సామాజిక సమీకరణాలను సమీక్షించి, వీలైనంత త్వరలో రాజగోపాల్‌రెడ్డిని మంత్రివర్గంలోకి తీసుకోవాలని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌కు రాహుల్ సూచించినట్టు తెలిసింది. రెండో పర్యాయం జరిగిన మంత్రివర్గ విస్తరణలో తనకు బెర్తు ఖాయమని కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి భావించారు. ఆ మేరకు కాంగ్రెస్ అధిష్టానం నుంచి సంకేతాలు అందటంతో ఆయన సన్నిహితులు ప్లెక్సీలు, దండలు, బ్యాండ్‌బాజాలు సిద్ధం చేసుకున్నారు. కానీ అదే సమయంలో ఆ పార్టీ సీనియర్ నేత జానారెడ్డి అడ్డు తగులుతూ.. రంగారెడ్డి జిల్లా ఎమ్మెల్యేలకు మంత్రి పదవి ఇవ్వాలంటూ కాంగ్రెస్ అధిష్ఠానానికి లేఖ రాశారు. తనకు మంత్రి పదవి రాకుండా అడ్డుకునే కుట్రలో భాగంగానే సీఎం రేవంత్‌రెడ్డి ఈ లేఖ రాయించారని రాజగోపాల్‌రెడ్డి అనేక సందర్భాల్లో తన సన్నిహితుల వద్ద ఆవేదన వ్యక్తంచేసినట్టు తెలిసింది. ఇక అప్పటినుంచి ఆయన నేరుగా సీఎం రేవంత్‌రెడ్డికి, ప్రభుత్వానికి



వ్యతిరేకంగా పదునైన విమర్శలు చేయడం ప్రారంభించారు. ఈ క్రమంలో మొన్నటి సర్పంచ్ ఎన్నికల్లో పెద్దగా పనిచేయలేదన్న ప్రచారం కూడా ఉంది. సీఎం రేవంత్‌రెడ్డిపై రాజగోపాల్‌రెడ్డి నిరంతరం విమర్శనాస్త్రాలు సంధిస్తున్న నేపథ్యంలో సీఎం సన్నిహితవర్గం రంగంలోకి దిగింది. రాజగోపాల్‌పై భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి కాంగ్రెస్ అధిష్ఠానానికి ఫిర్యాదు చేసినట్టు విశ్వసనీయంగా తెలిసింది. రాజగోపాల్‌రెడ్డి సీఎంకు వ్యతిరేకంగా మాట్లాడిన ఆడియోలు, వీడియో క్లిప్పింగులు, పత్రికా వార్తలను సేకరించి ఏఐసీసీకి పంపినట్టు సమాచారం. తమకు అనుకూలంగా ఉన్న ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ద్వారా రాజగోపాల్‌రెడ్డి మీద క్రమశిక్షణ చర్యలకు ఒత్తిడి చేయించినట్టు తెలిసింది. మంత్రిపదవి విషయంలో ఇప్పటికే వారి కుటుంబం నుంచి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మంత్రివర్గంలో ఉన్నారని, ఉమ్మడి నల్లగొండలో ఇద్దరు రెడ్డి సామాజికవర్గానికి చెందిన నేతలే క్యాబినెట్‌లో ఉన్నారని కేసీ వివరించినట్టు సమాచారం. సామాజికవర్గాలను సమీక్షించి రాజగోపాల్‌రెడ్డిని సర్దుబాటు చేయాలని, తెలంగాణ నాయకత్వంతో చర్చించి నిర్ణయం తీసుకోవాలని రాహుల్‌గాంధీ సూచించినట్టు తెలిసింది. దీంతో ఈ విషయంలో ఇంకా ఎటూ తేల్చలేకపోతున్నారని సమాచారం

---

# సోషల్ మీడియా వెట్టింగ్ పాలసీతో సంకటం

## గందరగోళంలో అమెరికాలో పనిచేస్తున్న ఉద్యోగులు

## అమెరికాను వీడి వెళ్లొద్దని గూగుల్ అడ్వయిజరీ




**న్యూయార్క్,డిసెంబర్20:** అమెరికా తీసుకొచ్చిన కొత్త సోషల్ మీడియా వెట్టింగ్ పాలసీ ఇప్పుడ కలకలం సృష్టిస్తోంది. ఈ కారణంగా చాలామంది దరఖాస్తుదారుల వీసా అపాయింట్‌మెంట్లు 2026 అక్టోబరు నెలాఖరుకు వాయిదా పడినట్లు వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ప్రముఖ టెక్ కంపెనీ గూగుల్ కొందరు ఉద్యోగులను హెచ్చరించింది. అమెరికాను వీడి బయటకువెళ్లొద్దని అడ్వైజరీ జారీ చేసినట్లు ఈ మేరకు ఆంగ్ల మీడియా కథనం పేర్కొంది. అమెరికాకు తిరిగి రావడానికి వీసా స్టాంపింగ్ అవసరమయ్యే ఉద్యోగులు నెలలపాటు ఎదురుచూడాల్సి వస్తుందని గూగుల్ న్యాయనిపుణులు హెచ్చరించారు. ఈ నేపథ్యంలో యూఎస్ వీసాలపై ఉన్న సిబ్బంది అంతర్జాతీయ ప్రయాణాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఈమేరకు యాజమాన్యం సిబ్బందికి మెయిల్ పంపింది. డిసెంబరు 15వ తేదీ నుంచి హెచ్1బీ, హెచ్4 వీసా దరఖాస్తుదారులకు సోషల్ వెట్టింగ్‌ను అమెరికా ప్రారంభించిన సంగతి తెలిసిందే. దాంతో వీసా అపాయింట్‌మెంట్లలో జాప్యం ఎదురవుతోంది. ఎఫ్,జే,ఎం వంటి వీసాల పైనా ఈ ప్రభావం ఉంటుందని గూగుల్ నిపుణులు పేర్కొన్నారు. ఇప్పటికే అమెరికా వెలుపల ఉన్నవారి విషయంలో మాత్రం ఎలాంటి సూచనలు చేయలేదు. కాగా.. కొత్త వెట్టింగ్ విధానం వల్ల వీసా ఇంటర్వ్యూలను వచ్చే ఏడాది ఫిబ్రవరి-మార్చికి రీషెడ్యూల్ చేసినట్లు ఇటీవల అమెరికా ఎంబసీ అధికారులు వెల్లడించిన సంగతి తెలిసిందే. అయితే ఈ ప్రక్రియ మరింత ఆలస్యమవుతున్నట్లు తెలుస్తోంది. వీరి ఇంటర్వ్యూ తేదీలను ఇప్పుడు అక్టోబరు నెలకు వాయిదా వేసినట్లు మీడియా కథనాలు పేర్కొన్నాయి. వీసా దరఖాస్తుదారుల సోషల్ మీడియా ఖాతాలను క్షుణ్ణంగా స్క్రీనింగ్ చేసేందుకు అదనపు సమయం పడుతోందని, అందువల్లే ఇంటర్వ్యూలను వాయిదా వేస్తున్నట్లు అమెరికా అధికారులు చెబుతున్నారు. దీంతో దరఖాస్తుదారుల పరిస్థితి గందరగోళంలో పడింది. ఇప్పటికే అమెరికాలో ఉద్యోగాలు సాధించి.. ప్రయాణాల కోసం టికెట్లు బుక్ చేసుకున్నవారు ఇబ్బందులు పడుతున్నారు. ఈ క్రమంలో గూగుల్ అడ్వయిజరీ దీనిని సమర్థించేలా ఉంది. దీంతో వచ్చే ఏడాది వరకు ఉద్యోగులకు కష్టాలు తప్పేలా లేవు.

---




# అమెరికా సిబ్బందిపై దాడికి ప్రతీకారం

## ఇస్లామిక్ టెర్రరిస్టులపై అమెరికా దాడి

**న్యూయార్క్,డిసెంబర్20:** సిరియాలోని ఇస్లామిక్ స్టేట్ స్థావరాలను అమెరికా టార్గెట్ చేసింది. ఆ స్థావరాలపై అమెరికా సైన్యం వైమానిక దాడలు చేసింది. ఇటీవల అమెరికా సిబ్బందిపై సిరియా దాడి చేసిన నేపథ్యంలో ప్రతీకార దాడులకు పాల్పడినట్లు ఓ అధికారి తెలిపారు. అనుమానిత ఇస్లామిక్ స్టేట్ ఉగ్రవాదులు సిరియాలో ఉన్న అమెరికా సైనిక సిబ్బందిపై దాడి చేశారని, దానికి ప్రతీకారం తీర్చుకుంటామని అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఇటీవల వెల్లడించారు. ఐఎస్ఐఎస్ ఫైటర్లు, ఇన్‌ఫ్రాస్టక్చర్, ఆయుధ కేంద్రాలను టార్గెట్ చేసినట్లు అమెరికా డిఫెన్స్ మంత్రి పీట్ హెగ్‌సేత్ తెలిపారు. ఆపరేషన్ హాక్‌ఐలో భాగంగా ఆ దాడి జరిగినట్లు ఆయన చెప్పారు. ఇదేమీ యుద్ధం కాదు అని, ఇది కేవలం ప్రతీకారం మాత్రమే అని ఆయన అన్నారు. మా శత్రువులను వేటాడామని, వాళ్లను చంపేశామని అన్నారు. ఈ దాడుల ప్రక్రియ కొనసాగుతుంద న్నారు. సెంట్రల్ సిరియాలో ఉన్న ఇస్లామిక్ స్టేట్‌కు చెందిన అనేక టార్గెట్లను ధ్వంసం చేసినట్లు ఇద్దరు అమెరికా అధికారులు పేర్కొన్నారు. సెంట్రల్ సిరియాలోని పల్మైరాలోఉన్న దళాలపై జరిపిన దాడుల్లో ఇద్దరు అమెరికా సైనికులు, ఓ ఇంటర్‌ప్రిటర్ మరణించారు. అమెరికా దళాలకు చెందిన సుమారు వెయ్యి మంది సైనికులు ఇంకా సిరియాలోనే ఉన్నారు.

---

# తిరుమలలో అధ్యయనోత్సవాలు



**తిరుమల,డిసెంబర్20:**

తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామివారి ఆలయంలో 25 రోజుల పాటు అధ్యయనోత్సవాలు జరుగనున్నాయి. ఈ మేరకు శుక్రవారం సాయంత్రం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా రాత్రి 7.30 నుండి 8.30 గంటల వరకు రంగనాయకుల మండపంలో అధ్యయనోత్సవ కార్యక్రమాలు నిర్వహించారు. ధనుర్మాసంలో వైకుంఠ ఏకాదశికి 11 రోజులు ముందు నుండి శ్రీవారి సన్నిధిలో అధ్యయనోత్సవం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ సందర్భంగా స్వామివారి ప్రాశస్త్యంపై 12 మంది ఆళ్వార్లు రచించిన దివ్యప్రబంధ పాశురాలను శ్రీవైష్ణవ జియ్యంగార్లు గోష్ఠిగానం చేస్తారు. ఈ కార్యక్రమంలో తిరుమల శ్రీశ్రీశ్రీ పెద్దజీయర్‌స్వామి, తిరుమల శ్రీశ్రీశ్రీ చిన్న జీయర్‌స్వామి, శ్రీవారి ఆలయ డిప్యూటీ ఈవో శ్రీ లోకనాథం, ఇతర అధికారులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

హైదరాబాద్ పీపుల్స్ న్యూస్ దినపత్రిక

ఆదివారం, డిసెంబర్ 21, 2025

జనరల్ న్యూస్

## హైదరాబాద్ బి ఎన్ ఆర్ విజ్ఞాన జ్యోతి ఇంజనీరింగ్ కళాశాలలో వీడియో సాంగ్ విడుదల




**హైదరాబాద్ డిసెంబర్ 20 :**హైదరాబాద్ బి. ఎన్ .ఆర్ . విజ్ఞాన జ్యోతి ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం సాయంత్రం జరిగిన అల్యూమిని సమావేశంలో ప్రణమ్యా ఎంటర్టైనర్ వారు నిర్మించిన ఫ్లైట్ ఎక్కి పోదామా అనే ఫోక్ వీడియో సాంగ్ ను విడుదల చేశారు. కళాశాల ప్రొఫెసర్స్ సాగర్, కిషోర్ సమక్షంలో టీవీ తారలు మానస్, సుప్రియ ల బృందం ఈ పాటపై నటించారు. కోరియోగ్రఫీ చేసిన గోవింద్ మాస్టర్, హీరోయిన్ సుప్రియ సత్యనారాయణ ఆడిటోరియంలో కొద్ది సేపు పాటలపై స్టెప్పులు వేసి ఇంజనీరింగ్ విద్యార్థులను ఆహ్లాదపరిచారు. షూటింగ్ లో ఉండటం వల్ల హీరో మానస్ హాజరుకాలేక పోయాడు. స్క్రీన్ పై వర్చ్యువల్ గా మాట్లాడారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని కనగర్తి, తంగెల్లపల్లి లలో షూటింగ్ 40 మంది బృందంతో ఈ వీడియో సాంగ్ ను నవంబర్ లో చిత్రీకరణ పూర్తి చేశారు. హైదరాబాద్ లో పోస్ట్ ప్రొడక్షన్ పూర్తి చేసుకొన్న ఈ జానపద గీతాన్ని ప్రముఖ గాయకులు ప్రభ, ఫణికృష్ణ పాడగా, రికార్డింగ్ చేశారు. ఈ పాటను యువ కళాకారుడు, వీడియో సాంగ్ దర్శకుడు సంకేపల్లి ఫణికృష్ణ ఈ పాటను తానే రాసి డైరెక్ట్ చేశారు. మానస్ మా టీవీ బ్రహ్మముడి సీరియల్ హీరోగా, ఈ టీవీ జబర్దస్త్ లలో నటిస్తున్నారు. ఈ జానపద గీతానికి సంగీతాన్ని శ్రీకాంత్, ఫోటోగ్రఫీ వేల్పుల శివ అందించారు. ఈ పాట ప్రోమోకు అధిక సంఖ్యలో వ్యూస్ వచ్చాయి. కళాశాల విద్యార్థులు హర్షమోదాల మధ్య రెండు స్క్రీన్ పై ఈ జానపద గీతాన్ని ప్రదర్శించారు. హీరోయిన్ సుప్రియ మాట్లాడుతూ తెలంగాణ భాష, యాస, సంస్కృతి పై తనకెంతో మక్కువని, చక్కటి అవకాశాలు వస్తె తన నటనను ప్రదర్శించుకుంటానని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ రచయిత సంకేపల్లి నాగేంద్ర శర్మ, శారద, ప్రముఖ గాయకుడు నమిలకొండ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## పలువురిని పరామర్శించిన జగ్గయ్యపేట నియోజకవర్గ వైఎస్ఆర్ సీపీ ఇన్-ఛార్జ్ తన్నీరు నాగేశ్వరరావు




**ఎన్టీఆర్ జిల్లా :** జగ్గయ్యపేట మండలం, గండ్రాయి గ్రామానికి చెందిన పసుపులేటి వెంకటేశ్వర్లు అనారోగ్యంతో బాధపడుతున్న విషయాన్ని తెలుసుకొని వారి నివాసానికి వెళ్లి వారి ఆరోగ్యం యోగక్షేమాలు అడిగి తెలుసుకుని వారిని పరామర్శించారు.అదేవిధంగా గ్రామానికి చెందిన తోకబత్తిన వీరబాబు గత కొన్ని రోజుల క్రితం అనారోగ్యంతో మరణించినారు విషయం తెలుసుకొని ఈరోజు వారి నివాసానికి వెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.మల్కాపురం గ్రామానికి చెందిన గుద్దిట లాలు మాతృమూర్తి గుద్దిట ఎల్లమ్మ దశ-దిన కార్యక్రమంలో పాల్గొని వారి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు.వారితోపాటు సీనియర్ నాయకులు కనపర్తి నరసింహారావు, గ్రామ పార్టీ అధ్యక్షులు దమ్మాలపాటి సత్యనారాయణ, బలంతు కోటయ్య, కొత్తపల్లి సురేష్, మాజీ మార్కెట్ యార్డ్ డైరెక్టర్ మన్నే అప్పారావు, పిల్లి తిరుమలయ్య, దేవరగట్ల కోటేశ్వరరావు, దేవరగట్ల గోపి, దారెల్లి పిచ్చయ్య అంబోజి కొండల రావు, నూక పోగు నాగరాజు, పందుల చిట్టిబాబు, లక్ష్మీ శెట్టి నరసింహారావు, వెంకటేశ్వర్లు, మార్కపుడి జూబీలెస్, చీర్ర గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## డిసెంబర్ 21 పోలియో డేను విజయవంతం చేద్దాం : ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య)

### పోలియో డే ప్రచార పోస్టర్లను ఆవిష్కరించిన ఎమ్మెల్యే తాతయ్య



**ఎన్టీఆర్ జిల్లా :** జగయ్యపేట పట్టణంలో ఈ నెల 21వ తేదీన నిర్వహించనున్న పోలియో డేను ప్రతి ఒక్కరూ భాగస్వాములై విజయవంతం చేయాలని జగ్గయ్యపేట శాసనసభ్యులు శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) ప్రజలకు పిలుపునిచ్చారు. అవగాహన లోపంతో చేసే చిన్న నిర్లక్ష్యం కూడా పసిపిల్లల జీవితాన్ని ప్రమాదంలోకి నెట్టే అవకాశం ఉందని ఎమ్మెల్యే హెచ్చరించారు. ఐదేళ్ల లోపు ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు వేయడం ద్వారా మాత్రమే పోలియోను పూర్తిగా నివారించవచ్చని తెలిపారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే తమ కార్యాలయంలో పోలియో డే ప్రచార పోస్టర్లను ఆవిష్కరించారు. పోలియో డే నిర్వహణకు చేపడుతున్న ఏర్పాట్లను వైద్య అధికారులు ఎమ్మెల్యే కి వివరించారు.అనంతరం మీడియాతో మాట్లాడుతూ, జగ్గయ్యపేట నియోజకవర్గ ప్రజలందరూ డిసెంబర్ 21న తమ సమీప ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన పోలియో బూత్‌లకు వెళ్లి ఐదేళ్ల లోపు ఉన్న ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో షేక్ కాసిం, వేదులాపురి సైదా, ముత్తవరపు వెంకటేష్, వంగూరి కోటేశ్వరరావు, షేక్ భాష, కారుపాటి ఏసుబాబు, కారుపాటి వెంకయ్య (చిలక), షేక్ సుభాని, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు

## ఆదోని జిల్లా చేయాలనీ కౌన్సిలర్ పదవికి రాజీనామా చేసిన రఘునాథ రెడ్డి




**ఆదోని డివిజన్ డిసెంబర్ 20**ఆదోని జిల్లా ఏర్పాటు చేయాలనే డిమాండ్ తో తన కౌన్సిలర్ పదవికి ఆదోని మునిసిపాలిటీ ఐదవ వార్డు కౌన్సిలర్ రఘునాథ రెడ్డి రాజీనామా చేయటాన్ని హర్షిస్తున్నాము. ఆదోని ప్రాంత భవిష్యత్తు కోసం పదవికి త్యాగం చేసిన రఘునాథ రెడ్డి నిజమైన ఆదోని ముద్దు బిడ్డ. పదవీకాలం ఎన్ని రోజులున్నా ,కౌన్సిలర్ రఘునాథ రెడ్డి ఆదోని జిల్లా కోసం పదవీ త్యాగం చేయటం గొప్ప విషయం. ఆదోని ప్రాంత అభివృద్ధి ఆదోని జిల్లా ఏర్పాటుతోనే సాధ్యం. ఆదోని జిల్లా సెంటిమెంటు రోజురోజుకూ బలపడుతున్నది. కావున ఆదోని ప్రాంతం లో గల ప్రతి ఒక్క ప్రజాప్రతినిధి తమ పదవులకు రాజీనామా చేసి ఆదోని జిల్లా కోసం జరిగే పోరులో భాగస్వాములు కావాలని పిలుపునిస్తున్నాము. ప్రభుత్వం కూడా తప్పుడు రిపోర్టులు నమ్మకుండా ఆదోని ప్రజల మనోభావాలను, అవసరాలను గుర్తించి ఆదోని జిల్లా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నాము. ఎ. నూర్ అహ్మద్,- ఆదోని జిల్లా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు, - జేఏసి నాయకులు.

# భారతీయ మహిళా సంస్కృతికి నిలువుటద్దం చీర కట్టు

**(21 డిసెంబర్ "అంతర్జాతీయ చీరల దినోత్సవం" సందర్భంగా)**

అనాదిగా భారత ఉపఖండ సాంస్కృతిక వారసత్వానికి, నేతన్నల హస్తకళా నైపుణ్య వికాసానికి పెట్టింది పేరు మహిళలు ధరించే సప్తవర్ణాల చీర. ఎలాంటి కుట్లు లేకుండా పొడవైన పలు అద్భుత డిజైన్లతో చీరను మహిళలు నడుం చుట్టు ధరించి, కొంగును భుజాన వేసుకొని చక్కటి సింగులతో కాళ్ల వరకు వేలాడే విధంగా బొడ్లో చెక్కుకుని, శరీరానికి హత్తుకునే విధంగా జాకెట్ ధరించి మహిళల అందాలను ద్విగుణీకృతం చేసే చీర మన భారతీయతకు మరుపురాని చిహ్నం. చీర కట్టు, నుదుటిన బొట్టు, కళ్లకు కాటుకతో భారతీయత ఉట్టిపడే సనాతన సాంప్రదాయం మన స్త్రీ సమాజానికే వన్నె తెచ్చి పెడుతున్నది.

చీర కట్టు పరిణామ క్రమం:

ఇండస్ వ్యాలీ సంస్కృతిగా క్రీస్తుకు పూర్వం 2,800 - 1,800 కాలంలో ప్రారంభంపైన చీర కట్టు నేటికీ అంతే ఆదరణను కలిగి ఉంటున్నది. నవ్య చీరల రూపం క్రీ పూ 300ల్లో రావటం, క్రీ శ 1200ల్లో చీరలు నేత సంబంధిత పరిశ్రమలు ఏర్పడడం, బ్రిటీష్ పాలన సమయంలో 1600-1940ల్లో చీరలకు ఆధునిక రూపం ఇవ్వడం, 1950ల్లో సినిమాల ద్వారా చీర కట్టు ప్రచారం కావడం, 2015 నుంచి "అంతర్జాతీయ చీరల దినోత్సవం (ఇంటర్నేషనల్ సారీ డే)" నిర్వహించుకోవడం జరుగుతోంది. మహిళలు చీరలను దాదాపు 80 రకాలుగా ధరించడం గమనిస్తున్నాం. ఇండియాతో పాటు పాకిస్థాన్, బంగ్లాదేశ్, శ్రీలంక, నేపాల్ లాంటి దేశాల్లో చీరలను ధరించడం మన మహిళలకు అలవాటుగా మారింది.

తెలుగింటి స్త్రీల చిరునామా అందమైన చీరకట్టు:

చీర కట్టులో మహిళలు అందంగా కనిపించడం, చీరలు స్త్రీ సమాజ చిహ్నాలుగా మారడం గమనిస్తున్న ప్రపంచ మానవాళి ప్రతి ఏట 21 డిసెంబర్‌న "అంతర్జాతీయ చీరల దినోత్సవం (ఇంటర్నేషనల్ సారీ డే)" పాటించడం ఆనవాయితీగా మారింది. ఆధునిక డిజిటల్ యుగంలో చక్కటి అంచుల రంగులు/డిజైన్‌లో తో ఆర్గాంజా చీరలు, బోల్డ్ నియాన్ చీరలు, బెనారస్ చీరలు, బార్డర్‌లెస్ చీరలు, టిష్యూ చీరలు, పస్టెల్ సెక్విన్ చీరలు, 3డి బొమ్మలు కలిగిన చీరలు, టస్సెర్ చీరలు, ఇక్కత్ చీరలు, చందేరీ చీరలు, పైథాన్ చీరలు, పటోలా చీరలు, భుజ్ బంధనీ చీరలు, మెటాలిక్ చీరలు, జిమ్మీ ఛూ చీరలు, వెల్వెట్ చీరలు లాంటి డిజైనర్ సారీస్‌ను మహిళలు మక్కువతో ధరించడం చూస్తున్నాం. ఏపీలోని వెంకటగిరి పట్టణం చేనేత వస్త్ర నైపుణ్యాలకు వెంకటగిరి సిల్క్ చీరలు ప్రసిద్ధి చెందినవి. అదే విధంగా తెలుగు రాష్ట్రాల మహిళల మన్ననలు పొందిన చీరల్లో ఉప్పాడ పట్టు, పోచంపల్లి, గద్వాల్, కంచి కలంకారి, ఇక్కత్, ధర్మవం, హాండ్ ప్రింట్, మైసూర్ సిల్క్, చెట్టినాడ్, కసవు, మంగళగిరి, కంచీవరం లాంటి అనేక రకాలు ఉన్నాయి.

ఐరాస సుస్థిరాభివృద్ధి లక్ష్యాల్లో భాగంగా "ఆర్థికాభివృద్ధి, జీవనోపాధి, సాంస్కృతిక పరిరక్షణ"లో భాగంగా మన వస్త్రాలంకరణల సంరక్షణకు పెద్ద పీట వేయడం జరిగింది. అందమైన, ఆకర్షణీయమైన డిజైన్లతో చీరల ఉత్పత్తులు కొత్త పుంతలు తొక్కడానికి కారణమైన నేతన్నల హస్తకళా నైపుణ్యాలను ప్రశంసిస్తూ, చీర కట్టు ఆచారాన్ని కొనసాగిస్తూ, మహిళలు/బాలికలు మనదైన చీర కట్టుకు పట్టం కట్టి తమ సౌందర్యాలను పలు రెట్లు పెంచుకోవాలని కోరుకుందాం, గౌరవానికి ప్రతీకలుగా చీర కట్టును ప్రోత్సహిద్దాం.

డా: బుర్ర మధుసూదన్ రెడ్డి

# విశ్వ మానవాళికి శ్రేయస్సు ప్రదాత 'ధ్యానం'

**(21 డిసెంబర్ "ప్రపంచ ధ్యాన దినోత్సవం" సందర్భంగా)**

ప్రపంచ శాంతి, అంతర్గత ప్రశాంతత, మానసిక స్థిరత్వాల కోసం ధ్యాన ప్రక్రియ ప్రధానంగా దోహదపడుతుందని గుర్తించిన ఐరాస సర్వసభ్య సమావేశం చేసిన తీర్మానం ప్రకారం, 2024 నుంచి ప్రతి ఏట 21 డిసెంబర్ రోజు ప్రపంచ దేశాలు "ప్రపంచ ధ్యాన దినోత్సవం (వరల్డ్ మెడిటేషన్ డే)" పాటించడం ఆనవాయితీగా మారింది. 21 డిసెంబర్ రోజు ఉత్తర అర్ధగోళంలో శీతాకాలపు అయనాంతంతో (వింటర్ సోల్స్టిస్) కలిసి వస్తుందనే దృగ్విషయాన్ని దృష్టిలో పెట్టుకొని ఈ దినోత్సవం నిర్ణయించబడింది. ప్రపంచ ధ్యాన దినోత్సవం నిర్వహించడంతో విశ్వ శాంతి వర్థిల్లడం, స్వీయ-అవగాహన పెరగడం, సామూహిక చైతన్యం వికసించడం, అంతర్గత ప్రశాంతత వృద్ధి చెందడం, మానసిక నిశ్చలత చేకూరడం, శారీరక దృఢత్వం పెరగడం, భావోద్వేగ నియంత్రణ కలగడం లాంటి ప్రయోజనాలను ప్రచారం చేయడానికి వేదిక లభించినట్లు అవుతున్నది. ప్రపంచ ధ్యాన దినోత్సవం-2025 ఇతివృత్తంగా "అంతర్గత శాంతి, ప్రపంచ సామరస్యం (ఇన్నర్ పీస్, గ్లోబల్ హార్మొని)" అనబడే అంశాన్ని తీసుకున్నారు.

ప్రపంచవ్యాప్తంగా విస్తరించిన భారతీయ ధ్యాన ప్రక్రియ :

ధ్యానం ఒక పురాతన అభ్యాసం. వేల ఏండ్లుగా ఆచరించబడుతున్న సంపూర్ణ ఆరోగ్య ప్రదాయిని. క్రీస్తుకు పూర్వం 5,000 నాటికే భారతంలో ధ్యాన అభ్యాసం ప్రారంభమైనది. హిందువులు, బౌద్ధుల సంప్రదాయంలో అంతర్భాగంగా ధ్యానం సమ్మిళితం అయ్యింది. ఒక వ్యక్తిలో మానసిక ప్రశాంతత, భావోద్వేగ నియంత్రణ, శారీరక ఆరోగ్యం సాధించడానికి బుద్ధి, కేంద్రీకృత ఏకాగ్రతతో కూడి ఆలోచన పద్ధతులను ఉపయోగించే క్రియను ధ్యానంగా అర్థం చేసుకోవాలి. స్వీయ సాక్షాత్కారం, జ్ఞానోదయం సాధించడానికి ఉద్దేశించబడిన ఆధ్యాత్మిక సాధనగా ధ్యానానికి పేరు ఉంది. ఇస్లామిక్ సూఫీ ఆధ్యాత్మికవేత్తలు, క్రైస్తవ సన్యాసులు, జైన మతస్థులు, టావోయిజం పాటించే వారు, సిక్కులు, జొరాస్ట్రియన్లు కూడా ధ్యాన ప్రార్థనలు చేసే వారని చరిత్ర తెలుపుతున్నది. అష్టాంగ యోగాలలో కీలకమైన ప్రక్రియ ధ్యానం అని పతంజలి యోగ సూత్రాలలో వర్ణించబడింది. భగవద్గీత, ఉపనిషత్తుల గ్రంథాలో కూడా ధ్యానం అతి ప్రధానమైనదని తెలుపబడింది. హిందూ ధ్యాన పద్దతుల్లా మంత్ర, అతీంద్రియ, కుండనడలిని ధ్యాన ప్రక్రియలు ఉన్నాయి. గౌతమ బుద్ధుడు లోతైన ధ్యానం ఆచరించుట ద్వారా జ్ఞానోదయం పొందడం జరిగింది. బౌద్ధ ధ్యాన పద్దతుల్లో విపశ్యన, జెన్, మెట్టా అనబడే ధ్యాన పద్ధతులు వివరించబడినవి.

ధ్యానం వల్ల ప్రయోజనాలు:

ధ్యానం అభ్యాసం చేయడం ద్వారా మానసిక ఒత్తిడి, ఆందోళన, నిరాశలు తగ్గడంతో పాటు ఏకాగ్రత పెరిగి సంపూర్ణ మానసిక ఆరోగ్యం సిద్ధిస్తుంది. ధ్యానం చేయడం వల్ల రక్తపోటు నియంత్రణ, రోగనిరోధకశక్తి పెరగడం, దీర్ఘకాలిక నొప్పులు తగ్గడంతో శారీరక ఆరోగ్యం ఒనగూడుతుంది. ధ్యానం పాటించే వారిలో భావోద్వేగ స్థిరత్వం, స్వీయ-అవగాహనలు పెరుగుతాయి. అంతర్గత శాంతి, జ్ఞానోదయాలను ధ్యాన ప్రక్రియ పెంచుతుంది. ధ్యానం అభ్యాసం చేయడం వల్ల దృష్టి, జ్ఞాపకశక్తి, నిర్ణయం తీసుకునే సామర్థ్యాలు పెంపొందించబడతాయి. మానసిక శారీరక శ్రేయస్సుకు ధ్యానం ఉపకరిస్తుందని ప్రపంచ ఆరోగ్య సంస్థ గుర్తించడం హర్షదాయకం. ప్రపంచ ధ్యాన జదినోత్సవం సందర్భంగా ప్రపంచవ్యాప్తంగా లక్షలాది ధ్యాన సాధకులు 21 డిసెంబర్ రోజు హైదరాబాదు శివారు హార్ట్‌ఫుల్‌నెస్ ప్రధాన కార్యాలయం కన్హా శాంతివనంలో ప్రత్యక్షంగా 40,000 మంది, పరోక్షంగా లక్షలాది మంది ధ్యాన అభ్యాసం చేయడానికి ఏర్పాట్లు పెద్ద ఎత్తున జరిగాయి.

ధ్యానం, యోగాలు ఒకదానితో మరొకటి లోతుగా అనుసంధానం చేయబడి ఉన్నాయి. ధ్యానం మానసిక, ఆధ్యాత్మిక శ్రేయస్సుపై దృష్టి పెడుతుంది. ధ్యానంతో శరీరం, ఆత్మ, మనస్సుల మధ్య సమతుల్యత పెంపొందించబడుతుంది. మన వ్యక్తిగత సంపూర్ణ ఆరోగ్యం కోసం నిత్యం ధ్యానం చేయడానికి సమయం కేటాయించడం, ధ్యాన ప్రధాన కార్యశాలలను నిర్వహించడం, కమ్యూనిటీ ధ్యాన శిబిరాలను నిర్వహించడం, ధ్యాన ప్రక్రియను ప్రచారం చేయడం, సోషల్ మీడియా వేదికగా ధ్యాన ప్రాధాన్యాలను వివరించడం లాంటివి చేయడానికి ప్రయత్నించాలి.

ఆచార్య బుర్ర మధుసూదన్ రెడ్డి

# బిజెపి సర్పంచులను గ్రామ అభివృద్ధిలో ఆదర్శంగా నిలుపుతాం





**మొలంగూర్ :** ప్రజా ప్రతినిధుల సన్మాన సభలో జిల్లా అధ్యక్షుడు గంగాడి అధికార పార్టీకి దీటుగా బిజెపి సర్పంచులను గ్రామ అభివృద్ధిలో కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ సహకారంతో ఆదర్శంగా నిలుపుతామని బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి అన్నారు. శనివారం మండలంలోని మొలంగూర్ లోని విఎస్ఆర్ గార్డెన్ లో బిజెపి మండల శాఖ అధ్యక్షుడు ఎనుగుల అనిల్ అధ్యక్షతన బిజెపి ఆధ్వర్యంలో గెలిచిన ప్రజాప్రతినిధులకు నిర్వహించిన సన్మాన కార్యక్రమానికి ముఖ్య అతిథులు హాజరైన గంగాడి కృష్ణారెడ్డి మాట్లాడుతూ కరీంనగర్ పార్లమెంటు పరిధిలో చరిత్ర తిరగరాసిందని, గతంలో కంటె మెరుగైన స్థానాలను గెలుచుకున్నామని తెలిపారు. అధికార వారికి దీటుగా మండలంలో బిజెపి మంచి స్థానాలు గెలుచుకుందని భవిష్యత్తులో శంకరపట్నంలో బిజెపి పాగా వేయడం ఖాయమని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేక పవనాలు వీస్తున్నాయని అందుకే పార్టీ సింబల్ తో ముందుకు పోయే ధైర్యం చేయడం లేదని దమ్ముంటే వెంటనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గ్రామాల అభివృద్ధి బిజెపితోనే సాధ్యమన్నారు. ముఖ్యంగా ప్రధాని నరేంద్ర మోడీ 11 ఏళ్లలో తెలంగాణ అభివృద్ధి కోసం లక్షల కోట్ల నిధులు మంజూరు చేశారని , ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్రంలో జరుగుతున్నాయని తెలిపారు. నేడు గ్రామాల్లో జరుగుతున్న అనేక అభివృద్ధి పనులు మోడీ ప్రభుత్వం అందిస్తున్న నిధులతోనే కొనసాగుతున్నాయి అన్నారు. అనంతరం కరీంనగర్ పార్లమెంటరీ కన్వీనర్ బోయినపల్లి ప్రవీణ్ రావు మాట్లాడుతూ బిజెపి ఆధ్వర్యంలో గెలిచిన ప్రజాప్రతినిధులను గౌరవంగా చూసుకుంటామని, వారికి ఏ ఇబ్బంది కలిగిన పార్టీ అండగా ఉంటుందని కాంగ్రెస్ బెదిరింపులకు భయపడే ప్రసక్తే లేదని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ నిధులతోనే గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయని, కరీంనగర్ పార్లమెంటు పరిధిలో కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ అనేక అభివృద్ధి కార్యక్రమాలకు చేపట్టాడని పేర్కొన్నారు. అనంతరం గెలిచిన సర్పంచ్ కొయ్యడ కుమార్ యాదవ్, కొయ్యడ రజిత అశోక్, ఎన్నం మల్లేష్, మోరె స్వరుప రవి, దేవునూరి అంజలి సమ్మయ్య లను వివిధ గ్రామల ఉప సర్పంచులు జంగ జైపాల్, పొన్నం మహేష్, చింతల శ్రీధర్ రెడ్డి, గుర్రం రేణుక శ్రీనివాసులు వార్డ్ మెంబర్లను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి మాడ వెంకటరెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి అలివేలు సమ్మిరెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు దండు కొమురయ్య, మండల ఇంచార్జీ గుజ్జ శ్రీనివాస్, నాయకులు దొంగల రాములు, లోకేష్ , దాసరపు నరేందర్, రాసమల్ల శ్రీనివాస్, చెర్ల శ్రీనివాస్ లతోపాటు వివిధ గ్రామాల బూత్ అధ్యక్షులు, శక్తి కేంద్రం ఇంచార్జీలు, వివిధ మోర్చాల నాయకులు, బిజెపి కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# సెమీ క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య)




**ఎన్టీఆర్ జిల్లా :** జగ్గయ్యపేట పట్టణంలో ఆర్.సి.ఎం.చర్చి వారు నిర్వహించిన సెమీ క్రిస్మస్ వేడుకల్లో ముఖ్య అతిథులుగా శాసన సభ్యులు శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర ,సిఐ.పి.వెంకటేశ్వరరావు , ఎస్ఐ.రాజు పాల్గొని దైవ సేవకులతో కలిసి క్యాండిల్ సర్వీస్ చేసి, కేక్ కట్ చేసి విశ్వాసులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) మాట్లాడుతూ ఏసుక్రీస్తు బోధనలు సర్వ మానవాళికి ఆదర్శప్రాయమని, వాటిని ప్రతి ఒక్కరూ ఆచరించాలని సూచించారు. పరస్పర సహకారం, సహనం, సోదరభావంతో జీవించడమే క్రిస్మస్ పండుగ సందేశమని తెలిపారు. ఈ పండుగను క్రైస్తవులు కుటుంబ సభ్యులతో కలిసి ఆనందంగా, ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ఆకాంక్షించారు. సమాజంలో అన్ని వర్గాల ప్రజలు ఐక్యతతో కలిసి ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.

## ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు



**తిరుపతి డిసెంబర్ 20** విజయనగరం జిల్లా , వేపాడ మండలం, నల్లబెల్లి సీయోను ప్రార్థన మందిరం నందు నిస్సి మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో పాస్టర్ గొర్లె టైటాస్ అధ్యక్షతన క్రిస్మస్ సంబరాలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య ప్రసంగీకలుగా డాక్టర్ ఎలమంచిలి ప్రవీణ్ విచ్చేసి క్రిస్మస్ సందేశాన్ని అందించారు. ఏ మనిషికైనా ఈ లోకజ్ఞానం వ్యర్థమని దేవుని జ్ఞానమే నిజమైన జ్ఞానమని అటువంటి వారికే దైవ గ్రంథం లోని మర్మాలు అర్థమవుతాయని ,ఆ విధంగా నడుచుకున్న వారికే అత్యున్నత స్థానాన్ని దేవుడు అనుగ్రహించి ఆయన చేతులతో, ఆయన పనికి వాడబడుతారని అన్నారు. ఏసుప్రభు వారు ప్రతి ఒక్కరికి ఆయన ప్రేమని పంచాడని అదేవిధంగా క్రైస్తవులందరూ ప్రతి ఒక్కరికి అటువంటి ప్రేమని పంచాలని అన్నారు. ముఖ్య అతిథి టీవీఎస్ బ్యాంకు వైస్ ప్రెసిడెంట్ మధు ప్రకాష్ మాట్లాడుతూ ప్రతి తల్లిదండ్రి వారి పిల్లల్ని ప్రేమగా పెంచాలని ప్రేమగానే వారికి విద్యాబుద్ధులు క్రమశిక్షణ నేర్పించాలని అన్నారు. ఆనంతరం కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపి దైవ సేవకులకు నూతన వస్త్రాలు అందించారుఈ కార్యక్రమంలో పాస్టర్ జాన్ లాజరస్, పాస్టర్ దావీదు, పాస్టర్ డేనియల్ పాల్, పాస్టర్ దేవకుమార్ ,కరుణాకర్ రచన దంపతులు, గ్రేస్ టైటస్, పాస్ట, సంఘ పెద్దలు, యూత్ లీడర్లు తదితరులు పాల్గొన్నారు.

# ఈ నెల 29వ తేదీ నుండి ప్రజావాణి యధాతథం

**జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**



**ఆదిలాబాద్ డిసెంబర్ 20 :**2వ సాధారణ పంచాయతీ ఎన్నికలు– 2025 లో గెలుపొందిన సర్పంచ్, వార్డు సభ్యులు ఈ నెల 22వ తేదీన ప్రమాణ స్వీకారం చేయనున్నందున అధికార యంత్రాంగం ఆయా పనులలో నిమగ్నమై ఉంటారని, ఈ కారణంగా ఈ నెల 22వ తేదీ సోమవారం రోజున జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం వాయిదా వేస్తూ ఈ నెల 29వ తేదీ నుండి యధాతథంగా నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు, దరఖాస్తుదారులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.

# బ్రోకలీ రోజూ తింటే ఏమవుతుందో తెలుసా..? పంబరేపే బెనిఫిట్స్..



బ్రోకలీ పోషకాల పవర్‌హౌస్. యాంటీఆక్సిడెంట్లు, విటమిన్లు, ఖనిజాలు పుష్కలంగా ఉన్న ఈ కూరగాయ క్యాన్సర్‌ను నివారించి, కాలేయాన్ని రక్షిస్తుంది. ఎముకలను బలోపేతం చేసి, రోగనిరోధక శక్తిని పెంచుతుంది. జీర్ణక్రియను మెరుగుపరచి, మలబద్ధకాన్ని తగ్గిస్తుంది. గుండె ఆరోగ్యానికి తోడ్పడి, రక్తపోటును నియంత్రిస్తుంది. బ్రోకలీ సంపూర్ణ ఆరోగ్యానికి కీలకమైన ఆహారం.చూసేందుకు కాలీఫ్లవర్ లాగా కనిపించే బ్రోకలీ పోషకాల పవర్ హౌస్. ఆకుపచ్చ కూరగాయలో ఒకటైన బ్రోకలీ మొత్తం ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. బ్రోకలీలో యాంటీఆక్సిడెంట్లు, ఖనిజాలు, విటమిన్లు పుష్కలంగా ఉంటాయి. ఇవన్నీ ఆరోగ్యంతో పాటు అందానికి కూడా అనేక విధాలుగా ప్రయోజనం చేకూరుస్తాయి. బ్రోకలీలో యాంటీ ఆక్సిడెంట్లు మెండుగా ఉంటాయి. ముఖ్యంగా ఇందులో ఉంటే సల్ఫోరఫేన్ అనే సమ్మేళనం ఫ్రీ రాడికల్స్ వల్ల శరీర కణాలు డ్యామేజ్ కాకుండా కాపాడుతుంది. తద్వారా క్యాన్సర్ వంటి మహమ్మారి రాకుండా అడ్డుకోవచ్చు.బ్రోకలీలో గ్లుకోసినోలేట్స్ అనే సమ్మేళనాలు ఉంటాయి. ఇవి శరీరంలోని విషపదార్థాలను బయటకు పంపడంలో సహాయపడతాయి. తద్వారా కాలేయంపై ఒత్తిడి తగ్గుతుంది. లివర్ ఆరోగ్యంగా ఉంటుంది. బ్రోకలీలో కాల్షియం, విటమిన్ కె వంటి పోషకాలు ఉంటాయి. ఇవి ఎముకలకు కావాల్సినంత బలం అందిస్తాయి. తద్వారా వయసు పెరిగినా ఎముకలు బలంగా ఉంటాయి. బ్రోకలీలో విటమిన్ సి, యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవి రోగనిరోధక శక్తిని పెంచుతాయి. తద్వారా అనేక రకాల ఇన్ఫెక్షన్లకు దూరంగా ఉండొచ్చు.బ్రోకలీలో డైటరీ ఫైబర్ మెండుగా ఉంటుంది. ఇది పేగులను ఆరోగ్యంగా ఉంచి మలబద్ధకం ఏర్పడకుండా కాపాడుతుంది. అలాగే కడుపు ఉబ్బరం, గ్యాస్ వంటి సమస్యల నుంచి ఉపశమనం కల్పిస్తుంది. అయితే పచ్చిగా తింటే మాత్రం జీర్ణ సమస్యలు వస్తాయి. బ్రోకలీలో పొటాషియం, ఫైబర్, ఒమెగా–3 ఫ్యాటీ యాసిడ్స్ వంటి గుండెకు మేలు చేసే పోషకాలు అధికంగా ఉంటాయి. ఇవి రక్తపోటు అదుపులో ఉంచి హృదయ సంబంధ సమస్యలు రాకుండా కాపాడుతాయి.

# రోజూ గుడ్డు తినడం ఆరోగ్యానికి మంచిదేనా..? అసలు నిజాలు ఇవే..



గుడ్డు తక్కువ ధరలో అధిక పోషకాలు అందించే అద్భుత ఆహారం. కొలెస్ట్రాల్‌పై ఉన్న భయాలను పక్కనపెట్టి, సరైన పద్ధతిలో గుడ్లు తింటే అవి మెదడు పనితీరు, రోగనిరోధక శక్తి, కండరాల ఆరోగ్యానికి తోడ్పడతాయి. పచ్చసొనతో సహా ఉడికించిన గుడ్లు ఫైబర్ ఆహారంతో తీసుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చు. అనవసర కొవ్వులు, బ్యాక్టీరియా ప్రమాదాలు లేకుండా గుడ్లను ఆస్వాదించండి. తక్కువ ధరలో ఎక్కువ పోషకాలు లభించే ఆహారం ఏదైనా ఉందంటే అది ఖచ్చితంగా గుడ్డు మాత్రమే. అందుకే రోజూ ఒక గుడ్డు తినడం ఆరోగ్యానికి మంచిది అని వైద్యులు చెబుతుంటారు. అయితే గుడ్లు తినడం వల్ల కొలెస్ట్రాల్ పెరుగుతుందని, గుండె జబ్బులు వస్తాయని చాలామంది భయపడుతుంటారు. ఈ నేపథ్యంలో గుడ్లను ఎలా తింటే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందో ఇప్పుడు తెలుసుకుందాం..గుడ్డు: పోషకాల గనిగుడ్డులో ప్రోటీన్లు, సెలీనియం, కోలిన్, విటమిన్ బి12, ఎ, డి వంటి అత్యవసర పోషకాలు ఉంటాయి. ఇవి మెదడును చురుగ్గా ఉంచడానికి, రోగనిరోధక శక్తిని పెంచడానికి, కండరాల దృఢత్వానికి ఎంతో తోడ్పడతాయి.గుడ్లు తినేటప్పుడు చేయాల్సినవి మొత్తం గుడ్డు తినండి: చాలామంది పచ్చసొన తీసేసి కేవలం తెల్లసొన మాత్రమే తింటారు. కానీ పచ్చసొనలో కళ్లకు, మెదడుకు మేలు చేసే యాంటీఆక్సిడెంట్లు, విటమిన్ డి, ఆరోగ్యకరమైన కొవ్వులు ఉంటాయి. అందుకే మొత్తం గుడ్డు తినడం శ్రేయస్కరం.ఉడికించిన గుడ్లకే ప్రాధాన్యత: గుడ్లను నూనెలో వేయించడం కంటే ఉడకబెట్టి తినడం చాలా మంచిది. దీనివల్ల అదనపు కొవ్వు లేదా కొలెస్ట్రాల్ శరీరంలోకి చేరదు.ఫైబర్ ఆహారంతో జత చేయండి: గుడ్డులో ప్రోటీన్ ఉంటుంది కానీ ఫైబర్ ఉండదు. అందుకే గుడ్డు తిన్నప్పుడు కూరగాయలు, ఆకుకూరలు లేదా తృణధాన్యాలు కూడా తీసుకుంటే జీర్ణక్రియ సులభమవుతుంది.సరైన నిల్వ: గుడ్లను ఎల్లప్పుడూ ఫ్రిజ్‌లో లేదా కార్టన్ బాక్సులలో భద్రపరచాలి. అలాగే ఉపయోగించే ముందు పెంకుపై ఉండే బ్యాక్టీరియా పోయేలా సున్నితంగా కడిగి ఆరబెట్టాలి.గుడ్లు తినేటప్పుడు చేయకూడనివి పచ్చి గుడ్లు వద్దు: పచ్చివి లేదా సగం ఉడికించిన గుడ్లు తినడం వల్ల సాల్మొనెల్లా వంటి బ్యాక్టీరియా సోకే ప్రమాదం ఉంది. దీనివల్ల జ్వరం, కడుపు నొప్పి, విరేచనాలు రావచ్చు.అధిక ఉప్పు, వెన్న వాడకండి: గుడ్లలో ఎక్కువ ఉప్పు లేదా వెన్న చేర్చడం వల్ల వాటి సహజ పోషక విలువలు తగ్గిపోతాయి. ఇది రక్తపోటును పెంచి గుండెపై ప్రభావం చూపుతుంది.పాడైపోయిన గుడ్లు: చెడు వాసన వస్తున్నా, రంగు మారినా లేదా జిగటగా అనిపించినా ఆ గుడ్లను వెంటనే పారేయండి. అవి ఆరోగ్యానికి అత్యంత ప్రమాదకరం.కొలెస్ట్రాల్ సమస్య ఉన్నవారు ఏం చేయాలి?మీకు ఇప్పటికే అధిక కొలెస్ట్రాల్ లేదా గుండె సంబంధిత సమస్యలు ఉంటే మీరు తినే గుడ్ల సంఖ్యపై నియంత్రణ ఉండాలి. రోజువారీ ఆహారంలో కేవలం గుడ్లపైనే ఆధారపడకుండా కాయధాన్యాలు, చిక్కుళ్లు, చేపలు వంటి ఇతర ప్రోటీన్ వనరులను కూడా చేర్చుకోవాలి. గుడ్డు ఒక అద్భుతమైన ఆహారం. దానిని వండే పద్ధతి, తినే విధానం సరిగ్గా ఉంటే అది మీ ఆరోగ్యానికి రక్షణ కవచంలా పనిచేస్తుంది.

# రహదారి భద్రత మాసోత్సవాలను విజయవంతం చేయాలి

**రాష్ట్ర రోడ్డు రవాణా, వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్**







**హైదరాబాద్ డిసెంబర్ 20 :**రహదారి భద్రత మాసోత్సవాలను విజయవంతం చేయాలని రాష్ట్ర రోడ్డు రవాణా, వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. శనివారం హైదరాబాద్ నుండి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, రవాణా శాఖ, రోడ్లు భవనాల ప్రత్యేక కార్యదర్శి వికాస్ రాజ్, అదనపు డి. జి. పి. మహేష్ భగవత్ లతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, పోలీసు ఉన్నతాధికారులు, అదనపు కలెక్టర్లు, ఇతర శాఖల అధికారులతో రోడ్డు భద్రతా మాసోత్సవాల నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాలలో రహదారి భద్రత మాసోత్సవాలు – 2026 లను పకడ్బందీగా నిర్వహించాలని తెలిపారు. గత సంవత్సరం నుంచి రహదారి వారోత్సవాలను, రహదారి మాసోత్సవాలను నిర్వహించడం జరుగుతుందని, జనవరి మాసంలో రహదారుల నియమాలు, ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, తదితర అంశాలపై నెల రోజుల పాటు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఆర్.టి.సి., రవాణా శాఖ, విద్యాశాఖ, పోలీస్ శాఖ, జిల్లా రోడ్ సేఫ్టీ కమిటీల ఆధ్వర్యంలో కార్యక్రమాలను నిర్వహించాలని తెలిపారు. అధికారులు రహదారి భద్రతను సామాజిక బాధ్యతగా భావించి కార్యక్రమంలో పాల్గొనాలని, రోడ్డు ప్రమాదాల వల్ల కుటుంబాలు చిన్నాభిన్నం అవుతున్నాయని, ప్రతి ఒక్కరికి రోడ్డు భద్రత నియమాలపై అవగాహన కల్పించడంతో పాటు ట్రాఫిక్ ఉల్లంఘనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. విద్యార్థులకు రహదారి భద్రత, ట్రాఫిక్ నిబంధనలపై ముగ్గుల పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు, వ్యాసరచన క్విజ్ పోటీలు నిర్వహించడం ద్వారా అవగాహన కల్పించాలని, రోడ్ సేఫ్టీ వాలంటీర్లను నియమించి వారి ద్వారా ప్రజలకు రహదారి భద్రత నియమాలు తెలిసేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. ప్రతి నెల రహదారి భద్రత కమిటీల ఆధ్వర్యంలో సమావేశాలు నిర్వహించాలని, అవాంచిత రోడ్డు ప్రమాదాలు నివారించేలా కృషి చేయాలని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో రహదారుల నిర్మాణాలు, ఇన్ఫ్రాస్ట్రక్చర్ అభివృద్ధి చేయడం జరుగుతుందని తెలిపారు. అధిక వేగం, హెల్మెట్ లేకుండా ప్రయాణించడం, డ్రంక్ అండ్ డ్రైవ్ తదితర కారణాల వల్ల రహదారి ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయని, ప్రమాదాలు నివారించడానికి ప్రతి ఒక్కరూ రహదారి భద్రత సూచనలను పాటించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు.జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ రహదారి భద్రత కొరకు, రహదారి భద్రత కమిటీ ఆధ్వర్యంలో ప్రతి నెల సమావేశం నిర్వహించి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.జిల్లాలో ప్రమాద ప్రాంతాలను గుర్తించి వాహనదారులకు తెలిసే విధంగా ప్రమాద సూచికలు ఏర్పాటు చేయడంతో పాటు అవసరమైన ప్రాంతాలలో వేగనిరోధకాలు ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. రవాణా శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా భద్రతా నియమాలు పాటించని వారి లైసెన్సులు రద్దు చేయడం జరుగుతుందని, కొత్త సంవత్సర వేడుకలు దృష్ట్యా డిసెంబర్ 31 రోజున స్పెషల్ డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# హైదరాబాదులో నిర్వహించే విద్యా సదస్సు పోస్టర్ల ఆవిష్కరణ







**విద్యావ్యవస్థలో ఉపాధ్యాయులదే క్రియాశీలక భూమిక.**

**విద్యాశాఖ అధికారి దర్శనం భోజన్న.**

**ఆదిలాబాద్ జిల్లా ప్రతినిధి**నిర్మల్ జిల్లా కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో విద్యా సదస్సు పోస్టర్లను ఆవిష్కరించడం జరిగింది.ఈ సందర్భంలో జిల్లా విద్యాశాఖ అధికారి దర్శనం భోజన్న మాట్లాడుతూ విద్యావ్యవస్థను బలోపేతం చేయడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎనలేనిదని జిల్లా విద్యాశాఖ అధికారి దర్శనం భోజన్న గారు పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్ (టి.ఆర్.టి.ఎఫ్)ఆధ్వర్యంలో రేపు హైదరాబాదులో నిర్వహించే విద్యా సదస్సు పోస్టర్స్ ను సంఘ నాయకులతో కలిసి ఆవిష్కరించడం జరిగింది. ఈ సందర్భంగా విద్యాశాఖ అధికారి మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా ఉన్నటువంటి పాఠశాలలలో విద్యార్థులను మహోన్నతులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులు క్రియాశీలక భూమిక పోషించాలని, అదేవిధంగా విద్యా సదస్సులలో విద్యావ్యవస్థను బలోపేతము చేసే అంశంపై సమర్థవంతంగా చర్చ జరగాలని ఆకాంక్షించారు. విద్యార్థుల సర్వతోముఖ అభివృద్ధి కేంద్రంగా అధికారులు, ఉపాధ్యాయులు కలిసికట్టుగా ముందుకు వెళ్లాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దర్శనం దేవేందర్, గడ్డం భూమన్న, పేట సంఘం ప్రధాన కార్యదర్శి డేవిడ్ బెన్హర్, తెలంగాణ పేట సంఘం జిల్లా అధ్యక్షులు సత్తయ్య మరియు సుదార్ సింగ్ మొదలగువారు పాల్గొన్నారు.

# శుభ్‌మన్ గిల్, జితేష్ శర్మలకు నిరాశ



## ఇషాన్ కిషన్, రింకూ సింగ్‌ల రీఎంట్రీ
## న్యూజిలాండ్ తో టి20 సిరీస్‌కు జట్టు ఎంపిక..
## జనవరి 21న ఐదు టీ20ల సిరీస్ ప్రారంభం
## 2026 టీ20 వరల్డ్ కప్ కూ ఇదే జట్టు

వచ్చే నెలలో న్యూజిలాండ్‌తో ఆడబోయే 5 టీ20ల సిరీస్‌కు భారత జట్టును ప్రకటించింది. ఈ జట్టులో వైస్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌కు చోటు దక్కలేదు. అయితే వికెట్ కీపర్ ఇషాన్ కిషన్, బ్యాటర్ రింకూ సింగ్‌లకు అవకాశం వరించింది. అలాగే, జితేష్ శర్మకు సైతం ఈ సిరీస్‌లో చోటు దక్కలేదు. గిల్, జితేష్ స్థానంలో రింకూ సింగ్, ఇషాన్ కిషన్ చోటు దక్కించుకున్నారు.. భారత్, న్యూజిలాండ్ జట్ల మధ్య ఐదు టీ20ల సిరీస్ జనవరి 21 న ప్రారంభం కానుంది. జనవరి 31తో చివరి టీ20 జరుగుతుంది. ఆసక్తికరమైన విషయం ఏమిటంటే, న్యూజిలాండ్‌తో టీ20 సిరీస్‌కు ఎంపికైన జట్టు 2026 టీ20 వరల్డ్ కప్ ఆడుతుందని బీసీసీఐ స్పష్టం చేసింది. జితేష్ శర్మ, శుభ్‌మన్ గిల్‌ను టీ20 వరల్డ్ కప్ జట్టు నుంచి తొలగించారు. వారికి బీసీసీఐ అవకాశం ఇవ్వలేదు. 2026 టీ20 వరల్డ్ కప్, న్యూజిలాండ్‌తో టీ20ల సిరీస్‌కు నలుగురు బ్యాట్స్‌మెన్, ఇద్దరు వికెట్ కీపర్లు, ఇద్దరు స్పిన్ ఆల్ రౌండర్లు, ఇద్దరు పేస్ బౌలర్ ఆల్ రౌండర్లు, ముగ్గురు పేస్ బౌలర్లు, ఇద్దరు స్పిన్నర్లను బీసీసీఐ ఎంపిక చేసింది. 2026 టీ20 ప్రపంచ కప్ మ్యాచ్‌లకు భారత్, శ్రీలంక ఆతిథ్యం ఇస్తున్నాయి. పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ఆల్ రౌండర్లు, స్పెషలిస్ట్ బ్యాటర్లు, వికెట్ కీపర్ బ్యాటర్లు, స్పిన్నర్లు, పేసర్లు కలిపి మొత్తం 15 మంది ఆటగాళ్లను ఎంపిక చేసింది. న్యూజిలాండ్ టీ20 సిరీస్‌తో పాటు టీ20 వరల్డ్ కప్ జట్టులో ఇషాన్ కిషన్ చోటు దక్కించుకున్నాడు. ఇటీవల సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో ఇషాన్ కిషన్ జారండ్‌ను ఛాంపియన్‌గా నిలిపాడు. కిషన్ 500కు పైగా పరుగులు చేశాడు. జితేష్ శర్మ స్థానంలో ఇషాన్ కిషన్ జట్టులో స్థానం దక్కించుకున్నాడు. అలాగే, రింకూ సింగ్ కూడా జట్టులోకి రాబోతున్నాడు. రింకూ దక్షిణాఫ్రికాతో టీ20 సిరీస్‌లో భారత జట్టులో లేడు. ఫామ్ లేమితో సతమతం అవుతున్న స్టార్ బ్యాటర్ శుభ్‌మన్ గిల్‌ను కివీస్‌తో భారత టీ20 జట్టు నుంచి, టీ20 వరల్డ్ కప్ జట్టులో ఎంపిక చేయలేదు. కాగా సొంతగడ్డపై టీ20 ప్రపంచకప్ 2026 జరగనుండటంతో రిజర్వ్ ప్లేయర్లను ప్రకటించలేదని బీసీసీఐ సెక్రటరీ దేవజిత్ సైకియా తెలిపాడు. గాయపడ్డ ఆటగాళ్ల స్థానంలో కొత్త ప్లేయర్లను ఎంపిక చేయడం ఇబ్బంది కాదనే ఈ నిర్ణయం తీసుకున్నామని చెప్పాడు. ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026లో బరిలోకి దిగే భారత జట్టును బీసీసీఐ శనివారం ప్రకటించింది. ముంబైలోని బీసీసీఐ ప్రధాన కార్యాలయంలో బోర్డ్ సెక్రటరీ దేవజిత్ సైకియా అధ్యక్షతన జరిగిన టీమ్ సెలెక్షన్ సమావేశంలో చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్‌తో పాటు టీ20 కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్, సెలెక్టర్లు పాల్గొన్నారు. ఈ సమావేశం అనంతరం 15 మంది సభ్యులతో కూడిన భారత టీ20 ప్రపంచకప్ జట్టు వివరాలను చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ వెల్లడించాడు.మెగా టోర్నీలకు జట్టు ప్రకటించినప్పుడు రిజర్వ్ ప్లేయర్లను కూడా ప్రకటిస్తారు. గాయాలతో జట్టుకు దూరమైన ఆటగాళ్ల స్థానంలో వారిని జట్టులోకి తీసుకుంటారు. అయితే టీ20 ప్రపంచకప్ 2026 టీమ్‌కు రిజర్వ్ ప్లేయర్లను ప్రకటించలేదు. ఈ విషయంపై మీడియా ప్రతినిధులు ప్రశ్నించగా.. దేవజిత్ సైకియా వివరణ ఇచ్చాడు. 'ఈ టోర్నీ మన దేశంలోనే జరుగుతోంది కాబట్టి ఎవరైనా ఆటగాళ్లకు బదులుగా ఇతరులను ఎంపిక చేయడంలో మాకు ఎటువంటి ఇబ్బంది ఉండదు. అందుకే ఈ జట్టు కోసం ప్రత్యేకంగా రిజర్వ్ ఆటగాళ్లను ప్రకటించలేదు.'అని దేవజిత్ సైకియా చెప్పుకొచ్చాడు. న్యూజిలాండ్‌తో 5 టీ20ల సిరీస్‌కు



భారత జట్టు(టీ20 ప్రపంచకప్ జట్టు): సూర్యకుమార్ యాదవ్ (కెప్టెన్), అభిషేక్ శర్మ, తిలక్ వర్మ, అక్షర్ పటేల్ (వైస్ కెప్టెన్), సంజు శాంసన్ (వికెట్ కీపర్), ఇషాన్ కిషన్ (వికెట్ కీపర్), రింకూ సింగ్, శివమ్ దూబే, హార్దిక్ పాండ్యా, వాషింగ్టన్ సుందర్, అర్ష్‌దీప్ సింగ్, జస్ప్రీత్ బుమ్రా, కుల్దీప్ యాదవ్, వరుణ్ చక్రవర్తి, హర్షిత్ రాణా. ఇండియా, న్యూజిలాండ్ టీ20 సిరీస్ 2026 షెడ్యూల్ జనవరి 21 – 1వ టీ20: జామ్తా (రాత్రి 7 గంటలకు) జనవరి 23 – 2వ టీ20: రాయ్‌పూర్ (రాత్రి 7 గంటలకు%u) %జనవరి 25 – 3వ టీ20: గౌహతి (రాత్రి 7 గంటలకు) జనవరి 28 – 4వ టీ20: విశాఖపట్నం (రాత్రి 7 గంటలకు) జనవరి 31 %–% 5వ టీ20: తిరువనంతపురం (రాత్రి 7 గంటలకు)

## అక్షర్ పటేల్‌కు ఊహించని ప్రమోషన్



వచ్చే ఏడాది జరగనున్న ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026 కోసం ఎదురుచూస్తున్న కోట్లాది మంది భారత క్రికెట్ అభిమానుల నిరీక్షణకు తెరపడింది. ఫిబ్రవరి–మార్చి నెలల్లో భారత్, శ్రీలంక వేదికలుగా జరగనున్న ఐసీసీ పురుషుల టీ20 ప్రపంచకప్ 2026 కోసం టీమిండియాను నేడు అధికారికంగా ప్రకటించారు. ముంబైలోని బీసీసీఐ ప్రధాన కార్యాలయంలో చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్, కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్‌తో కూడిన సెలక్షన్ కమిటీ సుదీర్ఘ చర్చల అనంతరం 15 మంది సభ్యుల తుది జట్టును ఖరారు చేసింది. నిన్న అహ్మదాబాద్‌లో సౌతాఫ్రికాతో మ్యాచ్ ముగించుకుని సూర్యకుమార్ యాదవ్ ఆలస్యంగా రావడంతో ప్రెస్ కాన్ఫరెన్స్ కొంచెం ఆలస్యంగా ప్రారంభమైంది.2024 ప్రపంచకప్ గెలిచిన జట్టుతో పోలిస్తే ఈసారి టీమిండియాలో భారీ మార్పులు చోటుచేసుకున్నాయి. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, రవీంద్ర జడేజాల రిటైర్మెంట్ తర్వాత.. దాదాపు ఏడు కొత్త ముఖాలు ఈ మెగా టోర్నీలో కనిపించబోతున్నాయి. యువ ఆటగాళ్లపై నమ్మకంతో పాటు అనుభవజ్ఞుడైన అక్షర్ పటేల్‌కు వైస్ కెప్టెన్ బాధ్యతలు అప్పగించడం విశేషం. ప్రపంచకప్‌తో పాటు వచ్చే నెలలో న్యూజిలాండ్‌తో జరిగే సిరీస్‌కు కూడా ఇవే జట్లను ఎంపిక చేశారు. ఈ ఎంపికలో యశస్వి జైస్వాల్, రింకూ సింగ్‌ల విషయంలో తీవ్ర చర్చ జరగగా, రింకూను ప్రధాన జట్టులోకి తీసుకుని జైస్వాల్‌ను రిజర్వ్ ప్లేయర్‌గా ఉంచారు. అలాగే ఐపీఎల్‌లో మెరిసిన నితీష్ కుమార్ రెడ్డి, రియాన్ పరాగ్‌లను కూడా బ్యాకప్ ఆటగాళ్లుగా ఎంపిక చేశారు. హోమ్ గ్రౌండ్‌లో మ్యాచ్‌లు జరగనుండటంతో స్పిన్ విభాగానికి ఎక్కువ ప్రాధాన్యతనిస్తూ వరుణ్ చక్రవర్తి, రవి బిష్ణోయ్‌లను సెలెక్టర్లు జట్టులోకి ఆహ్వానించారు.


## రొమాంటిక్ సైడ్‌తోనూ పాండ్యా దుమ్మురేపాడు

అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియం సాక్షిగా టీమిండియా స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా అటు బ్యాటింగ్‌తోనూ, ఇటు తన రొమాంటిక్ సైడ్‌తోనూ దుమ్మురేపాడు. దక్షిణాఫ్రికాతో జరిగిన ఐదో టీ20లో హార్దిక్ కేవలం 16 బంతుల్లోనే హాఫ్ సెంచరీ బాది, భారత్ తరపున రెండో వేగవంతమైన హాఫ్ సెంచరీ చేసిన ప్లేయర్‌గా రికార్డు సృష్టించాడు. భారత్ ఈ మ్యాచ్‌లో 30 పరుగులతో గెలవడమే కాకుండా, సిరీస్‌ను 3–1తో కైవసం చేసుకుంది. అయితే, స్టేడియంలో హార్దిక్ బ్యాటింగ్ కంటే అతను తన ప్రేయసికి ఇచ్చిన ముద్దులే ఇప్పుడు సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారాయి. హార్దిక్ తన రికార్డు హాఫ్ సెంచరీ పూర్తి చేసిన వెంటనే, గ్యాలరీలో కూర్చుని తనను ఉత్సాహపరుస్తున్న ప్రేయసి మహీకా శర్మ వైపు చూస్తూ ముద్దుల వర్షం కురిపించాడు. తన ప్రియుడి మెరుపు ఇన్నింగ్స్‌ను చూసి మురిసిపోయిన మహీకా, ఎంతో ఆనందంతో రియాక్ట్ అయ్యింది. దీనికి సంబంధించిన వీడియో ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతోంది. ఆసియా కప్ 2025లో గాయపడిన తర్వాత హార్దిక్‌కు ఇదే మొదటి అంతర్జాతీయ సిరీస్. రీ–ఎంట్రీలోనే 186 స్ట్రైక్ రేట్‌తో పరుగులు రాబట్టడమే కాకుండా, మూడు వికెట్లు కూడా పడగొట్టి తన ఫామ్‌ను నిరూపించుకున్నాడు.మ్యాచ్ అనంతరం హార్దిక్ మాట్లాడుతూ ఒక ఆసక్తికరమైన విషయం చెప్పాడు. తను రెండో వేగవంతమైన హాఫ్ సెంచరీ చేశానన్న విషయం తనకు డ్రెస్సింగ్ రూమ్‌కు వెళ్ళే వరకు తెలియదట. "నేను అవుట్ అయి వెనక్కి వెళ్ళినప్పుడు మా సోషల్ మీడియా టీమ్ ఈ విషయం చెప్పింది. నా మొదటి రియాక్షన్ ఏంటంటే.. ఛా, ఫస్ట్ ప్లేస్ మిస్ అయ్యానా! అని. కానీ యువరాజ్ పాజీ (12 బంతుల్లో 50) రికార్డు ఇంకా పదిలంగా ఉన్నందుకు సంతోషంగా ఉంది" అని సరదాగా వ్యాఖ్యానించాడు. వచ్చే ఏడాది (2026) ఫిబ్రవరిలో జరగబోయే టీ20 వరల్డ్ కప్‌కు ముందు హార్దిక్ ఇలాంటి భీభత్సమైన ఫామ్‌లోకి రావడం టీమిండియాకు కొండంత బలాన్నిస్తోంది. డిఫెండింగ్ ఛాంపియన్ హోదాలో భారత్ తన మొదటి మ్యాచ్‌ను ఫిబ్రవరి 7న అమెరికాతో ఆడనుంది. ఆటలోనూ, ప్రేమలోనూ హార్దిక్ చూపిస్తున్న ఈ జోరు చూస్తుంటే వరల్డ్ కప్‌లో ప్రత్యర్థులకు చుక్కలు కనిపించడం ఖాయమని ఫ్యాన్స్ సంబరపడుతున్నారు.




## గౌతమ్ జట్టు మేనేజర్‌గా వ్యవహరించాలి

### భారత్ క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ కపిల్ దేవ్



టీమ్‌ఇండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ ఇటీవల కాలంలో అనేక విమర్శలకు గురవుతున్నాడు. ఏడాది కాలంలోనే స్వదేశంలో వరుసగా జరిగిన రెండు టెస్టు సిరీస్‌లు క్లీన్ స్వీప్ అవ్వడంతో ట్రోల్స్ ఎక్కువయ్యాయి. జట్టులో గంభీర్ ఫేవరెటిజం చూపిస్తున్నాడన్న ప్రచారమూ జరుగుతోంది. ఈ క్రమంలో భారత్ క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ కపిల్ దేవ్ తాజాగా గంభీర్‌పై కీలక వ్యాఖ్యలు చేశాడు. గంభీర్ కోచ్ కాదని, అతడు భారత జట్టు మేనేజర్ అని అన్నాడు. రీసెంట్‌గా కోల్‌కతాలో జరిగిన 'ఇండియన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ శతాబ్ది ఉత్సవాలు' కార్యక్రమంలో కపిల్ దేవ్ పాల్గొన్నాడు. ఈ ఈవెంట్‌లోనే కపిల్ ఈ వ్యాఖ్యలు చేశాడు. మోడ్రన్ క్రికెట్‌లో, ప్లేయర్లను మేనేజ్ చేయడమే హెడ్ కోచ్ పాత్ర అని, అంతేకానీ నేరుగా వాళ్లను కోచింగ్ చేయడం కాదని కపిల్ అన్నాడు. 'ఈ రోజుల్లో కోచ్ అనే పదం కామన్ అయిపోయింది.

## మిడిలార్డర్ బలాన్ని పెంచేందుకే గిల్‌ను తప్పించాం



● టీమిండియా టీ20 కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్

మిడిలార్డర్ బలాన్ని పెంచేందుకే శుభ్‌మన్ గిల్‌ను పక్కన పెట్టాల్సి వచ్చిందని టీమిండియా టీ20 కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ తెలిపాడు. టాపార్డర్ వికెట్ కీపర్ ఇషాన్ కిషన్‌తో పాటు రింకూ సింగ్ కోసం గిల్‌ను తప్పించాల్సి వచ్చిందని వివరణ ఇచ్చాడు. శుభ్‌మన్ గిల్ పేలవ ఫామ్ నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకోలేదని, అతని క్లాస్ బ్యాటింగ్‌పై తమకు ఎలాంటి సందేహం లేదని స్పష్టం చేశాడు. ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026లో బరిలోకి దిగే భారత జట్టును బీసీసీఐ శనివారం ప్రకటించింది. ముంబైలోని బీసీసీఐ ప్రధాన కార్యాలయంలో బోర్డ్ సెక్రటరీ దేవజిత్ సైకియా అధ్యక్షతన జరిగిన టీమ్ సెలెక్షన్ సమావేశంలో చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్‌తో పాటు టీ20 కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్, సెలెక్టర్లు పాల్గొన్నారు. ఇషాన్ కిషన్, రింకూ సింగ్ కోసం ఈ నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందని సూర్యకుమార్ యాదవ్ తెలిపాడు. 'శుభ్‌మన్ గిల్ ఫామ్ నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకోలేదు. టీమ్ కాంబినేషన్ కోసమే అతన్ని పక్కనపెట్టాల్సి వచ్చింది. టాపార్డర్‌లో మాకు ఒక వికెట్ కీపర్ కావాల్సి వచ్చింది. అంతే తప్పా శుభ్‌మన్ గిల్ ఫామ్ గురించి కాదు. అతని క్వాలిటీ మీద మాకు ఎలాంటి సందేహాలు లేవు.అతను ఒక అద్భుతమైన ఆటగాడు. మాకు రింకూ సింగ్ అవసరం ఏర్పడింది. అలాగే వాషింగ్టన్ సుందర్‌ను కొనసాగించాలనుకున్నాం. అందుకే రకరకాల కాంబినేషన్లకు అనుగుణంగా ఉండటానికి మేం ఫ్లెక్సిబిలిటీని కోరుకున్నాం. ఆ కారణంతోనే ఈ జట్టును ఎంచుకున్నాం. గిల్ క్లాస్ విషయంలో మాకు ఎలాంటి ప్రశ్నలు, సందేహాలు లేవు'అని సూర్యకుమార్ యాదవ్ స్పష్టం చేశాడు.

తన పేలవ ఫామ్‌పై స్పందించిన సూర్యకుమార్ యాదవ్.. త్వరలోనే మునపటి సూర్యను చూస్తారని విశ్వాసం వ్యక్తం చేశాడు. 'ఈ గడ్డు కాలం చాలా కాలంగా కొనసాగుతోంది. ఆటగాళ్లందరూ తమ కెరీర్‌లో ఏదో ఒక సమయంలో ఇలాంటి దశను అనుభవిస్తారు. ఈ కఠిన పరిస్థితులను ఎలా అధిగమించాలో నాకు తెలుసు. లోపాలను సరిదిద్దుకోవడానికి నాకు సమయం ఉంది. త్వరలోనే మీరు కచ్చితంగా బ్యాటర్ సూర్యను మళ్లీ చూస్తారు.'అని సూర్యకుమార్ యాదవ్ చెప్పుకొచ్చాడు.

# వెన్నులో వణుకు పుట్టించేలా ఈషా

## 25న వస్తోన్న థ్రిల్లర్

త్రిగుణ్, హెబ్బాపటేల్ కీలక పాత్రల్లో రానున్న హారర్ థ్రిల్లర్ 'ఈషా'. శ్రీనివాస్ మన్నె దర్శకుడు. ఆ హారర్ థ్రిల్లర్ డిసెంబర్ 25న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో విడుదలకు మందు ఆసక్తికరమైన వీడియోను టీమ్ పంచుకుంది. ఆత్మ అంటే అదేనేమో అంటూ హీరోయిన్ చెప్పే డైలాగు భయపెట్టేలా ఉంది. ఇటీవల 'లిటిల్ హార్ట్స్', 'రాజు వెడ్స్ రాంబాయి' వంటి వరుస కల్ట్ హిట్స్ అందించిన సక్సెస్‌ఫుల్ జోడీ బన్నీ వాస్, వంశీ నందిపాటి. కలిసి ఇప్పుడు ప్రేక్షకులకు ఒక క్రేజీ హారర్ అనుభూతిని పంచడానికి సిద్ధమయ్యారు. వీరి సరికొత్త హారర్ థ్రిల్లర్ 'ఈషా' డిసెంబర్ 25న థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల కాబోతోంది. ఈ చిత్రం గురించి మేకర్స్ తాజాగా 'వార్నింగ్ వీడియో' పేరిట ఒక ఆసక్తికరమైన వీడియోను విడుదల చేశారు. సాధారణంగా హారర్ సినిమాలకు ట్రైలర్లు రావడం సహజం, కానీ ఇలా ప్రత్యేకంగా హెచ్చరిక వీడియో రావడం హారర్ జానర్‌లోనే ఇదే తొలిసారి. ఈ సినిమా కథ విషయానికి వస్తే.. ఆత్మలు, దెయ్యాలు లేవని బలంగా నమ్మే కొందరు స్నేహితుల చుట్టూ ఈ కథ తిరుగుతుంది. సమాజంలోని మూఢనమ్మకాలను, దొంగ బాబాలను ఎండగట్టాలని వారు భావిస్తారు. ఈ క్రమంలో వారికి పృథ్వీరాజ్ (బబ్లూ) నుంచి ఒక సవాలు ఎదురవుతుంది. 'ఆత్మలు ఉన్నాయని నిరూపిస్తే..?' అంటూ ఆయన




విసిరే ఛాలెంజ్‌తో ఈ స్నేహితుల బృందం ఒక చీకటి ప్రపంచంలోకి అడుగుపెడుతుంది. మనుషుల్లాగే కొన్ని స్థలాలు కూడా పుట్టుకతోనే శాపగ్రస్తమై ఉంటాయి.. కాలక్రమేణా అవి ఆత్మలకు నిలయాలుగా మారుతాయని దర్శకుడు శ్రీనివాస్ మన్నె ఇచ్చిన వార్నింగ్ ప్రేక్షకుల్లో క్యూరియాసిటీని పెంచుతోంది. ట్రైలర్ మరియు ఈ వార్నింగ్ వీడియోలో కనిపించిన విజువల్స్ భయానకంగా ఉన్నాయి. ముఖ్యంగా పాడుబడిన బంగ్లా, క్షుద్ర పూజల సెటప్, బ్లూ అండ్ డార్క్ థీమ్ విజువల్స్ వెన్నులో వణుకు పుట్టిస్తున్నాయి.సంతోష్ లైటింగ్, ధ్రువన్ అందించిన బ్యాక్ గ్రౌండ్ స్కోర్ సినిమాలోని భయాన్ని రెట్టింపు చేస్తున్నాయి. ఈ చిత్రంలో ఉండే సడన్ ట్విస్ట్‌లు చూసి భయపడే అవకాశం ఉన్నందున, గుండె బలహీనంగా ఉన్నవారు ఈ సినిమా చూడకూడదని చిత్ర బృందం స్పష్టం చేసింది. ఇందులో త్రిగుణ్, అఖిల్ రాజ్ హీరోలుగా నటించగా, హెబ్బా పటేల్ హీరోయిన్‌గా నటించింది. సిరి హనుమంతు, బబ్లూ, పృథ్వీరాజ్ ఇతర కీలక పాత్రలు పోషించారు. డిసెంబర్ 25న విడుదల కానున్న ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద ఎలాంటి ప్రకంపనలు సృష్టిస్తుందో చూడాలి.

# మళయాల దర్శకుడు, నటుడు శ్రీనివాసన్ కన్నుమూత



మలయాళ చిత్ర పరిశ్రమలో తీవ్ర విషాదం నెలకొంది. ప్రముఖ సీనియర్ నటుడు, దర్శకుడు, స్క్రీన్ ప్లే రచయిత శ్రీనివాసన్ కన్నుమూశారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన చికిత్స పొందుతూ శనివారం తుదిశ్వాస విడిచారు. నటుడిగా, దర్శకుడిగా, కథా రచయితగా ఐదు దశాబ్దాల పాటు కేరళ చిత్ర పరిశ్రమకు ఆయన సేవలు అందించాడు. 'వడక్కునోక్కియంత్రం', 'చింతవిశిష్టాయ శ్యామల' వంటి చిత్రాలకు ఆయన దర్శకత్వం వహించడమే కాకుండా రాష్ట్ర, జాతీయ అవార్డులను కూడా అందుకున్నారు. శ్రీనివాసన్ ఇద్దరు కుమారులు వినీత్ శ్రీనివాసన్, ధ్యాన్ శ్రీనివాసన్ కూడా మలయాళ చిత్ర పరిశ్రమలో నటులుగా, దర్శకులుగా రాణిస్తున్నారు. శ్రీనివాసన్ మృతి పట్ల కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్, నటులు మోహన్ లాల్, మమ్ముట్టి సహా పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు.

# సామాజిక సందేశంతో వస్తోన్న దండోరా

గ్రామీణ నేపథ్యంలో సాగే సందేశాత్మక చిత్రాలకు తెలుగు ప్రేక్షకులు ఎప్పుడూ బ్రహ్మరథం పడతారన్న విషయం తెలిసిందే. తాజాగా అదే కోవలో తెలంగాణ సంస్కృతి, సామాజిక అంశాల కలబోతగా వస్తున్న చిత్రం 'దండోరా'. మురళీకాంత్ దర్శకత్వంలో రవీంద్ర బెనర్జీ ముప్పానేని నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 25న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ ఈ చిత్రాన్ని నైజాం ఏరియాలో విడుదల చేస్తుండటం సినిమాపై మరింత అంచనాలను పెంచింది. విదేశాల్లో కూడా ఈ సినిమా భారీ ఎత్తున విడుదల కానుంది. సుమారు 200కు పైగా థియేటర్లలో ప్రదర్శితం కాబోతున్న ఈ చిత్రానికి సంబంధించి, ఈ నెల 23నే అక్కడ ప్రీమియర్స్ పడనున్నాయి. అయితే ఈ




సినిమా విడుదలకు ఇంకా వారం కూడా లేకపోవడంతో తాజాగా ట్రైలర్‌ను విడుదల చేసింది చిత్రయూనిట్.గ్రామాల్లో ఇంకా కులం అడ్డుగోడలు తొలగిపోలేదని ఈ ట్రైలర్ చూస్తుంటే అర్థమవుతుంది. ప్రారంభంలోనే ఊరి బయట శవాన్ని మోసుకెళ్తున్న దృశ్యాలు, 'మన చావు పుట్టుకలన్నీ ఈ ఊరి బయట రాసిండ్రా ఆ దేవుడు..' అనే డైలాగ్ ఈ సినిమాలో ఉన్న సామాజిక కోణాన్ని ఎత్తి చూపుతోంది. ఈ చిత్రంలో శివాజీ, నవదీప్, నందు, రవికృష్ణ, మానికా చిక్కాల, మౌనికా రెడ్డి, బిందుమాధవి, రాధ్య, అదితి భావరాజు వంటి భారీ తారాగణం కీలక పాత్రలు పోషించారు. మార్క్ కె. రాబిన్ అందించిన సంగీతం సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలవనుంది. తెలంగాణ మట్టి వాసనతో కూడిన కథలను ఇష్టపడే వారికి 'దండోరా' ఒక మంచి అనుభూతిని ఇస్తుందని చిత్ర యూనిట్ ధీమా వ్యక్తం చేస్తోంది.

-------------



# బిర్యానీ పాత్రలో సంపూర్ణేశ్ బాబు

నేచురల్ స్టార్ నాని, 'దసరా' ఫేమ్ శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్‌లో వస్తున్న భారీ యాక్షన్ చిత్రం 'ది ప్యారడైజ్' నుంచి ఒక షాకింగ్ అప్‌డేట్ వచ్చింది. ఈ సినిమాలో 'బర్నింగ్ స్టార్' సంపూర్ణేష్ బాబును ఒక సరికొత్త ఊర మాస్ అవతారంలో శ్రీకాంత్ ఓదెల చూపించబోతున్నాడు. ఎప్పుడూ తనదైన కామెడీతో నవ్వించే సంపూర్ణేష్ బాబును దర్శకుడు శ్రీకాంత్ ఓదెల పూర్తిగా మార్చేశాడు. 'ది ప్యారడైజ్' చిత్రంలో సంపూ 'బిర్యానీ' అనే మాస్ పాత్రను పోషిస్తున్నారు. శుక్రవారం విడుదలైన ఆయన ఫస్ట్ లుక్ పోస్టర్ ఇప్పుడు ఫిల్మ్ నగర్‌లో హాట్ టాపిక్‌గా మారింది. ఈ పోస్టర్‌లో సంపూర్ణేష్ బాబు ఒంటి నిండా రక్తపు మరకలతో, భుజాన గొడ్డలి వేసుకుని, బీడీ తాగుతూ చాలా సీరియస్ లుక్‌లో కనిపిస్తున్నారు. ఆయన కళ్లలో కనిపిస్తున్న క్రూరత్వం చూస్తుంటే, ఇందులో ఆయన కేవలం కామెడీకి పరిమితం కాకుండా ఒక పవర్‌ఫుల్ పాత్ర చేస్తున్నట్లు అర్థమవుతోంది. ఈ చిత్రంలో హీరో నాని (జడల్) కి అత్యంత సన్నిహితుడైన స్నేహితుడిగా, ప్రాణమిచ్చే నమ్మకస్థుడిగా 'బిర్యానీ' పాత్ర ఉండబోతోంది. ఈ పాత్ర కోసం సంపూర్ణేష్ బాబు చాలా బరువు తగ్గి, తన బాడీ లాంగ్వేజ్‌ను కూడా పూర్తిగా మార్చుకున్నట్లు చిత్ర బృందం తెలిపింది.

ర్శకుడు శ్రీకాంత్ ఓదెల తన సినిమాల్లో పాత్రలను చాలా సహజంగా, గంభీరంగా చూపిస్తారు. 'దసరా'లో కమెడియన్లను కూడా సీరియస్ పాత్రల్లో చూపించినట్లుగానే, ఇప్పుడు సంపూ లోని యాక్షన్ యాంగిల్‌ను బయటకు తీయబోతున్నారు. 'హైదరాబాద్ నేపథ్యంలో సాగే కథలో 'బిర్యానీ' లేకుండా ఉండదు' అంటూ ఈ పాత్రను ఇంట్రడ్యూస్ చేసిన తీరు వైరల్ అవుతోంది. ఈ చిత్రంలో నానితో పాటు, మోహన్ బాబు, రాఘవ్ జుయల్, సోనాలి కులకర్ణి కీలక పాత్రల్లో నటిస్తున్నారు. అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తుండగా.. ఈ సినిమా 2026 మార్చి 26న ప్రపంచవ్యాప్తంగా 8 భాషల్లో (తెలుగు, హిందీ, తమిళం, కన్నడ, మలయాళం, బెంగాలీ, ఇంగ్లీష్, స్పానిష్) గ్రాండ్‌గా విడుదల కానుంది.


# నెట్‌ఫ్లిక్స్‌లోకి వస్తోన్న ఆంధ్రా కింగ్ తాలూకా

రామ్ పోతినేని, భాగ్యశ్రీ బోర్సే ప్రధాన పాత్రల్లో నటించిన తాజా చిత్రం 'ఆంధ్ర కింగ్ తాలూకా'.. తెలుగు సినీ అభిమాని కథగా నవంబర్ 27న ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రం మంచి విజయాన్ని అందుకుంది. అయితే ఈ సినిమా విడుదలై నెల కూడా తిరక్కుండానే ఓటీటీలోకి రాబోతుంది. ప్రముఖ ఓటీటీ వేదిక నెట్‌ఫ్లిక్స్‌లో డిసెంబర్ 25 నుంచి తెలుగు, హిందీ, తమిళ్, మలయాళం, కన్నడ భాషల్లో ఈ చిత్రం స్ట్రీమింగ్ కాబోతున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. విషయాన్ని తెలుపుతూ నెట్‌ఫ్లిక్స్ కొత్త పోస్టర్‌ను విడుదల చేసింది. మహేశ్‌బాబు.పి దర్శకత్వం వహించిన ఈ సినిమాలో కన్నడ స్టార్ ఉపేంద్ర కీలక పాత్రలో నటించాడు. ఈ సినిమా కథ విషయానికి వస్తే.. సూర్య(ఉపేంద్ర) పేరుమోసిన సూపర్‌స్టార్. అశేషమైన అభిమానుల అతని సొంతం. అయితే.. తనకు బ్యాడ్ పిరియడ్ నడుస్తూ ఉంటుంది. విడుదలైన సినిమాలన్నీ ఎ÷-లాపులవుతుంటాయి. ఈ క్రమంలో సూర్య వందవ చిత్రం షూటింగ్ మధ్యలోనే ఆగిపోతుంది. చిత్రాన్ని నిర్మించలేనని నిర్మాత చేతులెత్తేస్తాడు. ఓ మూడు కోట్లు ఉంటే సినిమా పూర్తవుతుంది. ఆ మూడు కోట్ల కోసం సూర్య ప్రయత్నాలు మొదలుపెడతాడు. ఈ క్రమంలో ఓ నిర్మాతను డబ్బు అడుగుతాడు.




# పవన్‌తో నటించడం ఒక గౌరవం: రాశీ ఖన్నా

పవర్ స్టార్ పవన్ కల్యాణ్ హీరోగా, దర్శకుడు హరీశ్ శంకర్ తెరకెక్కిస్తున్న భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'ఉస్తాద్ భగత్ సింగ్'. ఈ సినిమాలో కీలక పాత్ర పోషిస్తున్న నటి రాశీ ఖన్నా, తాజాగా షూటింగ్ సెట్స్ నుంచి కొన్ని ఆసక్తికరమైన బీటీఎస్ (బిహైండ్ ది సీన్స్) వీడియోలను అభిమానులతో పంచుకున్నారు.తన అధికారిక ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో ఈ వీడియోలను షేర్ చేసిన రాశీ ఖన్నా, "యాక్షన్ మరియు కట్ మధ్య నిశ్శబ్దం ఉంటుంది. కొన్నిసార్లు నవ్వులు కూడా ఉంటాయి" అంటూ దర్శకుడు హరీశ్ శంకర్‌ను ట్యాగ్ చేశారు. ఈ వీడియోలను చూస్తే, ఆమె షూటింగ్‌ను ఎంతో ఆస్వాదిస్తున్నట్లు స్పష్టంగా తెలుస్తోంది.గతంలో కూడా పవన్ కల్యాణ్‌తో కలిసి పనిచేయడం ఒక గౌరవంగా భావిస్తున్నానని రాశీ పేర్కొన్న విషయం తెలిసిందే. ఆయనతో దిగిన ఒక సెల్ఫీని పంచుకుంటూ, ఈ సినిమా తనకు ఎప్పటికీ గుర్తుండిపోయే మధుర జ్ఞాపకం అని ఆమె తెలిపారు. 'ఉస్తాద్ భగత్ సింగ్' చిత్రంలో రాశీ 'శ్లోక' అనే ముఖ్యమైన పాత్రలో నటిస్తున్నట్లు చిత్రబృందం గతంలో ప్రకటించింది.మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్న ఈ చిత్రంలో శ్రీలీల మరో కథానాయికగా నటిస్తోంది.



Printed, Published & Owned by CH. Rajkumar, Published at H.no. 5-5-616, Kothirampur.Dist- Karimnagar 505001. TELANGANA State printed at SRI BALAJI PRINTING PRESS, H.NO.4-4-55, Tilak Road, Karimnagar -505001,
Head office: 2-66-121/122 near ramky one Marvel gajullaramaram Quthbulapur medchal Malkajgiri district. TELANGANA STATE. CHIEF EDITOR : K.SRAVAN KUMAR 9866330400 , RNI. NO. APTEL/2010/35724. EMAIL:Peoplesnews0909@gmail.com